ISSN 0971-278X

జూన్ 2022 సంచిక : 448 వెల : 25/-

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక






కవి, కథకుడు, రచయిత, చిత్రకారుడు

**శీలావీర్రాజు సంస్మరణలో....**

జనసాహితి ప్రచురణ



45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

448

సంపుటి : 45

సంచిక : 11

జూన్ 2022

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

website : www.prajaasaahithi.com

**నివాళి**

చిత్రకారుడు, కవి, కథ, నవలారచయిత శీలా వీర్రాజు జూన్ 1న తన 83వ ఏట హైదరాబాదులో మరణించారు. ఆయన సంస్మరణలో జనసాహితి ఈ 'ప్రజాసాహితి'ని ప్రత్యేక సంస్మరణ సంచికగా మీకు అందిస్తోంది.

ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమంలో రచయితగా, చిత్రకారునిగా తన జీవితాంతం వీర్రాజు కృషిచేశారు. ఆయన జీవితం, వ్యక్తిత్వం ప్రజారచయితలకు, కళాకారులకు ఆదర్శనీయం.

వారిని స్మరించుకుంటూ..... – జనసాహితి

## ఈ సంచికలో...


- ముఖచిత్రం : శీలా వీర్రాజు సంస్మరణలో.... – చిత్రం : అంతర్జాలం నుండి ..... 01
- రెండవ అట్ట : శీలా వీర్రాజు గీసిన చిత్రాలు ..... 02
- మూడవ అట్ట : శీలా వీర్రాజు గీసిన చిత్రాలు ..... 35
- నాల్గవ అట్ట : శీలా వీర్రాజు గీసిన చిత్రం ..... 36
- కవితాక్షర నివాళితో అంతిమయాత్ర ..... 04
- శీలావీర్రాజుగారి సంస్మరణ సమావేశం – విజయవాడ ..... 04
- నేను – నా కవిత్వం – శీలా వీర్రాజు ..... 05
- జీవన ఔన్నత్యమే శీలావి జీవిత, కళాసాహిత్యాల తత్త్వం – బి. సూర్యసాగర్ ..... 11
- శీలా వీర్రాజుగారికి జనసాహితి జోహార్లు ..... 13
- నా జ్ఞాపకాలు – కొత్తపల్లి రవిబాబు ..... 14
- నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం శీలా వీర్రాజుగారు – దివికుమార్ ..... 15
- భయం (కవిత) – శీలా వీర్రాజు ..... 17
- కవితా చిత్రకళా సౌజన్యమూర్తి శీలావీ – నిఖిలేశ్వర్ ..... 18
- గురువుగారితో నా ప్రయాణం – కొన్ని చిత్రాలు – వారాల కృష్ణమూర్తి ..... 19
- చిత్రకళ సృష్టికర్త శీలా వీర్రాజు – సన్నిధానం నరసింహశర్మ ..... 22
- శీలా వీర్రాజుగారి చిత్రకళాప్రదర్శన – ప్రొ॥ ఎస్.వి. రామారావు ..... 23
- కాకి బతుకు (కవిత) – శీలా వీర్రాజు ..... 26
- ఊరు వీడ్కోలు చెప్పింది (కథ) – శీలా వీర్రాజు ..... 27
- జర్మనీలో శీలా వీర్రాజు చిత్రకళాప్రదర్శన – అరుణ ..... 31
- మారుతున్న విలువలు – రచయిత – శీలా వీర్రాజు ..... 32
- విలువల వీర్రాజు (కవిత) – రామ్మోహన్ ..... 34
- జనజ్వాల, డా॥ నాళేశ్వరం శంకరంల వ్యాసాలు వచ్చే సంచికలో


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

‘ప్రజాసాహితి’
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
“అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |


ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# శీలా వీర్రాజుగారికి కవితాక్షర నివాళితో అంతిమ యాత్ర



**శీలా** వీర్రాజుగారు జూన్ 1వ తేదీ సాయంత్రం తన 83వ ఏట అనారోగ్యంతో మరణించారు. వీర్రాజుగారి ఇంటివద్ద ఆయన భౌతికకాయానికి రచయిత వారాల కృష్ణమూర్తి, జనసాహితి జంటనగరాల శాఖ కార్యదర్శి డా॥ భట్టు లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళి అర్పించారు. రచయితలు నాళేశ్వరం శంకరం, కె. శివారెడ్డి, ఎన్. గోపి, ఇంద్రగంటి జానకీబాల, పొత్తూరి విజయలక్ష్మి , బి.ఎస్. రాములు, నవీన్, ఆశారాజు తదితర రచయితలు, కవులు; శంకర్, అన్వర్ తదితర కార్టూనిస్టులు, వీర్రాజుగారి కుటుంబ సభ్యులు జోహార్లు చెబుతూ నివాళులు అర్పించారు.

జూన్ 2వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని వివేకానందనగర్ స్మశానవాటికలో ఉదయం 11:30 గం॥కు అంతిమ సంస్కారాలు జరిగాయి. నిబద్ధతతో జీవిస్తూ, ప్రజలకోసం సాహిత్య, చిత్రకళా కృషి నిరంతరం కొనసాగించిన వీర్రాజుగారు ఎందరికో ఆదర్శంగా నిలిచారని చెపుతూ ఈ అంతిమ వీడ్కోలు కార్యక్రమాన్ని ఎం. లక్ష్మి నిర్వహించారు.

అంతిమ సంస్కార సమయంలో శీలా వీర్రాజుగారు రాసిన కవితలను సుధామ, నందిని సిధారెడ్డి, ఎన్. వేణుగోపాల్, రఘు చదివి అంతిమ వీడ్కోలు పలికారు. ✦

# శీలా వీర్రాజుగారి సంస్మరణ సమావేశం

**2-6-22**న విజయవాడలో సాయంత్రం 6 గం॥కు శీలావీని స్మరించుకుంటూ రచయితలు, కళాకారులు, కవుల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని జనసాహితి ప్రధానకార్యదర్శి అరుణ నిర్వహించారు. శీలావీ సాహిత్య వ్యక్తిత్వాన్ని, జనసాహితితో అనుబంధాన్ని వివరించారు. శీలా వీర్రాజుగారి చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. ముందుగా జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ శీలావీతో ఆయనకున్న 50 సం॥ల క్రితపు పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయనతో సాహిత్య పరిచయం ఉన్నా నిర్మలానందగారి ద్వారా జనసాహితికి ఆయన బాగా దగ్గరయ్యారని, అప్పటి నుంచి చివరివరకూ జనసాహితితో, ‘ప్రజాసాహితి’తో ఆయనకు ఆత్మీయ ఉద్యమ అనుబంధం కొనసాగిందన్నారు. ఆయన రచనలను పరిచయం చేశారు. ‘సాహిత్య ప్రస్థానం’ సంపాదకవర్గసభ్యులు ఒరప్రసాద్ మాట్లాడుతూ నాళేశ్వరం శంకరంగారి ద్వారా శీలావీ పరిచయమయ్యారని, జంటనగరాలలో ‘సాహిత్య ప్రస్థానం’ ఆవిష్కరణ శీలావీగారే చేశారని గుర్తుచేసుకున్నారు. శీలావీ పరిచయంకన్నా ముందే ‘మైనా’ నవల చదివానని, ఆయన గొప్ప సాహితీవేత్త అని ముందు తెలియదని చెప్పారు. శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆయన చాలా సున్నితంగా ఉండేవారని కానీ విషయాల గురించి చర్చించేటప్పుడు చాలా ఖచ్చితంగా వుండేవారని ఉదహరించారు. శ్రీశ్రీ సాహిత్యనిధికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించారన్నారు. అరసం బాధ్యులు కొండపల్లి మాధవరావుగారు ‘అమరత్వం రమణీయమైనదన్న’ కవితాపంక్తులను చదివి విన్పించారు. చందు నాగేశ్వరరావు, పి. మోహనరాంప్రసాద్ మరికొంతమంది మిత్రులు సమావేశంలో పాల్గొన్నారు. ✦

# నేనూ – నా కవిత్వం

కథలూ, నవలలూ రాస్తూవున్న నేను అకస్మాత్తుగా కవితారంగం లోకి అడుగుపెట్టడం యాదృచ్ఛికమే. అయినా సూక్ష్మంగా ఆలోచిస్తే దీనికి మూలాలు, చాలా లోతుగా, బాల్యంవరకు చొచ్చుకుపోయి వున్నట్లు అర్థమైంది. బాల్యం నించీ నాకు చిత్రకళలో ప్రవేశంవుంది. నేను కలం పట్టుకోడానికి ముందే కుంచె పట్టుకున్నాను. ఆ తర్వాత సమాంతరంగానే యీ రెండూ ఈనాటివరకూ కొనసాగుతూ వస్తున్నాయి.

సాధారణంగా చిత్రకారుడికి రసదృష్టి ఎక్కువ. రంగులపట్ల ఆకర్షణ, ప్రకృతిపట్ల ఆరాధన, అందంపట్ల యిష్టం, ఏకాంతంకోసం తపన, వుండి వుండీ చటుక్కున ఆలోచనల్లోకి జారడం వంటి లక్షణాలు మోతాదుకుమించి ఎక్కువగా వుంటాయి. తొలిరోజుల్నుంచి కూడా నా కథల్లో, నవలల్లో యీ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. కల్పనా జగత్తులో విహరించే యీ భావుకలక్షణమే తర్వాతికాలంలో కవిత్వంవైపు నన్ను ఆకర్షించి వుండాలి.

సాధారణంగా కవికి కథకుడికన్న కల్పనాశక్తి ఎక్కువగా వుంటుంది కనుక నాలోని యీ కాల్పనిక శక్తికి 'అవుట్‌లెట్' కావలసివచ్చినప్పుడు కథకన్న, నవలకన్న కవిత్వాన్నే నేను ఆశ్రయించాల్సివచ్చిందని నాలోకి నేను తొంగిచూసుకున్నప్పుడు నాకు అర్థమైంది.

తొలిరోజుల్లో – అంటే నేను యింకా పాఠక దశలో వున్నప్పుడు నాకు ఆధునిక కవిత్వంపట్ల ఆసక్తిని 'తెలుగు స్వతంత్ర' కలిగించింది. ఆ పత్రిక రెండో పేజీలో పూర్తిగా ఒక పేజీ అంతా ఒక కవిత ప్రచురించేవారు. తొలితరం ఆధునిక కవులు చాలామంది ఆ పేజీలోనే కనిపించేవారు. కవిత్వంపట్ల నాకు కలిగిన ఆనాటి ఆసక్తి కార్యరూపం ధరించడానికి చాలాకాలం పట్టింది. అప్పటికి ఓ ఐదు కథాసంపుటాలు మూడు నవలలు నావి అచ్చయి, రచయితగా కొద్దోగొప్పో గుర్తింపు వచ్చింది. ఆ దశలో నేను కవిత్వరంగంలోకి అడుగుపెట్టాను.

అప్పుడైనా, నేను కవిని కావడంకోసం అడుగుపెట్టలేదు. సాహిత్యంలో ప్రయోగాలంటే నాకున్న యిష్టంవల్ల కథలో ఒక ప్రయోగం చేయడంకోసం, ఒకే ఇతివృత్తాన్ని తీసుకుని వివిధ నిర్మాణ శిల్పాల లో అయిదో ఆరో కథలు రాయాలనుకుని; కవిత్వాన్నీ, కథనీ మేళవించి 'వచనకవిత్వ కథ' అనే కొత్త ప్రక్రియారూపంలో ఒక కవిత్వ కథ రాశాను. ఆ ప్రయోగమే నన్ను కవిగా ముద్రవేసి నా సాహితీ గమనం మలుపు తిరగడానికి కారణమయ్యింది.

మొట్టమొదటిసారిగా నన్ను కవిగా గుర్తించి, అభినందించి ప్రోత్సహించి, యీ ప్రక్రియను యిలాగే కొనసాగించమని గట్టిగా పట్టుబట్టినవాడు నా సహోద్యోగి, ప్రముఖ కవి కుందుర్తి. ఆయన వస్తుపరంగా కష్టజీవిని కథానాయకుడ్ని చేయడమే కాకుండా ప్రక్రియాపరంగాకూడా కవిత్వాన్ని మరింతగా సరళంచేసి సామాన్యుడికి చేరువగా తీసుకువచ్చాడు. అంతటితోనే ఆయన వూరుకోలేదు. మిగతా కవుల్లాగ కొత్త కవితాప్రక్రియలో తన మానాన తాను కవిత్వం రాసుకుంటూ కూచోకుండా, ఆ ప్రక్రియను భుజాన్నేసుకుని, చిన్నా పెద్దా లేకుండా ప్రతి కవినీ చేరి, వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంలాగ ప్రచారం చేసాడు. ఆయన ఆలోచనకు అనుగుణంగా వచనకవిత

కథకి నేను శ్రీకారం చుట్టడం ఆయనకు అమితమైన ఆనందాన్ని యిచ్చింది. గొప్ప విశ్వాసాన్ని కలిగించింది. ఆయన నామీద కొండంత ఆశ పెట్టుకున్నాడు.

కుందుర్తి ఆశలు వమ్ముచేయదలచలేదు. వచన కవితా ప్రక్రియలో మరో రెండు కథలు రాసి, ఆ మూడింటితో 1965 లో 'కొడిగట్టిన సూర్యుడు' పేరుతో నా మొదటి కవితా సంపుటి వెలువరించాను. దీనికి కవిత్వాభిమానులనించీ, విమర్శకుల నించీ 'ఒక కొత్త ప్రయోగంగా' గుర్తింపు వచ్చింది. దీనితో సాహితీలోకంలో 'కవి'గా నాకొక స్థానం లభించింది.

ఆ తర్వాత మరో నాలుగేళ్ళకు ఇంకొక మూడు వచనకవితా కథలతో మరో పుస్తకం వెలువరించాను.

అయితే కుందుర్తి ఆశించినట్టు యీ ప్రక్రియ అంతగా విస్తరించలేదు. దీనికి కారణాలు చాలా వున్నాయి. పాత్రల్నీ, సంఘటనల్నీ కవిత్వంలోకి చొప్పిస్తే కవిత్వం పలచబడిపోతుం దేమోనన్న భయం కవికి ఏర్పడి వుండొచ్చు. వాస్తవికతను, కల్పనను సమతూకంగా నడపడంలో రచయితకున్న శక్తిసామర్థ్యా లు కవికి లేకపోవడం కావచ్చు. కవిత్వమంటే స్వీయానుభూతి ప్రధానంగా వుండాలిగాని యిలా యితరుల అనుభూతుల్లోంచి మాట్లాడడం ఏమిటన్న ఆలోచన కవికి కలగడంవల్ల కావచ్చు. సరిగ్గా యిదే సమయంలో ఒక వెల్లువలాగ వచ్చిపడిన మినీ కవితల కారణంగా కొత్త కవులు యీ ప్రక్రియ పట్ల అంతగా శ్రద్ధ చూపించకపోవడం కావచ్చు. అసలు యీ ప్రయోగాన్నే కవులు యిష్టపడకపోవడంవల్ల కావచ్చు– కారణం ఏదైనప్పటికీ మూడున్నర దశాబ్దాలు గడిచినా యితరుల దగ్గర్నుంచి అయిదారు వచన కవిత్వ కథలకన్న ఎక్కువ రాలేదు. ఈ ప్రక్రియ కేవలం ఒక ప్రయోగంగా మాత్రమే వుండిపోయింది.

నామట్టుకు నాకు కథాంశతో కవిత్వం రాయడం కత్తిమీద సాము వంటిదిగా అనిపించింది. కథనం ఎక్కువైతే కవిత్వంపాలు పలచబడుతుంది. కవిత్వాంశ చిక్కగా వుండాలనుకుంటే వాస్తవికత దెబ్బతింటుంది. ఖండికలు రాయడానికి అలవాటుపడిన కవికి దీర్ఘకవితలు రాయాలంటే ప్రతిభతోపాటు ఓర్పు కూడా వుండాలి. ఒక ఆలోచన మనసులో పుట్టీ పుట్టడంతోటే దాన్ని కాగితం మీదకి దించగానే సరిపోదు. ముందు వెనుకలు చూసుకోవాలి. అన్వయాలు సరిచేసుకోవాలి ఒక భాగానికి మరో భాగానికి అతుకులు వేసుకోవాలి. నగిషీలు, చిత్రికలు సరేసరి. ఇన్ని ప్రయత్నాలూ ఓపిగ్గా చేసుకోవాలి. ఇన్ని సర్దుబాట్లూ, ఇన్ని కూర్పులూ చేర్పులూ చిన్న కవితకి కంటే దీర్ఘకవితకి ఎక్కువ అవసరం. అప్పుడే ఆ దీర్ఘకవిత రాణిస్తుంది. వచన కవితా కథ ఒక విధంగా దీర్ఘకవితగా పరిగణించవచ్చు. దీనిలా పాత్రలూ, సంఘటనలతో కథాత్మకమైన దీర్ఘకవితలే కాకుండా వర్ణనాత్మకమైనవో, సందేశాత్మకమైనవో, లేదా దృశ్యాత్మకమైనవో దీర్ఘకవితలు కూడా అంతగా రాకపోవడానికి కారణం బహుశా యిదే కావచ్చు.

అయితే యిన్నేళ్ళ తర్వాత, యిటీవల మూడు నాలుగేళ్ళుగా పోటాపోటీగా దీర్ఘకవితల వెల్లువ ప్రారంభమైంది. సగానికి సగం మంది కవులు తమ దృష్టిని దీర్ఘకవితలవైపు మళ్ళించడం ఒక శుభసూచన. ఈ ప్రయత్నంలోంచే ముందు ముందు కవిత్వ కథలు కూడా వెలువడే అవకాశం లేకపోలేదు.

1973లో నగరజీవితం నేపథ్యంగా నేనొక దీర్ఘకావ్యాన్ని రాశాను. పాత్రలూ, సంఘటనల్లో కూడిన కథాత్మక కావ్యం కాదిది. ఉషస్సు, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, సంధ్య, రాత్రి, అర్ధ రాత్రి సమయాలలో మహానగరంలోని జీవన దృశ్యాలను చూపించే ఏడు అధ్యాయాల వర్ణనాత్మక దృశ్యకావ్యం యిది.

అంతకు ముందు వచ్చిన రెండు కవితా సంపుటాలనాటికి నేనొక ప్రయోగవాదిని మాత్రమే. ఆధునిక మానవుని జీవితంలో ఆర్థికాంశాలకు గల ప్రాముఖ్యాన్ని చెప్పినా, వర్తమాన సమాజపు ఎగుడు దిగుడుల తీరుతెన్నులను చూపినా ప్రధానంగా వీటిలో ప్రేమకు,స్నేహానికి,మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చి రాసిన రచనలే ఇవి. ఈ దేశంలో కోట్లాదిమంది శ్రమజీవుల స్వేద ఫలాలు బహుకొద్దిమంది సంపన్నుల బొక్కసాన్ని నింపడానికి తరలిపోతున్న వైనాన్ని రచనల్లో తెలియజేయడానికి ప్రయత్నించని రోజుల్లో వెలువడినవే ఆ రెండు సంపుటాలూ.

అరవై దశకంనాటికి అభ్యుదయ రచయితల కలాలు కొన్ని రాజీమార్గాలు పట్టిపోగా, మరికొన్ని ఎక్కడికక్కడ చతికిలబడిపోగా నిస్తేజంగా వుండిపోయిన తెలుగు సాహితీ క్షేత్రంలోకి 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘం కొత్త చైతన్యాన్ని తీసుకుని వచ్చింది. అందులో వున్నవారిమీదే కాక వెలుపలవున్న చాలా మందిమీద కూడా దీని ప్రభావం పడింది. అలాంటి వారిలో నేనూ వున్నాను. 1973లో వెలువడిన నా దీక్ష కావ్యంలోగాని, ఆ తర్వాత వచ్చిన మరో రెండు ఖండికల కవితా సంపుటాలలోగాని యీ విషయం స్పష్టపడుతుంది. అధ్యయనంవల్లా అనుభవంవల్లా నాలో వచ్చిన రాజకీయ,సామాజిక అవగాహనకు ఇవి అద్దంపడతాయి. డెబ్బయికి ముందు వచ్చిన నా రచనలకూ, ఆ తర్వాత వచ్చిన రచనలకూ గిరిగీసినంత స్పష్టంగా తేడా తెలుస్తుంది. కవికి సమాజ స్పృహ విధిగా వుండితీరాలని, తన చుట్టూ జరుగుతున్న సామాజిక ఆర్థిక రాజకీయ దోపిడీలకు కవి ప్రతిస్పందించి తీరాలని తెలుసుకున్న తర్వాత వెలువడిన రచనలివి.

కొందరు తమ బాధల్నే కాదు ఇతరుల బాధల్ని గురించి కూడా ఆలోచించడానికి భయపడుతారు. ఆలోచించి బాధ

పడడం వారికి యిష్టం వుండదు. అలాంటివారు యీనాడు కవిత్వం రాయడానికి పనికిరారు.

కవికి ప్రతిభ ఎంత ముఖ్యమో నిజాయితీకూడా అంతే ముఖ్యమని నమ్ముతాను నేను. కవిత్వం నేడు ఫలానా విధంగా వుందిగనుక ఆ సిద్ధాంతాలపట్లా, ఆధారాలపట్లా నమ్మకం లేకపోయినా తానూ ఆవిధంగానే రాయాలన్న గాలివాటు తత్వం నాకు నచ్చదు.

జీవితంలోనూ, కవిత్వంలోనూ నిరాడంబరత్వాన్ని ప్రేమిస్తాను.

వాస్తవానికి దగ్గరగా ఆలోచించే ప్రయత్నం చేస్తాను.

పాఠకుడ్ని ఆకర్షించడంకోసం గోరంతల్ని కొండంతలు చేసి రాయను.

లేనిపోని జిమ్మిక్కులు చేయను.

ప్రయోగాలంటే నాకు ఇష్టం. సాహిత్యం పురోగమించాలంటే శిల్పపరంగా కొత్తకొత్త ప్రయోగాలు జరుగుతూ వుండాలి. నాకు కవితలో వస్తువు ఎంత ముఖ్యమో దాని శైలి, శిల్పాలు కూడా అంతే ముఖ్యం. అవి రెండూ సమాంతరంగా కొనసాగుతూ వున్నప్పుడే సాహిత్యం అభివృద్ధి చెందుతుందని నా నమ్మకం.

పాఠకుడికన్న తాను తెలివైనవాడిననే అహంకారం కవికి లేనప్పుడే అతను పాఠకుడి హృదయానికి మరింత దగ్గరగా వెళ్ళగలుగుతాడని నా ప్రగాఢ విశ్వాసం.

ఇదీ నా కవిత్వతత్వం.

— శీలా వీర్రాజు

సమీక్ష

# జీవన ఔన్నత్యమే శీలావి జీవిత, కళాసాహిత్యాల తత్త్వం

- బి. సూర్యసాగర్

**ప్రతి** మనిషికి తన జీవితమే ప్రథమ ప్రాధాన్యత కలిగినది. ఎలా జీవించినా అది తన జీవితం. ప్రకృతి, ఇతరులు, సమాజము, విలువలు, అనుభూతులు, ఘటనలు, సంబంధాలు, సంఘర్షణలు – సర్వస్వమూ అవి తన జీవితంలో, ఆలోచనల్లో పొందిన స్థానాన్ని బట్టి మాత్రమే విలువను కలిగి వుంటాయి.

తన జీవితాన్ని గురించి ఇతర సామాజికులతో చెప్పుకోవాలనే కోరిక మానవ సహజమైనది. స్వీయచరిత్ర వర్తమానంలో తన జీవిత మదింపుగా వుంటూ తదుపరి జీవనయానానికి మార్గసూచికగా కూడా ఉపయోగిస్తుంది. దానికి విశిష్ట ఆకర్షణ, ఉపయోగము వున్నాయి. అది వారికే కాకుండా ఇతరులకు కూడా విలువను కలిగి వుంటుంది. కొన్ని ఆదర్శాలను ఏర్పరచుకోవడానికో, తిరస్కరించడానికో దోహద పడుతుంది. అంటే అది సామాజిక విలువను కలిగి వుంటుంది. ఉన్నత విలువలతో నిండి, నిజాయితీగా వ్యక్తమైనప్పుడు సామాజిక సంఘర్షణలో ప్రగతిశీల పాత్రను పోషిస్తుంది. శీలావి గారి **పడుగు పేకల మధ్య జీవితం** ఈ కోవకు చెందుతుంది.

కవితారూపంలో ఆత్మకథ తెలుగులో శీలావిగారి రచన ప్రథమం. ఇతర దేశీయ భాషల్లోగానీ, ప్రపంచంలోని ఇతర భాషల్లోగానీ అలాంటి ప్రయత్నం ఏదైనా జరిగిందా అన్నది సందేహమే. పాబ్లో నెరూడా అలా రాశారని నిర్మలానంద అన్నట్లు గుర్తు. పరిశీలించాలి. ఆవిధంగా శీలావి గారి రచన విశిష్టమైనది; అపురూపమైనది. చాలావరకు కవిత్వం పొల్లుపోకుండా తన జీవిత కథను స్థూలంగా చెప్పారు. శీలావిగారు మంచి వచన కవి. ఆ రూపంలో కథాకావ్యాలు కూడా రాశారు. వచనకవితా రూపాన్ని గాఢంగా ఆరాధించి, సాధనచేసి, ప్రచారం చేసిన కుందుర్తి మెప్పును పొందారు. కథలనే కాదు ఆత్మకథలను కూడా వచన కవిత్వంలో చక్కగా రాయవచ్చని శీలావి నిరూపించారు. ఇదొక కొత్త ఒరవడి.

శీలావి జీవితమూ, సాహిత్యమూ ఉన్నత జీవన విలువల కలనేతలు. ఆ విలువల నుంచి ఆయన ఎన్నడూ వైదొలగలేదు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయనది విశిష్టస్థానం. ఆయన గొప్ప ప్రయోగశీలి. సంస్థల నిర్మాణంలో లేకపోవడము, సాధారణంగా వేదికలకు దూరంగా వుండిపోవడంవల్ల ఆయన పేరు అంతగా ప్రాచుర్యం పొందలేదు. నగరజీవిత సంక్లిష్టతను అత్యంత ప్రతిభావంతంగా కవిత్వీకరించిన కవి శీలావి. కుత్సితాల మధ్య కృత్రిమ సంస్కారాల మధ్య, ధగద్ధగాయమాన వస్తు వైభవం మధ్య, ఎవరూ పట్టని నగర జీవితంలో దుఃఖితులను, అనాథలను, పేదలను ఆయన చూపు, ఆయన కవిత్వమూ ఆప్యాయంగా తడిమాయి. ఇదంతా మారక తప్పదనే విశ్వాసాన్ని ఆయన ప్రకటిస్తాడు. జీవితాన్ని ప్రేమించడమంటే, సంఘర్షణను గుర్తెరగడమంటే అదే కదా. 'మైనా' నవల ఒక ప్రగాఢ జీవితాన్వేషణ. ఆయన కథా సాహిత్యము అంతే. బహుముఖ ప్రజ్ఞతో శీలావి జీవించి సృజించారు.

కథకుడుగా, చిత్రశిల్పిగా, నవలాకారుడుగా, కవిగా ఆయన సృజనాత్మక వ్యక్తిత్వం అద్భుతంగా వెల్లడైంది. జీవన పోరాటంలో ఆయన పడిన సృజనాత్మక సంఘర్షణ ఆ విధంగా ఫలించింది.

వామపక్ష భావజాలానికి చేరువకాక ముందు నుంచీ కూడా ఆయన ప్రజాస్వామికవాది. ప్రజాస్వామిక దృక్పథము, గొప్ప సౌందర్య దృష్టి, తొణికిసలాడే భావుకత, స్వేచ్ఛాకాంక్ష, మానవీయ స్పర్శ ఆయన సాహిత్యానికి గొప్ప విలువను, ఆకర్షణను సంతరింపచేశాయి. ఆయన ఎల్లప్పుడూ బాధితుల పక్షానే నిలిచాడు. దర్పాన్నీ, దురహంకారాన్నీ, పీడననూ, కుసంస్కారాన్నీ, కపటత్వాన్నీ అసహ్యించుకున్నాడు. సరళమైన, అర్థవంతమైన జీవితాన్ని ఆయన కోరాడు. అలాగే జీవించారు. **పడుగూ పేకల మధ్య జీవితం** దీన్నంతా స్పష్టపరిచింది. ఆయనను ఎరిగినవారెవరైనా అందులో అతిశయోక్తులు, అవాస్తవాలు లేవని చెప్పగలరు.

విజయనగరం జిల్లా నుంచి వచ్చి రాజమండ్రిలో స్థిరపడిపోయిన ఒక చేనేత కార్మిక కుటుంబంలో "మట్టి రంగు బక్కప్రాణి"గా జన్మించి అనేకానేక ప్రభావాలకు లోనవుతూ పొందిన జీవన క్రమ వికాసాన్ని మనమీ పుస్తకంలో చూస్తాము. అందుకే ఈ పుస్తకం ఎంతో విజ్ఞానదాయకమైనది. జీవితాలను బేరీజు వేసుకోవడానికి అవసరమైన ప్రమాణాలను ఇందులో గుర్తించగలము.

నిత్య సత్యాన్వేషిగా ఆయన సాగించిన జీవన వెతుకులాట జీవన సంఘర్షణలను, సౌందర్యాన్ని, అర్థాన్ని తెలుసుకొనేలా చేసింది. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గురువులు అందించిన ప్రేమ హస్తాలను ఆసరా చేసుకొని సాగిన జీవితారోహణను ఈ కావ్యం హృద్యంగా మనముందుంచింది.

శీలావి తన బాల్యాన్ని, దాని అనుభూతి ముద్రలను కావ్యంలో నమోదుచేసిన తీరు అపురూపమయినది. ఎవరి బాల్యం వాళ్ళకి ముచ్చటగాక మరేమిటి అంటూ పెద్దల స్పందనలు, తన స్వీయ జ్ఞాపకాలు ఆధారంగా ఒక మహత్తర సౌందర్యలోకాన్నే ఆయన ఆవిష్కరించారు. బాల్యం నుంచి ఆయన వ్యక్తిత్వంలో, సౌందర్యదృష్టిలో భాగమైపోయిన గోదావరినది ఆయన సృజనాత్మకతకు గొప్ప ఆలంబనగా వుండిపోయిన వైనం మనం చూడగలం. సౌందర్య తపన, ప్రకృతి ఆరాధన ఆయనలో అవిభాజ్య అంశమైపోయాయి.

నదంటే / ఊగే ఊయల కాదా / ఊరేగే పల్లకీ కదా / ఈదే దారికదా / తానాలరేవు కదా.... అంటూ ఆయన చేసిన గానం ఒక సాటిలేని సుందర దృశ్యాన్ని మనముందుంచింది.

మొత్తం ప్రకృతిలో బాల్యాన్ని మించిన అద్భుతం ఏముంది? శీలావిగారిది బీదవాళ్ళ బాల్యమే. నిజానికి బీదపిల్లల బాల్యమే అత్యంత సంపద్వంతమైన అనుభవాలను, అనుభూతులను సంచయనం చేస్తుంది. శీలావి ఆత్మకథ దీన్ని రుజువు పరచింది. బాల్యంలోనే ఆయనకు బొమ్మలను గీచి ఆనందించే తత్త్వం పట్టుబడింది. ఆ కళాతత్త్వం తరవాతి జీవితాన్ని నడిపించింది.

మన అభిరుచులు, న్యాయాన్యాయ విచక్షణలు బాల్యంలోనే, కౌమారంలోనే ఎక్కడో స్పష్టాస్పష్ట చిరునామాల వద్ద రూపం పోసుకుంటాయి. అవి పుట్టి పెరిగే తీరు మహాద్భుతం. ఆ చిరునామాలు పట్టుకోవడానికి శీలావి ఈ కావ్యంలో గొప్ప కవిత్వాన్వేషణ చేశారు. అదొక తాత్త్విక స్వభావాన్ని సంతరించుకుంది.

శీలావి వ్యక్తిత్వంలోకి స్నేహశీలత ఈ ఆత్మకవితాత్మక కావ్యం ద్వారా ప్రస్ఫుటమైంది. స్నేహాన్ని ప్రేమలా ఆరాధించే మనస్తత్వం తనది అని ఆయన ప్రకటించారు. ఆయనలోని విశిష్ట భావుకత ఇందులోనూ వెల్లడైంది. తనది బిడియ మనస్తత్వం అని చెప్పుకున్నా ఆయన ఆత్మీయ స్నేహితుల ప్రపంచం చిన్నదేమీ కాదు. తన సంస్కారానికీ, తను విశ్వసించి గౌరవించే విలువలకు తగిన వారితోనే ఆయన స్నేహం చేసి కొనసాగించాడు. ప్రగాఢ మానవీయ స్పర్శతో మాత్రమే ఆయన తన స్నేహితులను ప్రస్తావిస్తాడు. ఆ స్నేహాలు తన జీవన వికాసానికి, సాహిత్య, వ్యక్తిత్వ వికాసానికి ఎలా తోడ్పడిందీ, పోషించిందీ తెలియపరిచారు. కె.కె. మీనన్, నిర్మలానంద, వారాల కృష్ణమూర్తిలను రత్నాల నిధులు అని గొప్పగా ప్రశంసించారు. కుందం ప్రకాశరావు, రంధి సోమరాజు, వేమూరి నరసింహారావు, వినుకొండ నాగరాజు, సాయిబాబా, మల్లేశ్, రాఘవరెడ్డి, కేశవరావు, రావూరి భరద్వాజ, కుందుర్తి, మాదేటి రాజాజీ, శ్రీపతి, శిష్టా శకుంతల – ఇలా తనపై స్నేహాభిషేకం చేసినవారినందరినీ ఆయన కావ్యంలో ఆప్యాయంగా, ఎనలేని గౌరవంతో తడిమారు. భావుకతతో కళకళలాడే స్నేహ ప్రపంచమది. బుచ్చిబాబు తన ఆరాధ్య రచయిత కావడానికి, తనకు వారసుడు శీలావి అని బుచ్చిబాబు ప్రకటించడాన్ని నియంత్రించిన సూత్రం ఉన్నతభావుకతే.

స్నేహ సంబంధాల పట్ల శీలావి తాత్త్వికతను, ఆయన జీవితంలో స్నేహసంబంధాల పాత్రను గురించి ఒక ప్రత్యేక పరిశీలనే జరపవచ్చు అని తోస్తుంది.

ఎవరితో వ్యవహరించినా తన ఆత్మగౌరవాన్ని ఆత్మాభిమానాన్ని నిలుపుకుంటూ, ఇతరుల ఆత్మాభిమానాన్ని గౌరవిస్తూ ఆయన సంచరించారు. కులపరంగానో, ఉద్యోగ హోదాపరంగానో అహంకారంతో తనను కించపరచాలని చూసినవారిని ఆయన క్షమించలేదు. ప్రజాస్వామిక దృక్పథము, హేతువాద వైఖరి, విమర్శనాత్మక పరిశీలన శీలావి ఆలోచనను, ఆచరణను నియంత్రించాయి. చదువు సంస్కారాన్నివ్వనప్పుడు పాండిత్యం వల్ల ప్రయోజనం లేదు కదా అని స్పష్టంగా చెప్పారాయన.

తన రచనల పాఠకురాలిగా దోబూచులాడి అభిరుచుల్లోనూ, సంస్కారంలోను తనకు సరిజోడి అయిన తన చినమావయ్య కూతురు అయిన సుభద్రాదేవితో దాంపత్యం ఏర్పడి ఇరువురూ పడుగూ పేకలా అల్లుకుపోవడంతో కావ్యం ముగిసింది. వారి రచనా వ్యాసంగం వల్ల తెలుగు సాహిత్యం సంపద్వంతమైంది. అది మన ముందున్న వాస్తవం.

అసంఖ్యాక పుస్తకాల ముఖచిత్ర శిల్పిగా మాత్రమే ఆయన్ను చాలామంది గుర్తిస్తుంటారు. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర విస్మరించ వీలులేని ఉత్తమోత్తమ సాహిత్యాన్ని ఆయన సృజించారన్నది మరవకూడని వాస్తవం. చిత్రకళారంగంలో ఆయన పూర్ణ వికాసాన్ని ఉపేక్షించడంవల్ల ఆ రంగానికి ఎంతో నష్టం జరిగింది. ఎందుకంటే చిత్రకళ బహుకొద్ది మందికి మాత్రమే అలవడే కష్టతరమైన కళాప్రక్రియ.

సాహిత్యసంస్థల చట్రాలలో ఇమడలేనని చెప్పుకున్నా ప్రగతిశీల సాహిత్య సంస్థలను గౌరవిస్తూ, వాటి పాత్రను ప్రశంసించారు. తెలుగు సాహిత్యంలో విరసం స్థాపన ఒక మూలమలుపు అని ప్రస్తావించారు. జనసాహితికి ఆయన ఆత్మీయ సాహితీ మిత్రులే.

దిగంబర కవిత్వాన్ని శీలావి అంగీకరించలేకపోయారు. అశ్లీలత ప్రయోగించారని, రాజ్యం మీద చూపాల్సిన కోపాన్ని సమాజం మీద చూపారని దిగంబరకవులను తప్పు పట్టారు. పాలకవర్గాలే కాదు విప్లవకర వర్గాలు కూడా రకరకాల క్షీణసంస్కృతీ ప్రభావాల్లో నిస్తేజమైపోయిన స్థితికి నిరసనగా దిగంబర కవిత్వం ఒక సాహిత్య ప్రతిచర్యగా వచ్చింది. ఆ పరిస్థితుల్లో అది సహజ ప్రతిక్రియ. అశ్లీలతా ప్రయోగం కూడా ఆ స్థితికి సహజమైనదే. చదువరులైన యువతతో దిగంబరకవిత్వం దిగజారిన సామాజిక వ్యవస్థ పట్ల నిరసన జ్వాలలను రేపిందన్నది వాస్తవం. అది మూడు సంచికలతోనే ఆగిపోవడానికి కారణం విప్లవ సాహిత్యోద్యమ ఆవిర్భావంతో దిగంబర కవిత్వానికి ప్రాసంగికత తొలగిపోవడమే.

దిగంబర కవిత్వంపట్ల శీలావి వ్యతిరేకతకు ఆయన ఈస్థటిక్స్‌కు అది సరిపడకపోవడమే కారణం కావచ్చు.

నూటా డెబ్బై పేజీల ఈ ఆత్మకథాత్మక కావ్యం తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ప్రయోగం. సామాన్య భాషలో అద్భుత కవితాశైలిలో కావ్యం నిర్మాణమైంది. అత్యంత స్పందనాత్మక స్వభావాన్ని కలిగి ఉంది. కావ్యంలో ఆయన సృజించిన అనేక కవితాత్మక భావచిత్రాలు మనల్ని వెన్నాడుతాయి. ఉన్నత సామాజిక, సృజనాత్మక ఆలోచనలు, సంస్కృతీ విలువలు కావ్యంలో పొదిగి వున్నాయి. శీలావిని ఉత్తమ సామాజికుడిగా, సాహితీవేత్తగా, కళాకారుడిగా తీర్చిదిద్దిన ప్రభావాలు తెలుగు సమాజానికి చెందినవి. అంటే అది మన సామాజిక చరిత్ర కూడా. అందువల్ల **'పడుగు పేకల మధ్య జీవితం'** తప్పక చదవాల్సిన గ్రంథం. శీలావిగారి సాహిత్యాన్ని చదవడానికి కూడా ఈ కావ్యం పాఠకుల్లో ప్రేరణ కలిగిస్తుందని భావించవచ్చు. తెలుగు సాహిత్యానికి ఇదొక విశిష్టమైన చేర్పు. శీలావిగారికి మనసారా అభినందనలు.

**– ప్రజాసాహితి, జనవరి 2004** ✦

# శీలా వీర్రాజుగారికి జోహార్లు!

**ప్రజాపక్షపాతి,** ప్రజా కవి, అలుపెరగని సజీవ చిత్రాల చిత్రకారుడు, అభ్యుదయ ఉద్యమాలకు నిస్సంకోచంగా ముందుండి మద్దతు పలికిన సాహితీ ఉద్యమ కార్యకర్త శీలా వీర్రాజు గారికి (83 సం.లు) జనసాహితి జంట నగరాల శాఖ వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నది. వీర్రాజుగారు పది రోజుల పాటు అనారోగ్యంతో బాధపడ్డారు. మూత్ర సంబంధ సర్జరీ కూడా జరిగి కోలుకుని ఇంటికి వచ్చారు. ఇంతలోనే ఆయన మనకు దూరమయ్యారు. జూన్ 1, 2022 న సాయంత్రం మరణించారు.



శీలా వీర్రాజుగారిది సుదీర్ఘ కళా, సాహితీ ప్రయాణం. ఆ ప్రయాణం వందలమంది రచయితలు, కవులు కళాకారులతో కలిసి సాగింది. మిత్రులతో కలిసి రంజని, ఫ్రీవర్స్ ఫ్రంట్ ద్వారా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతోమందిని సాహిత్య కారులుగా, చిత్రకారులుగా ప్రోత్సహించారు. ముందుమాటలు రాసి, ముఖచిత్రాలు వేసి ఇచ్చి సహకరించేవారు. తన స్వీయ రచనలకు, ప్రచురణలకు ఎన్నో ముఖచిత్రాలు వేశారు. 'పడుగు పేకల మధ్య జీవితం' ఆయన ఆత్మకథ. 'కలానికి అటూ ఇటూ' వ్యాస సంకలనం. 'మైనా', 'వెలుగురేఖలు', 'కాంతిపూలు', 'కరుణించని దేవత', వీర్రాజుగారి నవలలు. కథలు, కవితల సంపుటాలు, వర్ణచిత్రాల పుస్తకం, ఇంకాఎన్నో వెలువరించారు. వీర్రాజుగారి రచనలు కొన్ని ఇంగ్లీషు, హిందీ, తమిళ భాషలలోకి అనువాదమైనాయి.

నిర్మలానందగారితో, 'ప్రజాసాహితి' పత్రిక, జనసాహితి సంస్థలతో వీర్రాజుగారు గాఢమైన అనుబంధంతో ఇన్నేళ్ళుగా సాగుతూ వచ్చారు. ఒక ప్రజాస్వామికవాదిగా పాలకులు తెచ్చే అప్రజాస్వామిక విధానాలు, ప్రజావ్యతిరేక చర్యలను ప్రశ్నించడంలో అనేక సందర్భాలలో ముందున్నారు. ఎక్కడైనా ప్రజలు వివిధ సమస్యలపైన ఆందోళనలు సాగిస్తున్నప్పుడు వాటికి సంఘీభావం తెలపడంలో వీర్రాజుగారు, సుభద్రాదేవిగారు వివిధ సంస్థలు, వ్యక్తులతో కలిసి నడిచారు. అటువంటి శీలా వీర్రాజుగారి మరణం తెలుగు సాహితీ లోకానికి, కళారంగానికి చాలా బాధను మిగిల్చింది.

చిత్రకారుడిగా శీలా వీర్రాజు సాగించిన ప్రస్థానం మరువలేనిది. ప్రజాజీవనమే శీలా వీర్రాజుగారి కళా ప్రపంచం. ఆయన జీవిత కాలంలో గీసిన గొప్ప చిత్రాలను లక్షల రూపాయలకు కొంటామన్నా డబ్బుకి ప్రాధాన్యత ఇవ్వకుండా తన మొదటి గురువు దామెర్ల రామారావు పేరుమీద రాజమండ్రిలో ఉన్న చిత్ర ప్రదర్శనశాలకు ఇటీవలే వాటిని చేర్చారు. చిత్ర ప్రదర్శనలను హైదరాబాద్, విజయవాడలలోను, తెలుగురాష్ట్రాల్లోని ఇతరచోట్ల జనసాహితి, ఇతర స్నేహితుల సహకారంతో సొంత ఖర్చులతో ఏర్పాటు చేసేవారు. జీవితకాలపు సంపాదనను, చిత్రాలకు, పుస్తక ప్రచురణలకు వెచ్చించడంలో వీర్రాజుగారు, సుభద్రాదేవిగారు చాలామంది రచయితలకు, కళాకారులకు ఆదర్శంగా నిలిచారు.

వీర్రాజుగారు ప్రజల శ్రమసౌందర్యాన్ని తన చిత్రాల్లో నిలిపి వుంచారు. ప్రధానంగా కొన్ని వృత్తులను రంగులతో కళ్లకుకట్టి చూపిస్తారు. కథల్లో, కవితల్లో నిజజీవితమే ఆయన ఇతివృత్తం. వారు తన జీవితంలో చూసిన ముఖ్య ఘట్టాలనే వారి రచనల్లో కథా వస్తువులుగా మార్చుకున్నారు. పడుగు పేకల్లా సాహిత్యాన్ని, చిత్రకళను అల్లుకున్నారు. ప్రపంచ చిత్రకళకు సంబంధించిన ఎన్నో ప్రచురణలను, కళాఖండాలను సేకరించారు. ఇలా కొని సేకరించిన వాటినన్నింటిని గడచిన సంవత్సర కాలంగా సామాజిక మార్పుకోసం పనిచేసే వివిధ సంస్థలు, లైబ్రరీలకు అందించారు. జనసాహితి నిర్వహణలో వస్తున్న 'ప్రజాసాహితి' పత్రికలో వారి రచనలు ఎన్నో వచ్చాయి. 'ప్రజాసాహితి' పత్రికకు, జనసాహితి ప్రచురణలకు ముఖచిత్రాలను వేశారు.

జనసాహితి జంట నగరాలశాఖకు పెద్దదిక్కుగా వున్నారు. ఎన్నోసార్లు 'ప్రజాసాహితి' పాఠకుల సమావేశాల్లో పాల్గొని సలహాలు ఇచ్చేవారు. 'అమ్మ' నవలపై అలా ఆయన సమక్షంలో జరిగిన చర్చ క్రమంలోనే 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచిక కూడా వెలువరించగలిగింది. జనసాహితి సంస్థగా మేము జంటనగరాల్లో వివిధ చోట్ల నిర్వహించిన సభలలో వక్త గానూ, ప్రేక్షకునిగాను దాదాపు అన్ని సభల్లో పాల్గొన్నారు. చిత్తప్రసాద్ బొమ్మలను జనసాహితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు దానిని ప్రారంభించడం, విజయవాడలో 'ప్రజాసాహితి' భవన ప్రారంభం సందర్భంలో చిత్తప్రసాద్ చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించి, జరిగిన సభలో కళల గురించి మాట్లాడడం మర్చిపోలేము. 'ప్రజాసాహితి' పత్రికలో ప్రచురితమైన అన్ని రచనలపై, పత్రిక నిర్వహణపై వారి అభిప్రాయాలను నిస్సంకోచంగా చెప్పేవారు. జనసాహితి చేస్తున్న సాహిత్య కృషికి కావాల్సిన అండను చివరి దాకా కొనసాగించారు. అలాంటి ఆత్మీయులు శీలా వీర్రాజుగారి మరణం పట్ల జనసాహితి జంట నగరాల శాఖ సంతాపాన్ని ప్రకటిస్తూ, జోహార్లు తెలియజేస్తున్నది. వారి కుటుంబపు దుఃఖంలో పాలుపంచుకుంటూ సానుభూతిని తెలియజేస్తున్నాము.

జోహార్! శీలా వీర్రాజుగారికి.

**1-6-2022**

**జనసాహితి**
**జంటనగరాల శాఖ**

# నా జ్ఞాపకాలు

- కొత్తపల్లి రవిబాబు

**వచన** కవిత బాగా ఆకర్షిస్తున్న కాలం. ఆనాటి వచన కవిత, తుంటలుగా నరికిన ఈనాటి వచనంగా వుండేది కాదు. భావయుక్తంగా చదువుకోడానికి వీలుగా వుండేది. ఒక అంతర్లయ వుండేది. పునరుక్తి ద్వారా సాధించే సంగీతం వుండేది. శ్రీశ్రీ, కుందుర్తి, తిలక్‌ల ప్రభావంలో వున్న కాలం. కుందుర్తి వచన కవితారూపాన్ని ప్రచారం చేస్తున్న కాలం. వచన కవితను వచన గేయం అనీ, వచన పద్యం అనీ, ముక్తఛందం అనీ రకరకాల పేర్లతో పిలుస్తున్న కాలం అది. కుందుర్తి వచన కవితేగాక, వచన కవితలో కథాకావ్యాలు రావాలని ప్రచారం చేస్తున్న కాలం. కుందుర్తి అనుచరుడిగా స్పందించిన శీలా వీర్రాజు వచన కావ్యాలు మొత్తం ఆరు రాసి, కుందుర్తి కలను సాకారం చేశారు. 1960-70లలో సోమసుందర్ నడిపిన 'కళాకేళి' సాహిత్య మాసపత్రికలో శీలా వీర్రాజు రాసిన 'అద్దెగది' వచన కవితాకథ చదివాను. దానిపై రాసి పంపిన వ్యాసం 'కళాకేళి'లో ప్రచురించారు. అదీ నాకు శీలా వీర్రాజుతో మొదటి పరోక్ష పరిచయం. అతి సాధారణమైన వ్యావహారిక భాష వాడుతూ అలంకారిక శైలిలో వున్న ఆయన కవిత్వం ఎంతో సరళంగా వుండి పాఠకులను ఆకర్షిస్తుంది. ఒక రైలు ప్రయాణంలో నా వద్ద వున్న 'రైలు డబ్బా.....' కవితాసంపుటిని కాలక్షేపం కోసం ఒక విప్లవ రాజకీయ పార్టీ నాయకుడు చదివి స్పందిస్తూ "కవిత్వమంటే ఇలా వుండాలి. ఇలా వుంటే ప్రజలు కవిత్వాన్ని ఆదరిస్తారు" అని వ్యాఖ్యానించారు.

ఆ తరువాత జనసాహితికి నిర్మలానంద శీలావిని పరిచయం చేశారు. మలక్‌పేటలో టీ.వీ. టవర్ ప్రక్క నుంచి వారి ఇంటికి వెళ్ళాలని కొండ గుర్తు పెట్టుకున్నాం. ఆ ఇల్లు ఒక కళానిలయం. ఇంటి ప్రధాన ద్వారం తలుపే కళాత్మకం. ఇంటిలో వస్తువులన్నీ ఒక పొందికగా అమర్చి వున్నాయి. అక్కడ ఏ వస్తువు, ఏ పుస్తకం, ఏ చిత్రమైనా చూడటానికి తీసుకుని మరల అదే స్థానంలో పెట్టకపోతే ఆ పొందిక పాడైపోయేది. కనుక చాల జాగ్రత్తగా వాటిని ఎక్కడి నుండి తీసామో అక్కడే పెట్టేవాళ్ళం. అయినా మేం వెళ్ళిపోయిన తర్వాత మేం కదిలించిన వాటిని మరల పొందికగా అమర్చుకునే పనిలో వుండేవారని మేము ఊహించుకునేవారం.

ఆయనకు బాగా నచ్చిన పుస్తకాన్నో, ప్రత్యేక సంచికనో కాలికోవేసి స్వయంగా మంచి బైండింగ్ చేయించి వుంచేవారు. అలా మాకు ఒక 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికను కళాత్మకంగా తానే బైండు చేసి మాకు కానుకగా ఇచ్చారు.

తాను పనిచేస్తున్న ప్రభుత్వ సమాచారశాఖలోకి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న వీర్రాజును కుందుర్తి ప్రవేశబెట్టారు. ఆ సమాచారశాఖలో అసిస్టెంట్ అనువాదకుడుగా వుద్యోగం చేస్తూనే వీర్రాజు తన సాహిత్యాన్ని సృష్టించారు. వరదా వెంకటరత్నం దగ్గర నేర్చుకున్న చిత్రకళను అభివృద్ధి పరచుకున్నారు. నిజానికి ఆ ఉద్యోగం ఆయన ప్రవృత్తులకు సరిపోలేదు. కనుకనే స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. మరి వీర్రాజు సమాచారశాఖ ఉద్యోగిగా వున్నారో లేదో గుర్తులేదు కాని ఒకసారి ఆ శాఖకు చెందిన ఉద్యోగిని కలసి 'ప్రజాసాహితి'కి ఒక ప్రకటన ఇవ్వమని కోరాం. అయితే ముఖ్యమంత్రి, మంత్రి ఫోటోలు మాత్రం ఆ ప్రకటనలో వుండగూడదని చెప్పాం. ఆ అధికారి కొన్ని ప్రకటనలు మా ముందు పెట్టి మీకు కావాల్సింది తీసుకుని, దానిని ఎలా వేస్తారో చూపిస్తే దానిని మీకు ఇస్తాం అన్నారు. మేము మద్యపానం సృష్టించే హాని గురించి వున్న ప్రకటనను అటూ ఇటూ మార్చి రాసి ఎవరి ఫోటోలు లేకుండా ఒక ప్రకటన రూపొందించి ఇచ్చాం. దానినే ప్రచురించాం.

విజయవాడలో జనవరి 2017 సంవత్సరంలో వీర్రాజు చిత్రకళాప్రదర్శనను జనసాహితి ఏర్పాటు చేసింది. దాన్ని ప్రారంభించే సమయానికి వీర్రాజు దంపతులు రాలేకపోయారు. వచ్చిన తరువాత కారణం అడిగితే, కారులో పెట్రోలు పోయించుకోడానికి వెళ్తే వాడు డీజిల్ పోసాడనీ, ఆ ట్యాంక్ అంతా శుభ్రం చేయించుకుని పెట్రోలు పోయించుకుని రావడంలో ఆలస్యమైందని ప్రశాంతంగా చెప్పారు. ఆ పెట్రోలుబంకు వాడిమీద కోపం లేదు. సమయానికి రాలేకపోయామన్న చింతా లేదు. ఆ సంయమనం చూసి ఆశ్చర్యపోయాం.

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే పాపికొండలులో ప్రకృతి అదృశ్య మౌతుందనీ, అక్కడకు ఇప్పుడు వెళ్ళి చూసే అవకాశం పోగొట్టుకుంటే ఇక అవకాశం వుండదనీ తెలిసి చాలామంది వెళ్ళివచ్చారు. కానీ వీర్రాజు ఈ ఏడాది మొదట్లోగానీ అక్కడకు వెళ్ళలేకపోయారు. పాపికొండలుకు వెళ్ళడానికి ఇప్పటివరకు అవకాశం లభించలేదు. వెళ్ళాలి అంటూ జనవరి - ఫిబ్రవరి నెలల్లో వెళ్ళారు. వాటికి సంబంధించిన చిత్రాలు గీయాలనుకున్నారు.

వయసు పెరుగుతున్న సందర్భంగా మన తర్వాత మన ఇంటిలో వారికి పనికిరానివాటన్నిటినీ సరైన స్థానాలకు చేర్చడం ఉత్తముల లక్షణం. వీర్రాజు తన చిత్రాలను ప్రభుత్వ గ్యాలరీకి ఇవ్వడానికి ఇష్టపడలేదు. వారిచ్చే పారితోషికానికి ఆశపడలేదు. పాపికొండలు చూసి వచ్చిన తర్వాత మార్చి నెలలో రాజమండ్రిలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీకి వాటన్నిటినీ సొంత ఖర్చుతో చేర్చి అమ్మయ్య అనుకున్నారు. దామెర్ల రామారావు చిత్రకళాసంస్థలో వరదా వెంకటరత్నం శిష్యులు వీర్రాజు. ఆవిధంగా గురుదక్షిణ ఇచ్చారు.

తన వద్ద వున్న సాహిత్యాన్ని, చిత్రకళకు సంబంధించిన పుస్తకాలలో కొన్నిటిని కరోనా రాకముందే విజయవాడలోని 'ప్రజాసాహితి' గ్రంథాలయానికి తరలించారు.

జనసాహితి జంటనగరాల శాఖ సమావేశాల్లో పాల్గొని ఎన్నో సందర్భాల్లో సలహాలు ఇచ్చేవారు. వారి సలహాతోనే, 'అమ్మ' నవల వచ్చి వందేళ్ళు పూర్తయిన సందర్భంగా 'ప్రజాసాహితి' ఒక ప్రత్యేక సంచికను రూపొందించింది.

→

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం శీలా వీర్రాజుగారు!

– దివికుమార్

**సాధారణంగా** మంచుకొండలా, నిండుకుండలా ఆవేశకావేషాలు లేకుండా ఉండే శీలా వీర్రాజుగారు ఆరోజు తనలోని ఆవేశాన్ని, దాచుకున్న భావాగ్నిని వ్యక్తం చేసిన సందర్భం. అది 1996 జనవరి నెల. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రఖ్యాత రచయిత మధురాంతకం రాజారాంగారికి అప్పాజోస్యుల, విష్ణుభొట్ల ఫౌండేషన్‌వారు విశిష్ట సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న సభ. సింగమనేని నారాయణ మధురాంతకంగారి సాహిత్య విశిష్టతను సభాముఖంగా తెలియజేసిన తరువాత పురస్కార ప్రదాన కార్యక్రమానంతరం శీలా వీర్రాజుగారిని మాట్లాడమని నిర్వాహకులు కోరారు. తాను ఉపన్యాసకుడిని కానంటూ మధురాంతకం సాహిత్యం గురించి నిరాడంబర వ్యక్తిత్వం గురించి రెండు మంచిమాటలు చెప్పి సమకాలీన సాహిత్యకారులలో అవకాశవాదం ఉందంటూ తన సాధారణ పద్ధతికి భిన్నంగా విమర్శనాత్మకంగా మాట్లాడారు. ప్రత్యక్ష రాజకీయాల జోలికి ఎప్పుడూ వెళ్ళని ఆయన విజయనగరం జిల్లా పేరుని విజయరామ గజపతి నగరంగా మారుస్తున్నట్లు చంద్రబాబు నాయుడు ప్రకటించటాన్ని తప్పుపట్టారు.

గురజాడలాంటి గొప్ప సాహితీకారులు, ఇంకా అనేకమంది ప్రఖ్యాత కళాకారులుండగా పట్టించుకోకుండా తన వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం రాజుల రంగప్పల పేర్లు పెట్టడాన్ని సాహిత్య కారులు ఎందుకు చూస్తూ ఉంటున్నారు? రాజకీయంగా జరుగుతున్న ప్రజావ్యతిరేక పరిణామాలపై రచయితలు ఎందుకు నోరెత్తి మాట్లాడటం లేదు? అని ఆయన కాస్త ఆవేశంగానే మాట్లాడారు. చివరగా ఇట్లాంటి విషయాలు జనసాహితి లాంటి వారు తప్ప మిగిలిన వారు ఎందుకు ఖండించడం లేదు. కనీసం తప్పు పట్టడం లేదు? అది మనందరి బాధ్యత కాదా? అని ప్రశ్నించారు.

నిజానికి పై విషయం అంటే విజయనగరం జిల్లా పేరు మార్పు గురించి పత్రికలలో వచ్చి వున్నా చాలామంది దృష్టి దానిపై పడ్డట్టు లేదు. జరిగింది ఏమిటి అంటే ఆయన వేదిక ఎక్కడానికి ముందు ఆయనకు ఇచ్చిన ప్రజాసాహితిలో ఆ అంశంపై సంపాదకీయం ఉంది. నిజానికి అది సంపాదకీయం కాదు.

కొద్ది మార్పులతో విజయనగరం జనసాహితి శాఖ విడుదల చేసిన కరపత్రం అది. అది ఎలా జరిగిందంటే... అంతకు కొద్ది వారాల ముందు విజయనగరం జనసాహితిశాఖ ఏర్పాటుచేసిన ఒక బహిరంగ సభలో మాట్లాడడానికి వెళ్లాను. ఆ సందర్భంలో నేను విజయనగరంలో మీటింగ్‌కి వెళ్ళటం, ఆ సభలో జిల్లా పేరుని మార్చాలనుకుంటే అది గురజాడ లాంటి తెలుగు జాతి ప్రజాస్వామ్య సాంస్కృతిక వైతాళికుని పేరు పెట్టాలి కానీ రాజుల రంగప్పల పేర్లు పెడితే ప్రజా రచయితలు కళాకారులు ఆమోదించరని, అలాంటి ఆలోచనలను జనసాహితి ఖండిస్తోందని, "రాజుల సంస్కృతి ప్రజలది అంటే చెల్లదు చెల్లదు చెల్లదులే" అనే చెరబండరాజు కవితా వాక్కులను ఉటంకిస్తూ నా సహజ ఆవేశ ధోరణిలో మాట్లాడాను. స్థానిక జనసాహితి వారికి కరపత్రం రాసి ఇచ్చాను. కరపత్రాన్ని జనవరి 1996 సంచికలో సంపాదకీయంగా ప్రచురించాం. ఊహించని విధంగా మధురాంతకంగారి సభలో శీలా వీర్రాజుగారు పై కరపత్రం ఆధారంగా మాట్లాడారు. అదే సభకు గుంటూరు నుంచి వచ్చిన పెనుగొండ లక్ష్మీనారాయణ సూచనతో రచయితల సంతకాలతో కూడిన ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వానికి పంపటానికి తయారుచేసి ముందు శీలా వీర్రాజుగారితో సంతకం పెట్టించి అక్కడినుంచి ఒక్కొరొక్కరే రచయితలతో సంతకాలు చేయించాము.

నేను తర్వాత శీలా వీర్రాజు గారిని అడిగాను. మీరు మీ సాధారణ స్వభావానికి భిన్నంగా అంత ఆవేశంగా ఎలా మాట్లాడగలిగారు అని! "గురజాడనైనా మనం నిలబెట్టుకోలేకపోతే ఇక తెలుగు సాహిత్యానికి సమాజానికి ఏమి మిగులుతుంది? అందుకే నాకు కూడా ఆవేశం వచ్చింది" అన్నారు శీలావి.

శీలా వీర్రాజుగారిని నాకు మొదట పరిచయం చేసింది గుత్తికొండ సుబ్బారావు, 1969లో. ఆయనకు రచయితలతో ప్రత్యక్ష పరిచయాలు ఉండేవి. నాకు చిన్నతనం నుండి కాలికి వేలికి తగిలిన పుస్తకాలు చదివే అలవాటే గానీ సాహిత్యకారులతో ప్రత్యక్ష పరిచయాలు లేవు. కమ్యూనిస్టు భావజాలం వైపు బలమైన మొగ్గు ఉండేది. అలాంటి సాహిత్యం చదవాలనే ధోరణిలోకి వచ్చేసి ఉన్నాను.

అప్పటికి నాకు 20 ఏళ్లు పూర్తి కాలేదు. వారిద్దరూ నాకంటే రెండు మూడు సంవత్సరాలు పెద్దవాళ్ళు కావచ్చు. గుత్తికొండ సుబ్బారావు చొరవతో మరొక నలుగురిని కలుపుకుని "స్పందన సాహితి" అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాము. (తర్వాత కాలంలో విరసం సిటీ సెక్రటరీగా పనిచేసిన అంచల లక్ష్మీనారాయణ (ప్రభంజన్) పై నలుగురిలో ఒకరు) 'స్పందన' అనే కవితాసంకలనం తీసుకురావాలని నిర్ణయించుకున్నాము. కవులకు ఉత్తరాలు రాసే బాధ్యత అంతా సుబ్బారావుది. వరవరరావుగారి నుండి 'స్పందన' అనే కవిత వచ్చింది.

---

→ జనసాహితికి, ప్రజాసాహితికి అత్యంత ఆప్తులు వీర్రాజు, సుభద్రాదేవిగార్లు.

వీర్రాజుగారు హఠాత్తుగా పోవటం దిగ్భ్రమను, బాధను కలిగిస్తుంది. ప్రస్తుత కాలానికి అవసరమైన అరుదైన వ్యక్తిత్వంగల శీలావీని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూనే వారి సహచరి సుభద్రాదేవి, పాప పల్లవి, మనమరాలు ఆశ్లేషల బాధలో పాలుపంచుకుంటున్నాం. 'సాహిత్యం, కళ ప్రజాజీవితాలను ప్రతిబింబించాలన్న వారి ఆశయాన్ని, ఆచరణను గౌరవిస్తున్నాం. ✦

అదే ముందు వేయాలని అనుకున్నాము. కుందుర్తి ఆంజనేయులుగారితో ఆ సంకలనానికి ముందుమాట రాయించాలని, శీలా వీర్రాజు గారితో ముఖచిత్రం వేయించాలని అనుకున్నాము. వీర్రాజుగారు కూడా మా స్పందన సాహితి గదికి వచ్చేవారు. తక్కువ మాట్లాడేవారు కానీ వయసులో సాహిత్యరంగ ప్రవేశంలో చాలా చిన్నవాళ్ళం అయినా బాగా కలిసిపోయి ఉండేవారు. తర్వాత ఆలోచించుకుంటే స్పందన కవితా సంకలనానికి మా అందరి కంటే ఎక్కువ శీలా వీర్రాజుగారే కృషి చేశారు అని అర్థం అవుతోంది.

చిక్కడపల్లిలోనే వారి బంధువు ప్రెస్ ఒకటి ఉంది. అందులో మా కవితా సంకలనం ముద్రణ. వీర్రాజు గారితో పాటు నేను కూడా ప్రెస్‌కి వెళ్ళేవాడిని. ప్రూఫులు ఆయన, సుబ్బారావు చూసేవారు. మా ఏడుగురిలో ఐదుగురు కవితలు ఆ సంకలనంలో వచ్చాయి. వరవరరావు కవితతో పాటు కుందుర్తి, ఏబీకే ప్రసాద్‌లవి కూడా అందులో ఉన్నాయి. దానిపై 'విశాలాంధ్ర' పత్రికలో ఉమారాజ్ సమీక్ష వచ్చింది.

వీర్రాజుగారి నోటి వెంట ఒక్క పరుషమైన వాక్యం కూడా వచ్చేది కాదు. అప్పటికే ఆయన రాసిన 'మైనా' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఎన్నో కథలు రాశారు. చిత్రాలు గీశారు కానీ ఇసుమంత కూడా ఆడంబరం లేకుండా, అప్పుడప్పుడే సాహిత్య రంగంలోకి కాలిడుతున్నమాలాంటి కొత్తకారుతో స్నేహ సంబంధాలు కలిగి ఉండేవారు.

అప్పట్లో ఆయన, కుందుర్తి గారు, గోపాల చక్రవర్తి రాష్ట్ర ప్రభుత్వ సమాచారశాఖలో కలిసి పని చేసేవారు. ఒకసారి మమ్ములను నిఖిలేశ్వర్ ఇంటికి వీర్రాజుగారు తీసుకువెళ్లారు. ఆయన హిందీ పత్రికల్లో వచ్చిన తన వ్యాసాలు కూడా చూపించారు.

అప్పట్లో యువభారతి అనే సాహిత్య సంస్థ ఒకటి ఉండేది. వీచికలు అనే మాసపత్రికను వంగపల్లి విశ్వనాథం గారి సంపాదకత్వాన వారు నడుపుతూ ఉండేవారు. సుధామ కూడా వారిలో ఒకరు. ఒకసారి గుత్తికొండ సుబ్బారావుని నన్ను వీర్రాజుగారు యువభారతి బృందం దగ్గరకు తీసుకువెళ్లారు. నాలో అప్పటికే విప్లవోత్సాహం ఉరకలేస్తున్న కారణంగా ఆ బృందం అంతగా నన్ను ఆకట్టుకోలేదు.

1970 ఫిబ్రవరి, విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో మొదటిసారి శీలా వీర్రాజుగారు నిర్మలానందగారిని కలిసారు. శ్రీశ్రీ కవితలు కొన్నింటిని హిందీలోకి అనువాదం చేసి చిన్న పుస్తకం తీసుకు వస్తే దానికి ముఖచిత్రం వీర్రాజుగారు వేశారు.

శీలా సుభద్రాదేవి గారు ఆయనకు మేనమామ కూతురే! కానీ వారిది పెద్దలు కుదిర్చిన పెళ్లి కాదు. తామిరువురు ఇష్టపడి చేసుకున్నది. సుభద్రాదేవిగారు వీర్రాజుగారి ఉత్తమ పాఠకురాలు. విమర్శనా దృష్టితో ఆమె ఆయన రచనలను పరిశీలించారు. వారిరువురి సాహిత్య అభిలాష అభిరుచి తమ తమ అభీష్టానుసారం వివాహం చేసుకునేట్లు పురి గొలిపింది. 1971లో అంటే 50 ఏళ్లకు పూర్వం వారి వివాహం అయిన తర్వాత సుభద్రాదేవిగారు వీర్రాజు గారి మొదటి పాఠకురాలు. ఆయన సాహచర్యంతో సహజీవనంతో తాను కూడా స్వయంకృషితో గుర్తింపు కలిగిన రచయిత్రిగా ఎదిగిన స్వతంత్ర వ్యక్తిత్వం సుభద్రాదేవి గారిది. వారిద్దరిదీ ఎదుటివారిని నొప్పించకుండా మాట్లాడే అత్యుత్తమ కళాత్మక జీవనం.

అనేక సందర్భాల్లో జనసాహితి జంటనగరాల శాఖ నిర్వహించిన బహిరంగసభలకే కాక, అంతరంగిక సమావేశాలకు కూడా వీర్రాజుగారు తప్పనిసరిగా హాజరు అవుతూ ఉండేవారు. హైదరాబాద్ జంట నగరాల జనసాహితిశాఖ నిర్మాణపరంగా నిలదొక్కుకుని కార్యకలాపాలు నిరంతరం నిర్వహించుకోవడంలో శీలా వీర్రాజుగారు అందించిన నిర్మాణాత్మక సహకారం, విస్పష్టమైన విమర్శనాత్మక సూచనలు సంస్థకు ఎంతో తోడ్పడ్డాయి. మాక్సిమ్ గోర్కీ అమ్మ నవల రాసి నూరేళ్లు అయిన సందర్భంగా ప్రజాసాహితి వెలువరించిన నూరేళ్ళ అమ్మ ప్రత్యేక సంచిక వెనుక శీలా వీర్రాజుగారి చొరవతో కూడిన సూచనలు ఎంతో తోడ్పడ్డాయి. అలాగే గే ఇరవై దాకా వెలువడిన తెలంగాణ పోరాట నవలపై జంటనగరాల శాఖ వెలువరించిన సమీక్షా, పరిచయ వ్యాసాల పుస్తకం గురించిన చర్చల సందర్భంగా కూడా ఆయన అనుభవంతో కూడిన సూచనలు ఉపయోగపడ్డాయి.

ఆయన దేనిని విమర్శించినట్టుగా కనిపించరు కానీ, సూచన ప్రాయంగా ప్రకటించే అభిప్రాయాల వెనుక అవగాహనతో కూడిన విమర్శ కూడా సున్నితంగా ఉంటుంది.

చెప్పే విషయం ఎంత లోతైన తాత్విక దృష్టితో కూడినా, సూటిగా సరళంగా ఉండాలి అనేది ఆయన పాటించిన నియమం. ఆయన పదే పదే సూచించిన అంశం కూడా!

వీర్రాజుగారి కవితలలో కొన్నింటికి ఎంపిక చేసుకుని హిందీలోకి అనువదించి ప్రచురింప చేయించారు నిర్మలానంద. అలాగే వీర్రాజుగారు నిర్మలానందగారు తెలుగులోకి అనువాదం చేసిన అత్యుత్తమ కవితలని ఎంపిక చేసి ఇ కలాల కవాతు అనే కవితా సంకలనం తన ముందుమాటతో తన సొంత ఖర్చులతో ముద్రించారు, వీర్రాజుగారు! అడిగినవారికి కాదనకుండా ఎందరికో వీర్రాజుగారు చెప్పలేనన్ని ముఖచిత్రాలు గీసి అందించారు. ఆయనలో ఉన్న క్రమశిక్షణ ఎలాంటిదంటే రచయితలను ఎప్పుడూ తన చుట్టు తిప్పుకోలేదు. ఇంకా ఎప్పుడు ఇస్తాడురా బాబూ! అనే ఆందోళనకు గురికానివ్వలేదు.

2013లో హైదరాబాద్ రవీంద్రభారతి ఆర్ట్ గ్యాలరీలోనూ, 2017 ప్రారంభంలో విజయవాడ కల్చరల్ సెంటర్లోనూ వీర్రాజుగారి చిత్రకళా ప్రదర్శన జనసాహితి నిర్వహించింది.

ప్రతిష్టాత్మకమైన అనేక పురస్కారాలు పొందారు. ఫ్రీవర్స్ ఫ్రంట్ ద్వారా అనేకమంది లబ్ధప్రతిష్టులైన కవులను పురస్కారాలతో సత్కరించారు. "దారిచూపే రచనే గొప్పది అని 1989లో గాలి నాసరరెడ్డిగారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో (ఆంధ్రభూమి) స్పష్టం చేసిన వీర్రాజుగారు, రచయితలు కళాకారులు సమాజానికి ప్రజలకు బాధ్యత వహించాలని తమ తమ స్వీయ అనుభూతులు మాత్రమేకాక సామాజిక చారిత్రక అవసరాలను పరిగణనలోకి తీసుకొని రచనలు చేయాలని ఎలాంటి అస్పష్టతకు తావులేకుండా ఆయన చెప్పేవారు. తనకు సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందించిన "మైనా" నవలను రాజమండ్రిలో తాను చిత్రకళను అభ్యసించటంలో చాలా మెలుకువలు నేర్పించిన రాజాజీకి అంకితం చేశారు. అలాగే జానపద సాహిత్య సేకరణలో పితామహుడు లాంటి రాజమండ్రికి చెందిన నేదునూరి గంగాధరంగారు అంటే శీలా వీర్రాజు గారికి చెప్పలేనంత అభిమానం."

"వారి నిరాడంబర జీవనం, నిత్య కృషి, నిస్వార్థ సేవకు ఇవి నన్ను విశేషంగా ఆకర్షించినవి. వారి జీవనవిధానాన్ని అనుసరించడానికి నన్ను పురికొల్పాయి. వీరిరువురు నా జీవితంలో తారసపడిన అపురూప వ్యక్తులు ఇటువంటి వ్యక్తులు మళ్ళీ నాకు ఇంతవరకు తారసపడేలేదు" అని జానపద పాటల సేకర్త నేదునూరి గంగాధరం చిత్రకారుడు రాజాజీ గురించి వీర్రాజుగారు చెప్పిన మాట.

హైదరాబాద్ మహానగరంలో జీవిస్తున్న రచయితలు కవుల గురించి వీర్రాజుగారు ఒక మాట అంటుండేవారు. తమ చుట్టుపక్కల జీవితాల జీవన సంఘర్షణల వాస్తవిక చిత్రం వైపు వీరు పెద్దగా దృష్టి పెట్టకుండా తాము గడిపి వచ్చిన అనుభవ పూర్వక గ్రామీణ బాల్య స్మృతులయిన గతాన్ని (నాస్టాల్జియా) ఎక్కువ రాస్తున్నారు అనేవారు. అటువంటి వారికి భిన్నంగా ఆయన "మళ్ళీ వెలుగు" అనే కావ్యం 1973లో రాశారు. అందులో స్పష్టంగా నగర జీవితపు వర్గ వైరుధ్యాలు, మధ్యతరగతి మిథ్యా విలువలు వాస్తవికంగా బలంగా కవితాత్మకంగా వ్యక్తీకరించారు. అలాగే 'మారుతున్న విలువలు' అనే ఆరు పేజీల వ్యాసంలో ఇలా అంటారు "ఒక రచన అది ప్రగతిశీలమైనా ప్రయోగశీలమైనా అది తప్పనిసరిగా అభ్యుదయ దృక్పథం కలిగి ఉండాలి. రచయిత ప్రవక్త కాదు రాజకీయవేత్త కాదు అతను ప్రధానంగా సాహితీవేత్త. ఆ విషయాన్ని మర్చిపోకుండా అతను ప్రవక్తలాగా రాజకీయవేత్తలాగా ప్రవర్తించినా పర్వాలేదు."

వీర్రాజుగారి నిరాడంబరతలో నిజాయితీ ఉంది. స్నేహశీలతలో అంతులేని ప్రేమ ఉంది. సాటి రచయితల పట్ల సౌహార్ద్రతతో కూడిన అనురాగం ఉంది. ఆచరణలో గందరగోళం ఎరుగని స్పష్టత, తేటదనం ఉన్నాయి. వ్యక్తిగత కీర్తి కాంక్షకు వెంట్రుక వాసి విలువ కూడా ఆయన ఎప్పుడూ ఇవ్వలేదు. సాహిత్యానికి కళలకు సామాజిక ప్రయోజనం ఉండితీరాలనే బలీయమైన ఆకాంక్ష ఆయనలో ఉంది. అందుకే ఆయన రచయితలకు కళాకారులకు ఆదర్శనీయుడు. ఒక ఉత్తమ నమూనా.✦

కవిత

# భయం

– శీలా వీర్రాజు

వాళ్ళంతా అంతే!
ఎత్తయిన వాళ్ళ భవంతుల పోర్టికోల్లోంచి
రోజా ఉదయాస్తమయాల ఆకాశం
కుంకుమ ఆరబోసినట్టు కనిపిస్తే
ఆ అందానికి తామే వారసులమన్నట్టు
నిమిషాల తరబడి చూస్తూ గడిపేస్తారు

పెరట్లో ఏ రోజన్నా ఎర్రగులాబీ
తన యవ్వనాన్ని పచ్చని పాన్పుమీద పరిచి
ఒళ్ళు విరుచుకుంటూ కనిపిస్తే
కళ్ళప్పగించి చూస్తూ వుండిపోతారు

ఎప్పుడన్నా ఓ వేసవికాలం
ఊళ్ళో ఎక్కడన్నా ఓ పూరిపాక
భగ్గున మండిపోతే
ఆ ఎర్రనిమంట ఆకలి నాలుకలు
ఎగిరెగిరిపడ్తూ పిచ్చిగా గెంతుతుంటే
అవి అలసి అలసి సొమ్మసిల్లిపోయేవరకు
కిటికీల ముందుకు కుర్చీలు లాక్కుని
వేడివేడి ఆమ్లెట్లో పకోడీలో
నోట్లో పడేసుకుంటూ
తాపీగా కూచుని సరదాగా చూస్తుంటారు

శిశిరంలో ఇంటిముందు బాదంచెట్టు
పచ్చని ఆకుల్ని ఎర్రగా మార్చుకుని
సాయంకాలపు ఎండకి మరీ ఎర్రబడి
నిప్పులపోగై మెరుస్తూ వుంటే
ఇంటిల్లిపాదీ ఆశ్చర్యంగా దాని
మొదట్లోకి చేరి
రంగుల్లో దాని అందాన్ని బంధిస్తూ
గ్రూపులు గ్రూపులుగా
కలర్ ఫొటోలు తీసుకుంటారు

అప్పుడప్పుడు ఖరీదైన సన్నిహితుల విందుల్లో
అడపాతడపా యింట్లో ఏకాంతంలో
తెల్లని గ్లాసుల్లో
సోడాల్తో పల్చబడి
ఎర్రగా రక్తంలా మెరిసే
ట్రాన్స్‌పరెంట్ మైకంలోంచి
ఎదుటి ఆకారాలూ దీపాలూ
ఎర్రగా కనిపిస్తుంటే
తన్మయత్వంతో చూస్తూ వుండిపోతారు

వాళ్ళ ఆడాళ్ళు ముచ్చటపడి
నెక్లెస్‌లో చెవి తమ్మెట్లో చేయించుకుంటే
తెల్లగా మెరిసే రాళ్ళ మధ్య నిండుగా ఎర్రపొడిని
వాళ్ళ వజ్రాల ఉంగరాల మధ్య కెంపును
ఏరికోరి చేర్చుకుంటారు

రాత్రిళ్ళు పడగ్గదుల్లో
ఎర్రని బెడ్‌రూంలైటు వెలుతుర్లో
తెల్లని పాన్పుమీద వొలికిన
ఎర్రని మసక కాంతిలో
అరమోడ్పు కళ్ళతో మత్తుగా
కలల్లోంచి చూసినట్టు
ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటారు

ఇంటావిడ
ఎర్రని కంచిచీర కట్టినరోజున
ఇంటాయన ఒళ్ళంతా కళ్ళు చేసుకుంటాడు

రోజా తాంబూలంతో
పెదాల్ని ఎర్రబరచుకోవడం
పండిన ఆ ఎరుపులో
పరస్పరం ప్రేమల్ని కొలచుకోవడం
వాళ్ళకు ప్రతిరోజూ ఓ కొత్త అనుభవం

ఎరుపు
వాళ్ళ జీవితంనిండా పరుచుకుంటుంది
ఎరుపు
వాళ్ళ అభిరుచులనిండా అల్లుకుంటుంది
ఎరుపు
వాళ్ళ వొంటినిండా ప్రవహిస్తుంది
ఎరుపంటే వాళ్ళకు వల్లమాలిన మక్కువ

కాని -
జానెడు ఎర్రని గుడ్డముక్క
మూరెడు కర్రమీద జెండాగామారి
గాలిలో రెపరెపలాడుతూ
కళ్ళముందు కనిపిస్తే
ఒకటే భయం.... పిచ్చి భయం! ✦

# కవితా చిత్రకళా సౌజన్యమూర్తి శీలావీ

- నిఖిలేశ్వర్

**కవి,** చిత్రకారులైన రచయితల్లో శీలా వీర్రాజు వ్యక్తిత్వం విశిష్టం. ఆయన కృతిత్వం ప్రత్యేకతను సంతరించుకుంది.

60 సం॥ల క్రితం బహుశ 1961–62 మధ్యకాబోలు, నేను మిత్రులు మానేపల్లి హృషీకేశవరావు (నగ్నముని) వెంటవెళ్ళి, ఎర్రగడ్డలో వున్న టి.బి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శీలావిని చూసాను. రాజమండ్రి నుంచి వచ్చిన కవి – కథకుడు – చిత్రకారుడిగా ఆయన పరిచయం. ఇక ఆ పరిచయం ఒక సాహిత్యానుబంధంగా బలపడింది. ఆ ఆరు దశాబ్దాలలో ఆయన మారిన అద్దె ఇళ్లు, ఆ తర్వాత సొంత ఇల్లు, నేను ఎప్పుడు వెళ్ళినా – వీర్రాజుగారితో పాటు శ్రీమతి శీలా సుభద్రాదేవి స్నేహం – ఆతిథ్యం లభించాయి.

ఆయన "కృష్ణాపత్రిక" (వీక్లీ) ఉపసంపాదకుడిగా వున్న కాలంలో (1960–64), మోజంజాహీ పళ్ల మార్కెట్ (మెయిన్‌రోడ్) దుకాణాల మధ్య వున్న పత్రికాఫీసుకు వెళ్లి కలిసేవాణ్ణి. అక్కడ ఆ అంగడి ప్రవేశ ద్వారం దగ్గర కూచుని శీలావి ఎడిటింగ్ చేసేవారు – సంపాదక యజమాని సుబ్రహ్మణ్యం లోపల కూచునేవాడు. కె. యాదవరెడ్డిగా నేను రచనలు చేస్తున్న కాలమది. శీలావి ఎంతో సౌజన్యంతో సూచనలు చేస్తూ, "కృష్ణాపత్రిక"లో నా కవితలు, కథ, విమర్శనావ్యాసాలు, అనువాదాలు ప్రచురించారు.

ఆ తర్వాత కుందుర్తి ఆంజనేయులుగారి మార్గదర్శకత్వంలో మేమంతా వచన కవితాప్రక్రియలో ప్రయోగాలు చేస్తున్న సమయాన శీలావీతో మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. కాలక్రమంలో ఆయన నిర్వహణలో "ఫ్రీవెర్స్ ఫ్రంట్" కార్యకలాపాలు కొనసాగుతూ – వచ్చాయి – వాటిలో నా భాగస్వామ్యం కూడా కొంత వున్నది.

రచనాపరంగా శీలావీలోని సౌందర్యాత్మక భావన, అభ్యుదయ దృక్పథం, చిత్రకళాశైలి పాఠకుల్ని ఆకట్టుకున్నాయి. మానవ నైజాన్ని – సంఘర్షణను తనదైన పద్ధతిలో చిత్రించారు.

వచన కవితోద్యమ కాలంలోనే, "దిగంబరకవులు" ఆవిర్భావం ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక పెద్ద మలుపు. అయితే దిగంబర కవుల కవితాధోరణి – దూకుడు కుందుర్తిగారికి, శీలావీకి నచ్చేవికాదు – విమర్శనాత్మకంగా చూసేవారు.


అయినా శీలావీతో వ్యక్తిగతంగా నాకేనాడూ ప్రతికూల భావం ఏర్పడలేదు. మిత్రులు శ్రీపతి చొరవతో శీలావీ ప్రతిష్ఠాత్మక నవల "మైనా" ప్రచురించినపుడు, దీర్ఘకావ్యాలలో (వచన కవితలో) "కిటికి" స్వీయచరిత్ర మొ॥ వాటిని మేమంతా ఆహ్వానించాము – వారు వేసిన ముఖచిత్రాల పరంపరలో జ్వాల రచనలు, నా కవితాసంపుటి కూడా వున్నాయి. వారి నిరంతర చిత్రకళాప్రయాణంలో వేసిన పల్లె జీవన దృశ్యాల చిత్రాల ఆల్బం ఆయన నాకు స్నేహంగా ఇచ్చారు.

శీలావీలో కొందరు కవులు – రచయితలలోలేని మరో పార్శ్వం – వారికున్న పరిమిత ఆదాయంలోంచి ఆర్థికంగా మిత్రులను ఆదుకునేవారు. జ్వాలాముఖి ప్రచురణలకు నేను విరాళాలు సేకరిస్తున్న సమయాన, ఆయన నేను అడగకముందే తమ ఆర్థిక సమయాన్ని అందజేసారు.

సౌమ్యుడు, సున్నిత హృదయుడైన వీర్రాజు ఇలా హఠాత్తుగా వెళ్ళిపోయినా, ఆయన తన రచనలలో – చిత్రాలలో – స్నేహంలో నిరంతరం సజీవంగా వుండిపోతారు. చివరికి ఆయన కవితాపంక్తుల్లోనే –

"ఎవరైనాసరే / కవిత్వమై ప్రవహించడానికి ఏం కావాలి?
ఒక దృశ్యం కావాలి
ఒక శబ్దం కావాలి
ఒక ఆలోచన కావాలి
ఒక స్పందన కావాలి"

✦



# గురువుగారితో నా ప్రయాణం - కొన్ని చిత్రాలు

వారాల కృష్ణమూర్తి

**శీలా** వీర్రాజుగారిని 1974లో కళావాణి సంస్థ నిర్వహించే సాహిత్య కార్యక్రమంలో కలిశాను. నేను రాసిన 'డూప్' కథ చదివాక ఆ కథను 'కడలి' మాసపత్రికలో ప్రచురిస్తానని తీసుకున్నారు. అంతకుముందు చాలకథలు రాసినా అచ్చుబాటు కాలేదు. అచ్చుకు నోచుకున్నవి రెండు మాత్రమే. అప్పట్లో పేరున్న రచయితలు కొత్తవారిని చాల చులకనగా చూసేవారు. కథ బాగోగులు కాక మనవాడా కాదా.... మన ప్రాంతంవాడా కాదా అనే ధోరణిలో ఆలోచించేవారు. అలాంటి కాలంలో వీర్రాజుగారు నాకు ఒక పెద్ద అండగా కథ బాగోగులను ఎలా రాస్తే బాగుంటుందో – అలా ఎందుకు రాయాలో – అసలు రాయడమెందుకు? లాంటి విషయాలు బోధ చేశారు. ఆనాటి నుండి ఆయన నాకు సాహిత్యలోకంలో దొరికిన అపురూపమైన ఆత్మీయ సన్నిహిత గురువు.

వీర్రాజుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయితగా పరిచయమైన ఆయన కవి, చిత్రకారుడు అని తెలిసి విస్తుపోయాను. అడివి బాపిరాజు, బుచ్చిబాబుగారు ఆ కోవలో నిలిచిన అపురూప ప్రజ్ఞాశాలురు. వీరి కథలు చదివితే కళ్ళముందు ప్రకృతి నిలుస్తుంది. పాత్రలు సజీవమూర్తులుగా మనతో పలుకరిస్తారు. 'మైనా' నవలలో సాయిబాబు పాత్ర నిత్యజీవితంలోనిది, ఎవరూ సృజించలేనిది. అతని జీవితంలోని ఒడిదుడుకులు, మానసిక వత్తిళ్ళు జీవితం రంగులమయం కాదని తెలియచేస్తుంది. అలాగని ఆ పాత్రలో ఆకాశం నుండి ఊడిపడ్డ కథానాయక లక్షణాలు కనిపించవు. అదో అపురూప నవల. అందుకే సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

వీర్రాజుగారి కవితాశైలి ప్రకృతి ఒడిలోంచి జారిపడే సెలయేరులా కొత్త అందాలతో మనస్సును చల్లగా స్పృశిస్తుంది. 'కిటికీ కన్ను', 'ఎర్రడబ్బా రైలు' జీవిత శకలాలను మన ముందుంచుతాయి. కవిత్వంలో కథాగానం ఆయన ప్రత్యేకత, 'కొడిగట్టిన సూర్యుడు', 'హృదయం దొరికింది' యువకులకు మార్గదర్శకాలు. దీర్ఘకావ్యాలలో ఒక అపూర్వ



ప్రయోగం 'మళ్ళీ వెలుగు'. ఇరవైనాలుగు గంటల్లో నగరాన్ని నగరవాసుల జీవితాన్ని ఆవిష్కరించడమేగాదు ఈ కారుకి ....... – ఈ బండి కాలి జడత్వం – ఎప్పటికీ ఇలా వుండిపోదంటూ కొత్త ఆశలు చిగురింపచేస్తాడు.

జీవిత చరిత్రలు చాల మటుకు గద్యంలోనే వున్నాయి. వీర్రాజుగారు తన బతుకు చిత్రాన్ని వచన కవితలో పడుగు పేకల మధ్య జీవితాన్ని సొంపుగా చిత్రించారు.

పైవన్నీ సాహిత్య సౌరభాలు కాగా అతని చిత్రాలలో శ్రమైక జీవనం తొణికిసలాడేది. కట్టెలు కొట్టేవాడు. మంగలిషాపులో శ్రమించే మంగలి, పొలంలో బతుకుని పండించే రైతులు, తిరగలితో స్త్రీ మూర్తులు, నేత పనిలో శ్రామికులు, చిన్నపిల్లల స్నానాలు చేయించే తల్లులు, తల్లుల్లాంటి పల్లెసీమలు, ఏటి అంచుల్లో బట్టలుతికే చాకళ్ళు, ఇలా ఎన్నో సజీవ చిత్రాలను చిత్రించారు. రాజమండ్రిలో దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని, తన గురువులు రాజాజీ, వరదా వెంకటరత్నంగార్లను స్మరిస్తూనే వుండేవారు.

ఇవి వీర్రాజుగారిలో అందరికీ కనిపించే బాహ్యరూపాలు. అంతకు మించి అతను ఉక్కపోత బతుకుల్లో చల్లని మలయమారుతంలా ఓ ఆత్మీయ ఆలింగనం. జీవితం వ్యాపారమైన కాలంలో విలువలకు కట్టుబడి బతకడం కష్టం. చాలమంది అన్నీ గట్టున పెట్టి బతికేస్తుంటారు. వీర్రాజుగారు జీవితమంతా నిజాయితీగా, నిఖార్సుగా, నిరాడంబరంగా, చివరిశ్వాసదాకా ఎవరినీ నొప్పించక తన బాధని తానే మోస్తూ వెళ్ళిపోయాడు. మాటవరసకైనా పరుషంగా మాట్లాడ్డం, అబద్దాలు చెప్పడం చేతకానివాడు. కవైనా, కథకుడైనా పేరున్నా లేకున్నా అక్కున చేర్చుకునేవాడు. గండపెండేరాల గండడ గండడైనా తప్పుచేస్తే అక్కడికక్కడే కుండబద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా చెప్పేవాడు. అందుకే ఆయన సభలో వుంటే ఎవరూ మధ్యలో నిష్క్రమించను సాహసించేవారుకాదు. సభలో ఆసీనులైన పెద్దల రాజప్రాసాదాల కొలువులో అతనెప్పుడూ వుండడు. అతని రచనలు, చిత్రాలు ప్రజల పక్షాన నిలిచేవే. ఎంతోమంది తమ రచనల్లో తుపాకులతో శ్రీకాకుళాన్ని, దండకారుణ్యాన్ని దున్నేస్తుంటారు. ఆచరణలో మాత్రం ఇంద్రభోగాలలో తేలుతుంటారు. శీలా వీర్రాజుగారు మనసావాచా కర్మణా మార్క్సిస్టు. అలా అని అతనెవ్వరికీ చెప్పుకోడు. మనుషుల్ని ప్రేమించడం ఆయన తత్వం. సాహిత్య లోకంలో అన్ని వర్గాలవారు అతన్ని గౌరవిస్తారు. ఒకసారి తెలుగు యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సిలర్ గోపిగారు మాటల సందర్భంలో వీర్రాజుగారి వ్యక్తిత్వం ముందు నేటి సాహితీమూర్తులందరూ అంగుష్టమాత్రులే అన్నారు. అది నిజం. ఆయన అంతటా ఉత్తముడు. కవిత్వం వారి కథలు గాని, నవలలుగాని పుస్తకాలుగా తీసుకురావడంలో ఆయన క్రమశిక్షణ ఎవ్వరికీ రాదు. చాలమందిలాగ రాజపోషకులనో,



ప్రభుత్వ ప్రాపునో (అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారా) డబ్బులు సంపాదించి అంకితాలనమ్ముకునే బాపతు కాదు. తన సొంత డబ్బులతో పుస్తకాలు ప్రచురించడం – అందులో పదిశాతం మాత్రమే అమ్ముడయినా లెక్కచేయని తత్వం. మిగిలిన పుస్తకాలు మిత్రులకు పంచిపెట్టడంతో తృప్తిచెందేవాడు. సాహిత్యం అతనికో బాధ్యతాయుతమైన జీవిత చర్య. అది వ్యాపారానికి కాదు అని ప్రగాఢంగా విశ్వసించేవాడు.

రాజమండ్రి నుండి వచ్చి భాగ్యనగరంలో బ్రతుకుతెరువు కోసం ముందు 'కృష్ణాపత్రిక'లో పనిచేశారు. నిలకడైన ఉద్యోగం కోసం సమాచారశాఖలో చేరాడు. అక్కడ కుందుర్తిగారి ఆధ్వర్యంలో వెలువడే 'ఆంధ్రప్రదేశ్' పత్రికకు ఉపసంపాదకుడిగా జీవితం ప్రారంభం. అక్కడే గోపాల చక్రవర్తిలాంటి అధికార్లకు ఆత్మీయుడిగా మారినా, ఎన్నడూ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోలేదు. అంతెందుకు నందమూరి తారక రామారావుగారి అంతర్ కార్యాలయంలో పనిచేసేటప్పుడు ఆయన దిగిపోతూ "ఏంకావాలో కోరుకోండి" అంటే నాకు స్వచ్ఛంద పదవీ విరమణ చాలు అన్న అల్ప సంతోషి.

కుందుర్తిగారి పరిచయంతో కథలు పక్కనబెట్టి వచన కవితలను అల్లుకున్నాడు. స్వతహాగా భావుకుడు, రంగుల రమ్యత తెలిసినవాడు కావడంతో కవిత్వంలో తనకో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. వచన కవిత్వంలో తనకో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. వచన కవిత్వాన్ని విస్తృతపరచను కుందుర్తిగారు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డును స్థాపించారు. ఆ అవార్డు శీలా వీర్రాజుగారికి దక్కడం విశేషం. కుందుర్తి మరణానంతరం వారి కుటుంబ సౌజన్యంతో అవార్డులను కొనసాగించడంలో వీర్రాజుగారి కృషి మరువలేనిది. ప్రభుత్వ అవార్డులకన్నా ప్రతిష్టాత్మకమైనదిగా పేరు వచ్చేలా కృషిచేశారు. అవార్డు ఎంపిక అత్యంత గోప్యంగా, ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా నిర్వహించడం కత్తిమీద సామే.

ఎందరో కవులు, కథకులు వ్యాసకర్తలకు యువభారతి రంజని (ఐ.జి. ఆఫీసు) లాంటి సంస్థలకు ఆయనే రూపురేఖలు దిద్దారు. తెలుగు రచయితలు, కవులు ఎవరు పుస్తకం వేసుకున్నా దానికి అందమైన ముఖచిత్రం అందించిన కళామూర్తి. ఎప్పుడూ ఎవరిదగ్గరా ఒక్క రూపాయి ఆశించని సహృదయుడు. డబ్బు కోసమే కళ అనుకుంటే ఎంతో సంపాదించేవాడు. ముఖపత్రం కోసం వచ్చినవాళ్ళకు కాఫీలు, టిఫిన్లు అవసరమైతే ప్రెస్‌వాళ్ళతో మాట్లాడి అతి తక్కువ ధరకు పుస్తకం విడుదలయ్యేలా చూసే ఆత్మీయతకు తడిసిపోని రచయిత, కవి లేడు.

తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలను చరిత్ర మరిచినా తన పుస్తకాలను అచ్చొత్తిన బి. బాలాప్రసాద్ (బాలాజీ ప్రింటర్స్)ని తన కవితాసంపుటి కొడిగట్టిన సూర్యుడని అంకితమిచ్చి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

ఎందరో రచయితలకు, కవులకు పుస్తక ప్రచురణ కోసం ఆర్థిక సాయం చేశాడు. ఎవరికి ఏం చేసినా గోప్యంగానే వుంచేవాడు. అందుకే అందరి గుండెల్లో గూడుకట్టుకున్న మైనాగా నిలిచాడు. నవలకు, కథలకు, కవిత్వానికి సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయాల పురస్కారాలు అందుకున్నాడు. సెంట్రల్ అకాడమీ పురస్కారాల న్యాయ నిర్ణేతగా సభ్యులుగా పలుమార్లు ఉత్తమ కథకులను, నవలాకారులని, కవులను ఎంపిక చెయ్యడంలో ఎక్కడా దేనికీ రాజీపడేవాడు కాదు. వీర్రాజుగారి ఇల్లు ఒక కళాప్రదర్శనశాలలా వుంటుంది. అందమైన శ్రీకృష్ణుడు పడవమీద నాట్యభంగిమలో కనిపిస్తాడు. ఒక స్టూల్ కింద నల్లనాగుంటుంది. బీరువా మీద నెమలి బొమ్మ, బాలకృష్ణుడు, నటరాజులేకాక దేవాలయాలలో శిలలతో చిత్రించిన దేవతామూర్తులు కళ్ళు చెదిరేలా దర్శనమిస్తాయి. ఇంకా ఎన్నో బొమ్మలు, పెయింటింగ్స్‌తో పాటు ఎదురుగా హాలులో ఓ గోడకి ఓ అందమైన తలుపు. దాని నిండా హంసలు, పద్మాలు, లతలతో ముచ్చటగా వుంటుంది.

ఆ తలుపు వెనక ఒక తలపు. తలుపుపై బొమ్మలు చెక్కే కళాకారుడు వీర్రాజుగారిచ్చిన డిజైన్ యధాతథంగా చెక్కడానికి అప్పట్లో ఆరువేలు అడిగాడు. సార్‌కు మొహమాటం ఎక్కువ. అందుకు నేనే నేరుగా అతనితో బేరసారాలు సాగించి చివరకు నాలుగువేలుగా నిర్ణయించాను. ఆ కళాకారుడూ అందుకు ఎలాంటి ఇబ్బంది పడకుండా సమ్మతించాడు. మా బేరసారాల మధ్యలో కలగజేసుకోక చివరన ఆ కళాకారుడితో "నీవు కోరినట్టు ఆరువేలు ఇస్తాను త్వరగా పని ప్రారంభించు" అన్నాడు. ఆ కళాకారుడు, నేనూ నివ్వెరపోయాం. ఆ కళాకారుడికి అడ్వాన్స్ ఇచ్చి పంపాడు.

"మనం రచయితలం దోపిడీ గురించి కథలు, కవిత్వాలు రాస్తాం. జీవితంలో నిత్యం దోపిడీ మార్గాన్నే అనుసరిస్తాం. ఒక కళాకారుడి శ్రమకు బేరాలాడ్డం – విలువకట్టడం నిస్సహాయ అయిన గొర్రెను తోడేలు బెదిరించినట్టే వుంది. మీరు అలా బేరమాడ్డం నాకు నచ్చలేదు. అందుకే – "అంటూ నిర్మొహమాటంగా నా తప్పుని ఎత్తిచూపి అతని కళాహృదయాన్ని చాటుకున్నాడు. ఆనాటినుండి గురువుగారిపట్ల మరింత ఆకర్షణ ఏర్పడింది. జీవితంలో నిజాయితీ లేని రచయిత కాలానికి నిలబడడు. కొట్టుకుపోతాడు అన్న వీర్రాజుగారి సూక్తిని, సమాజ అవసరానికి పనికిరాని రచనలు వ్యక్తిగత సమస్యలతో సామాజిక బాధ్యతమరిచే రచయితలు అవసరంలేదన్న 'ప్రజాసాహితి' పూర్వసంపాదకుడు నిర్మలానందగారి సూక్తిని రచయితలందరూ గుర్తుంచుకోవాలి.

నేను ఇల్లు కట్టుకుంటున్నప్పుడు ఎందరో మిత్రులు తమ దగ్గర డబ్బులున్నా బీదరికాన్ని ప్రదర్శించారు. గురువుగారు అడక్కుండానే పదివేలు చేతిలోపెట్టి – "తొందరలేదు తీరుబడిగా ఇవ్వొచ్చు" అని



అభయమిచ్చాడు. ఆనాడు నాకవసరంలేకున్నా తీసుకున్నాను. ఆయన ఇస్తానన్నదేదీ వద్దనను అతని చేతులమీదుగా అందుకునేదేదైనా అపురూపమైనదే నాకు. అది గొప్ప తృప్తినిస్తుంది.

నేను కథల పుస్తకం వెయ్యలేకపోతున్నానని "ఖర్చు నేను పెట్టుకుంటాను" అన్నాడు. "ఒద్దుసార్, ఆర్థిక ఇబ్బందుల వల్ల కాదు సమయం కేటాయించలేక" అన్నాను. అన్నింటికీ నేనున్నాగా అంటూ నాచేత దేవర దున్న, నిశ్శబ్ద సంకేతం కథల సంపుటాలు వేయించాడు. నాటకాలు వెయ్యమని ఎప్పటినుండో చెబుతునాడు. వెయ్యాలి.

సారు అనుకోకుండా సాధారణ చెకప్‌కని నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్ళారు. బి.పి. చాల వుందని నాలుగైదురోజులుంచుకుని అంజియో చేసి బ్లాకులున్నాయి – హార్ట్ ఆపరేషన్‌గాని ఆంజియో ప్లాస్టీ ద్వారా స్టంట్‌లు వెయ్యడంగాని చెయ్యాలని సూచించారు డాక్టర్లు. ఆ రోజుల్లోనే (1990 జులై, ఆగస్టులలో) నేను హృదయ సంబంధిత రుగ్మతతో నిమ్స్‌లో నెలరోజులపాటు వుండి హృదయాన్ని పదిలపరచుకుని వెళ్ళాను. ఆ అనుభవంతో సార్‌ని సెకండ్ ఒపీనియన్ కోసం మరో కార్డియాలజిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళాను. అతను రిపోర్టులు చూసి "మీరు చేసుకున్నా మళ్ళీ ఆరుమాసాలకంతా తిరగబెడుతుంది" అన్నాడు. చేసుకున్న నేను, చేసుకోను సలహా అడగనొచ్చిన సారూ ఇద్దరం షాక్‌లో వుండిపోయాం. ఆయన ముడుపు ఆయనకిచ్చి ఆటోలో నేను సార్ ద్వారకాలో మా కోసం ఎదురుచూస్తున్న కవి మిత్రుడు ఆశారాజు చెంతకు చేరుకున్నాం, ముగ్గురి మధ్యా మాటలు లేవు.

ఆశారాజు ఏదో అడగబోతున్నా కూడా తరువాత చెబుతానని ఆయనతో ఆటోని తెప్పించి సార్‌ను ఇంటికి పంపి, నేను రాజు ఏ.జి. క్వార్టర్స్ చేరుకున్నాం.

వారం తిరక్కుండానే ఆనాడు మా కార్డియాలజిస్ట్‌ను కలిసి 'కారినరి ఆంజియో డిసీజ్‌కు ఆంజియ ప్లాస్టీ చేసినా స్టంట్‌లు వేసినా ఆరునెలల్లో తిరగబెడతాయంటగా – అంతమాత్రానికి ఇంత డబ్బులు పెట్టి చేయించుకోవడమెందుకు – మీరు చెయ్యడం ఎందుకు అని నిలదీశాం – ఆ కార్డియాలజిస్ట్ తల పట్టుకుని, కాఫీ తెప్పించి నాచేత బలవంతంగా తాగించి రిలాక్స్‌కమ్మని చూడాల్సిన పేషంట్లను అరగంట ఆపి "నేను ఇంతవరకు వేల సంఖ్యల వైద్యం చేశా. ఆరు నెలలకే రోగం తిరగబడితే ఈ నిమ్స్ కారిడార్లనిండా ఆ పేషంట్లే వుండాలిగా. వేలల్లో ఎవరో ఒకరికి తిరగబెట్టవచ్చు. కానీ అందరి విషయంలో అది జరగదని నన్ను స్తిమితపరిచాడు. అతని వివరణకు సంతృప్తిపొందిన నేను గురువుగారిని మరో కార్డియాలజిస్ట్ దగ్గరకు తీసుకుపోతే ఆయన సూచన మేరకు మందులు వాడుతూ ఇంత దూరం నెట్టుకొచ్చాడు (32 సంవత్సరాలు) ఆపరేషన్‌కుగాని, స్టంట్‌లకు సిద్ధపడలేదు గురువుగారు.

నేను రంజని కార్యదర్శిగా వున్నప్పుడు కార్యక్రమాలన్నీ వీర్రాజుగారి సలహాతోనే నడిచేవి. కె.కె. మీనన్ (రచయిత) నా సహచర ఉద్యోగి నాకు అన్నింటా తోడుగా నిలిచేవారు. ఆ రోజుల్లో మొదటిసారి కాళీపట్నం రామారావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి మధురాంతకం రాజారాంగార్లు రంజని వేదిక మీద మొదటిసారిగా కనిపించారు. రంజనిలోని గురజాడ, కందుకూరి, గిడుగు చిత్రాలు వీర్రాజుగారు వేసినవే. ఒక్క పైసా ఆశించలేదు. అది ఆయన నిబద్ధత – ఆత్మీయత. గోపీచంద్ అవార్డు ప్రప్రథమంగా కాళీపట్నం రామారావుగారికి ఇవ్వడం నిశ్చయమైనప్పుడు సన్మానపత్రం రాసే బాధ్యత నాచేతికొచ్చింది. అంతటి గొప్ప కథకుడికి సన్మాన పత్రం నేను రాయడమేమిటని గురువుగారి మీద ఆ భారం వేశాను. గురువుగారు రాసిన మొదటి సన్మానపత్రం – ఆఖరి సన్మానపత్రం అదే – అద్భుతంగా రాసి డిజైన్ చేసి అందచేశారు.

నా వరకు నాకు తారసపడ్డ అపురూపవ్యక్తి శీలా వీర్రాజుగారు.

జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు. దేనికీ చలించని ధీశాలి. ఒక్కటి – రెండు రాష్ట్రాలయినప్పుడు ఎవరి మనోభావాలు వారివి ఎవరూ బాధపడకూడదు. సాంకేతికంగా రెండయినా మానసికంగా తెలుగువారంతా ఒక్కటే అనేవాడు. కానీ భౌతిక గీతలు మనుషుల మధ్య అడ్డుగా నిలుస్తాయని ఊహించని సార్ కొందరు సాహిత్యకారులలో తొంగిచూసిన సంకుచితత్వానికి ఎంతగానో బాధపడ్డారు. అంతవరకు నెత్తిన పెట్టుకు మోసిన సాహిత్యకారులలో వచ్చిన మార్పు చూసి అందరూ శ్రీ వైష్ణవులే సామెతలా అందరూ మార్క్సిస్టు అవగాహనాపరులే ఈ అడ్డగీతలకు, నిలువుగీతలకు బందీ కావడం చూసి మదనపడ్డాడు.

బ్రతికినంతకాలం చిత్రకారులలో కవిగా కథకునిగా వెలివేయ బడ్డాడు. కవులు కథకుల మధ్య చిత్రకారుడిగా దూరం పెట్టడం చూసి నవ్వుకున్నాడు. ఎక్కడో పుట్టిన గోదావరి తన పరుగునంతా పచ్చ పరిచినట్టు – రాజమండ్రిలో పుట్టినా, భాగ్యనగరంలో మెట్టినా అతని చిత్రకళా ప్రాభవం, కవితా జిలుగులు, కథల అల్లికలు తెలుగు మాట్లాడేవారి మధ్య పరిఢవిల్లుతూనే వుంటాయి. పచ్చగా పదికాలాలు నిలిచి వుంటాయి. కాళీపట్నం రామారావు, సింగమనేని నారాయణ, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లు ఆయన ఆత్మీయులే, అభిమానులే. వర్గాలతో నిమిత్తం లేకుండా అందర్నీ ప్రేమించినవాడే – అందరిచేత ప్రేమించబడ్డవాడే –

రాజహంసలాంటి మనిషి – కానీ కాకి జీవితాన్నే ప్రేమించాడు.

"విలాసాలు ఒయ్యారాలు

రాజసం.... దర్పం..... అక్కరలేదన్నాడు.

కష్టాల్లో సుఖాల్లో పదిమందితో పంచుకోవడమే బ్రతుక్కి అర్థం"

అని శలవిచ్చారు.

శలవు తీసుకున్నారు. ✦

# చిత్రకళా సృష్టికర్త శీలా వీర్రాజు

- సన్నిధానం నరసింహశర్మ



**భారతదేశంలోని** అరవై నాలుగు కళలలో రూపకళలంటూ మూడు విభాగాలుగా చేశారు. అవి వాస్తు, శిల్ప, చిత్రకళలు, గృహ, ఆవాస నిర్మాణాలైన తర్వాత శిల్ప చిత్రకళలు రాణిస్తాయి.

శిల్పకళ, చిత్రకళ – రెండూ రూపకళలైనా రెండింటికి వైవిధ్యం వుంది.

శిల్పకళలో ముక్కువంటి అవయవాలను చూడగలగడమేకాదు; చేతులతో తాకగలం కూడా. మూర్తిమయ చిత్రంలో ముక్కు వంటి అవయవం కంటికి కనిపిస్తుందే కాని చేతులకు తగలదు. ఈ కారణంగానే చిత్రకళను తాకడానికి వీలులేదని శుద్ధ దృశ్యకళగా మన పెద్దలు సకారణంగా పేర్కొన్నారు.

అందుకే చిత్రశాస్త్రాన్ని "చిత్రేనతోన్నతం నాస్తి చ దృశ్యతే అథచ" అన్నారు. చిత్రకళలో ఎత్తులూ లోతులూ వుండవు. అవి చూపులోనే వుంటాయట.

అదిగో చిత్రకళలో ఎత్తులూ లోతులూ కూడా చూడగల చిత్రకారుడు మన 'చిత్రకళాశీలుడు' వీర్రాజు. ఈ సుగుణాల వల్లే కథోచిత చిత్రాలు పెక్కింటిని ఆయన వేయగలిగారు.

అటు రచయితగా, ఇటు చిత్రకళాకారుడిగా ఉభయరంగాల్లోనూ రాణించిన రాజమహేంద్రవరపు గోదావరి బిడ్డలు మరికొందరు లేకపోలేదు.

ఎన్నో దశాబ్దాల క్రిందట సుమారుగా 1747 ప్రాంతానికే రాజమహేంద్రవరంలో రామేశం, కామేశం అనే ఇద్దరు చిత్ర కళాకారులు ఉండేవారు. వారి రామాయణ చిత్రాలు ఇప్పటికీ ఫ్రాన్స్‌లో భద్రపరచబడి ప్రదర్శింపబడుతున్నాయి. ఈ రామాయణ చిత్రాలపై విశాఖపట్నానికి చెందిన శ్రీశిష్టా ఒక ప్రత్యేక పరిశోధనాగ్రంథమే వచ్చింది. కవి కొండల వెంకటరావు ఆంధ్రావరడ్స్‌వర్తుగా ప్రఖ్యాతి చెందిన ప్రకృతి ప్రేమికుడైన కవి. శ్రీ శీలా వీర్రాజు ప్రకృతి ప్రేమికుడైన రచయిత.

కవికొండల, భమిడిపాటి కామేశ్వరరావు వంటి ఒక ప్రధాన సాంస్కృతిక బృందానికి రాజమండ్రి కళాశాల ప్రిన్సిపాల్ కూల్డ్రే ఓ చైతన్య శంఖం. కూల్డ్రే చిత్రకళాకారుడూ, మంచి రచయిత కూడా. ఆయన సౌత్ ఇండియన్ హవర్స్ అనే గ్రంథాన్ని సంతరించి పెట్టారు. రాజమహేంద్రవరంలోని దామెర్ల ఆర్ట్ గేలరీ, పాఠశాల కళకళలాడుతూ చిత్రకళకు పచ్చనికలయ్యేవి; చలువ పందిళ్ళయ్యేవి. వర్ధమాన చిత్రకళాకారులకు, ప్రఖ్యాత చిత్రకళాకారులకు నెలవుగా ఉండేది. ప్రసిద్ధ చలనచిత్ర దర్శకులు బి. నరసింగరావు రాజమండ్రి వచ్చినప్పుడు దామెర్ల, వరదా, కూల్డ్రే, భగీరథ ప్రభృతుల చిత్రాల సంరక్షణ, ఉనికి ఎలా వుండేవో ఆచూకీ చేసేవారు.

ఈ పైన చెప్పిన చిత్రకారులందరి మౌన ప్రభావాలు ఆంతరంగికంగా శీలా వీర్రాజు కుంచెలో ఉన్నాయేమో అనిపిస్తుంది. అవి జడత్వంగా కాకపోయినా – 'నలుగురుత్వంగా' ఉందనిపిస్తుంది. దామెర్ల ఆర్టు గేలరీలో మాదేటి రాజాజీ అనే ప్రిన్సిపాలుండేవారు. ఆయన కాలంలో ఓ స్వర్ణకాలం. తూలిక పేరుతో చెప్పుకోదగ్గ రీతిలో చిత్రకళాపత్రిక నడిపేవారు. రాజాజీ చిత్రకళాకారుడు మాత్రమేకాదు; రచయిత కూడా. నేదునూరి గంగాధరంగారికి రచనల్లో సహకరించేవారు రాజాజీగారి కాలంలో శీలా వీర్రాజుగారు వచ్చిన రెండు సందర్భాలు గుర్తున్నాయి.

ఆర్ట్‌గేలరీ కూల్డ్రే పేరిట చిన్న గ్రంథాలయం వుంది. ఒక భోషాణం వంటి పెట్టెలో అద్భుత ఆంగ్లచిత్రకళా గ్రంథాలుండేవి. వాటిని రాజాజీ – శీలా వీర్రాజుగారికి వివరాలతో చెప్పి చూపించారు. The Evolution of American Art, పికాసో చిత్రకళ గురించిన కొన్ని గ్రంథాలుండేవి. వాటిని పరిశీలించారు. శీలా వీర్రాజుగారు. చిన్న ప్రశ్నలు వేసి పెద్ద జవాబులు రాబట్టారు. వరదా వెంకటరత్నం చిత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు.

శీలా వీర్రాజుగారి చూపులు మౌన వ్యాఖ్యలుగా ఆయన మాటలు వ్యాసాలు రాసుకునేటట్లూ వుండేవి. శీలా వీర్రాజుగారి వివరణశీలత్వం గుప్త పూర్వగాథలహరిగానే వుండిపోయిందనడానికి రాజమండ్రిలోని కొందరు స్థానిక వ్యక్తుల ఉక్తులే సాక్ష్యాలు.

'గోదావరి ప్రతి కెరటం ఏదో ఒక కథ చెబుతుందట' అన్నాడు మిత్రుడు శ్రీకాంతశర్మ ఒక పాటలో.

ఆ కెరటాలపై చిత్రకళావీచికలను ఎలా మరువగలం. Order in disorderలో అన్నీ చిత్రాలే! ప్రతి చిత్రకారుడూ ఒక చిత్ర సృష్టికర్తే! ✦

# శీలా వీర్రాజుగారి చిత్రకళా ప్రదర్శన

**- పద్మశ్రీ గ్రహీత ప్రొ॥ ఎస్.వి. రామారావు** - విజయవాడ, చికాగో యు.ఎస్.ఎ.

***2017 జనవరి 21, 22 తేదీలలో, విజయవాడ కల్చరల్ సెంటర్ (మధుమాలక్ష్మి ఛాంబర్స్ – మొగల్రాజపురం)లో జనసాహితి నిర్వహించిన శీలా వీర్రాజుగారి చిత్రకళా ప్రదర్శనలో 65 చిత్రాలను ప్రదర్శించారు. వీటిలో కొన్ని తైలవర్ణ చిత్రాలు, కొన్ని నీటి రంగులలో చిత్రించినవి. ఎంతోమంది చిత్రకారులు, కళాభిమానులు రచయిత, రచయిత్రులు విచ్చేసి, ఎంతో దీక్షగా వాటిని చూస్తూ ఆనందించడం చూస్తే విజయవాడలో చిత్రకళపై ప్రేమ పెరుగుతున్నది అనిపించింది. ఇది శుభసూచకం – ఆహ్వానించతగిన మార్పు. ఇంతటి గొప్ప చిత్రకళా ప్రదర్శనను జనసాహితి శ్రద్ధ తీసుకొని ఏర్పాటు చేసినందుకు వారిని కళాభిమానులందరు అభినందించారు. ఎవరో ఒకరు బాధ్యత తీసికొననిదే ఏ చిత్రకారుడు, తనకు తానుగా ప్రదర్శనలను ఏర్పాటు చేసుకోలేడు. ఎంతో ఖర్చుతో, వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని ఇది. అందులోనూ పొరుగూరి నుండి వచ్చి ప్రదర్శన ఏర్పాటు చేయడం క్లిష్టతరమైన విషయం. ఏమైతేనేం విజయవాడ పురనివాసులకు హైదరాబాదు నగరంలో స్థిరపడ్డ శీలావీర్రాజుగారి చిత్రాలను చూచే అవకాశం కల్గింది.***

**శీలా** వీర్రాజుగారు రాజమహేంద్రవరంలో 1939లో జన్మించారు. చిన్నప్పటి నుండి చిత్రకళపై ఉన్న ప్రేమతో చాలా కృషిచేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు అదే ప్రేమతో చిత్రాలు వేస్తూనే ఉన్నారు. రచనా రంగంలో వున్న ప్రేమతో – ఈనాటికీ వ్రాస్తూనే ఉన్నారు. వీరు కళను తన ఊపిరిగా తలుస్తూ, తాను నమ్మిన భావాలను ఆలంబనగా చేసికొని, ఆ భావాల ద్వారానే చెప్పదలచుకున్నది చిత్రాల రూపాన, రచనల రూపాన కృషి చేస్తున్నారు.

వీరు నమ్మిన భావాలు ఏమిటి అన్నది వీరి చిత్రాలు చెప్పక చెప్తాయి. అయినా వీరు చెప్పిన విషయాలూ, ఇతరులు చెప్పిన సమాచారమూ పొందుపరుస్తాను. "ప్రజాజీవన రీతులకు అద్దం పట్టడానికీ, నేటి ఆధునిక సమాజంలో కనుమరుగౌతున్న సామాజిక కార్యకలాపాలను ప్రజల కళ్ళెదుట నిలపడానికీ నేను ప్రయత్నం చేస్తూ వుంటాను. నా చిత్రాలకు ప్రధాన ఇతివృత్తం ఇదే" అంటారు వీర్రాజుగారు; జనసాహితివారు వీర్రాజుగారి ప్రదర్శన సందర్భంగా ప్రింటు చేసి అందరికీ విజయవాడలో పంచిపెట్టిన ఆహ్వానంలో ఇలా చెప్పారు. "ఏ లలితకళైనా ప్రజలకు మేలు చేసేదిగా, చైతన్యపరిచేదిగా వుండాలి. వారిలో ఉన్నత భావాలను రేకెత్తించేదిగానూ, ఆనందాన్ని కల్గించేదిగానూ వుండాలి. లలితకళల్లో ఒకటైన చిత్రలేఖనం కూడా ప్రజానుకూలంగా ఉండాలి. చిత్రకళ ప్రజాచిత్రకళ కావాలి. ఈ కోవకు చెందినవారే నేటి మోహన్, శీలా వీర్రాజు, టీ.వీ. మొదలైనవారు. శీలా వీర్రాజు కేవలం చిత్రకారుడే కాదు, ఉత్తమ రచయిత కూడా. 'ప్రజలకు కేవలం మానసిక ఆనందాన్ని కలిగించే రచనకన్న వారిని ఆలోచింపచేసే రచన గొప్పది. ఆలోచింపచేసే రచన కన్న ఆచరణలోకి దించే, సామాజిక ప్రతిస్పందన కలిగించే రచన మరీ గొప్పది' అని విశ్వసించే ఆయన కవిత్వం ఆరు సంపుటాలుగా వెలువడింది. ఆయన కలం నుండి 9 కథా సంపుటాలు, ఒక వ్యాససంపుటి, లేపాక్షి శిల్పాల రేఖా చిత్రాలు "శిల్పరేఖ"గా వెలువడ్డాయి. ఆయన నాలుగు నవలలు రాశారు. వాటిలో 'మైనా' నవలకు 1969లో రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. తన జీవితకథను వచన కవితారూపంలో రాశారు. వచన కవితలో మొట్టమొదటగా ఆరు కథలు రాసింది వీరే"!!

వీర్రాజుగారు చిత్రించిన చిత్రాల శీర్షికలు చూస్తే ఆ చిత్రాన్ని మనం ఊహించుకోగలం. **'శ్రామికుడు'** – నిండు బస్తాను చొక్కాలేని వీపుపై వంగి మోస్తున్న ఒక మధ్య వయస్కుడు, "అద్దరికి" – చొక్కాలేని ముసలి అతన్ని దాటిస్తున్న ఒక పడవ నడుపుతున్న వ్యక్తి – ఇతనికి చొక్కా లేదు, పంచె ఎగకట్టి ఉన్నది, **'కొండ దిగువ సంతకు'** – ఇద్దరు అమ్మాయిలు, బహుశా 22, 25 ఏండ్లవాళ్ళు నెత్తిపై ఉన్న పెద్ద గంపలో ఏవో చిన్ని చిన్ని మూటల్లో కట్టినవి ఉన్నాయి. రెండవ ఆవిడ ఒక పెద్ద సంచిని తలపై మోస్తున్నది. ముక్కు పుడకలు, చెవులకు పోగులు, కాళ్ళకు కడియాలు, చేతులకు గాజు గాజులు, మెడల్లో కంటెలు, ఏవో పూసల దండలు. రవికెలు ఇద్దరికి లేవు, చీరనే మెడచుట్టూ కట్టుకొని ఉన్నారు. ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగుల ముతక చీరలు. గిరిజనులు ఏవో సామాన్లను మోసుకొని సంతలో అమ్మడానికి వెళ్తున్నారు. ముడివేసుకున్న జుట్టులో పువ్వుల్ని దోపుకున్నారు. వీరి వెనుక అంతా దట్టమైన అడవి. ఫుట్‌పాత్‌పై కూర్చొని క్షౌరం చేస్తున్న మంగలి చిత్రం మరొకటి. ఇవే కాకుండగ, అమ్మమ్మ కథలు చెప్తుంటే చుట్టూ కూర్చున్న ఆడ, మగ పిల్లలు, పాతకాలపు రోజుల్లో ఆడుకునే "వామనగుంటలాట" ఇద్దరు అమ్మాయిలు ఇంట్లో నేలపై కూర్చొని ఆడుకుంటున్నవారు, చంటాడికి తలంటుపోస్తున్న ఆడవాళ్ళు మరో చిత్రంలో కనబడతారు. ఇంకా ఎన్నో దైనందిన జీవితాలలోని అంశాలతో నిండిన చిత్రాలు ఉన్నాయి ఈ ప్రదర్శనలో.

హైదరాబాద్, బెంగుళూరు, కావలి, జర్మన్‌లోని గోటెంజన్ అనే నగరంలో వీరు తమ చిత్రాలను ప్రదర్శించారు. ఇటీవల యానాంలోనూ,

ఇప్పుడు విజయవాడలోను ప్రదర్శిచారు. "ప్రధానంగా స్వయంకృషితోనే తన చిత్రకళకు మెరుగులు దిద్దుకుంటూ వస్తున్నప్పటికీ, నాలుగేళ్ళ కాలేజీ జీవితంలో ప్రతి వేసవి సెలవుల్లోనూ దామెర్ల రామారావు ఆర్ట్ గేలరీ – స్కూలులో గురువు వరదా వెంకటరత్నంగారి వద్ద చిత్రకళలో మరిన్ని మెళకువలు నేర్చుకున్నారు." "శీలా వీర్రాజు చిత్రకారీయం" అన్న పేరుతో నీటి రంగుల, తైలవర్ణ చిత్రాల పుస్తకాన్ని వెలువరించారు.

"1961లో విద్యాభ్యాసం పూర్తి కాగానే, హైదరాబాదు నుంచి వెలువడుతున్న 'కృష్ణా పత్రిక'లో సబ్ ఎడిటర్ – కం – ఆర్టిస్టుగా చేరి రెండున్నర సంవత్సరాలు పని చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాలశాఖలో అనువాదకుడిగా ప్రవేశించి 1990 జనవరిలో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు."

ఈ ప్రదర్శనలో నీటి రంగులవి, తైలవర్ణ చిత్రాలు వున్నాయి. ఒక చిత్రకారుడివి ఇన్ని చిత్రాలు ఒకేసారి చూడడం అరుదుగా లభించే అవకాశం. ఎలాగో 65 చిత్రాలు ప్రదర్శిస్తున్నప్పుడు "రిట్రాస్పెక్టివ్" ప్రదర్శననే ఏర్పాటుచేస్తే బాగుండేదేమో అనిపించింది. వీర్రాజుగారు తన దగ్గర ఉన్న ఏనాడో చిత్రించినవి, ఇప్పుడు అధునాతనంగా వేసినవి, కలిపితే అది బ్రహ్మాండమైన ప్రదర్శన అవుతుంది. చిత్రకారుని ప్రోగ్రస్ ఎలా జరిగిందో, ప్రేక్షకులకు తెలిసేది. ఆయన చిత్రకళలో వచ్చిన మార్పులు, చిత్రాల వివిధ శైలులలో ప్రస్ఫుటంగా తెలిసేది. ఎలాగో, ప్రదర్శనలో వారు వేసిన చిత్రాలలో భిన్నత్వాలు చాలా ఉన్నాయి. అయినా "రిట్రాస్పెక్టివ్" ప్రదర్శనకు ఈ గ్యాలరీ సరిపోయి ఉండేదే కాని, దానికి సరియైన సెలక్షన్ చేసే క్యూరేటర్ కావాలి. అది జరిగే పని కాదు అనిపిస్తున్నది నాకే – ఎందుకనో. ఇంత పెద్ద ప్రదర్శన రెండు రోజులు మాత్రమే జరిగింది. ఇది మూడువారాలన్నా ఉండవలసింది. అయితే అది చాలా ఖర్చుతో కూడిన పని. ప్రభుత్వమే ఉచితంగా ఆర్ట్ గ్యాలరీ ఇస్తే ఇది సాధ్యం. నాకు ఇది నిరాశ, విజయవాడలోని వారికి నిరాశ. ఐతే ఈ ప్రదర్శన ఫిబ్రవరి 3 వరకూ కొనసాగనున్నట్లు నాకు తర్వాత తెలిసింది.

"కుంచె ముద్రలు" అన్న వర్ణచిత్రాల, రేఖా చిత్రాల పుస్తకం ప్రచురించారు శీలా వీర్రాజుగారు. అది వారి చిత్రకళకు అద్దంపట్టేదిగా ఉన్నది. ఈ పుస్తకం చూస్తే వీర్రాజుగారి చిత్రాల శైలి తెలుస్తుంది. ఇందులో తైలవర్ణ, నీటి రంగుల చిత్రాలతోపాటు ఎన్నో స్కెచెస్ ఉన్నాయి.

చిత్రకళాప్రదర్శనను చూస్తూ దీనిపై వ్రాయాలి. అయితే ఎలా వ్రాయాలి అన్న భావన కల్గింది నాకు. నా అనుభవం ప్రకారం చిత్రాలలో ముఖ్యంగా పరిశీలించవలసింది చిత్రకళ వేసే విధానంలో చిత్రకారుని కౌశల్యం, రంగుల మిశ్రమం ఎలా జరిగింది, ఆకారాల్లో చీకటి, వెలుగులు చూపుతూ త్రీ డైమెన్షన్‌లో వేయగలిగాడా లేక రంగులను పూరించారా అన్నది గమనించాలి. తర్వాత, చిత్రంలో భావం ఎంత గొప్పగా ఉన్నది అన్నది గూడా చాలా ముఖ్యం. చిత్రాలలోని మనుషుల ఆకారాలకు సరియైన ప్రపోర్షన్ ఉన్నదా, అసలు చిత్రకారునికి ఈ విషయంలో అవగాహన ఉన్నదా, తగినంత ప్రాక్టీసు చేశాడా? రచనల్లో మనం చూచేది రచయితకు భాషలో ఉన్న పరిజ్ఞానం, అలాగే భావంలో పరిపక్వత ఉన్నదా అని చూస్తాం. భాష, భావాల్లో ఏ ఎక్కువ తక్కువలు ఉన్నా అది బాలన్స్‌డు రచనగా మన్నదు. అదీగాక ఇతని శైలి ఏమిటి అన్నది అతి ముఖ్యం. అలాగే చిత్రకళలో కూడా పరిశీలించాలి.

వీర్రాజుగారు తన వేసిన చిత్రాల ప్రదర్శనలో స్కెచెస్ గూడ ప్రదర్శించి ఉండవలసినది. తెలుగువారైన (నేనూ తెలుగువాడినే గదా!) వీర్రాజుగారు స్కెచెస్ గాక చిత్రాలు మాత్రమే ప్రదర్శిస్తేనే అందరు మెచ్చుకుంటారు, స్కెచెస్ వర్ణ చిత్రాలకంటే తక్కువ స్థాయిలో ఉంటాయి అని అనుకొని ఉంటారని తలుస్తున్నాను. వీరి స్కెచెస్‌ను "కుంచె ముద్రలు" పుస్తకంలో చూచాను. అద్భుతంగా ఉన్నాయి. పచ్చల సోమేశ్వరాలయంలోని స్త్రీ మూర్తి కుడ్య శిల్పం, శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు ఆలయ ముందరి గోపురం, బుద్ధుని పాదముద్రలకు అంజలి, అమరావతిలోని నౌకా విహార శిలాఫలకం, కూచిపూడి నృత్య ప్రదర్శన స్కెచెస్, కోణార్క సూర్యదేవాలయం, ఎల్లోరా గుహ శిల్పాలు మొదలగునవి వాటిలో ఉన్నాయి. తెలుగువాడినైన నేనున్నూ ఇలానే లండన్‌లో జరిగిన నా చిత్రకళా ప్రదర్శనలో తప్పు చేశాను. అది పెద్ద ప్రదర్శన. దాన్ని ప్రారంభించింది సర్. విలియమ్ కోల్డ్ స్ట్రీమ్. ఈయన యూనివర్శిటీ ఆఫ్ లండన్‌లో ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌కు హెడ్. ఈయన ఇంగ్లండ్ రాణి ప్రోట్రైయిట్ పెయింట్ చేశారు. గొప్ప పేరున్న చిత్రకారులు. నా చిత్రాలు అంటే చాలా గౌరవం, ప్రేమ. నా చిత్ర ప్రదర్శనలో నేను చేసిన లితోగ్రాఫులను ప్రదర్శించలేదు. నా తైలవర్ణ చిత్రాలనే ఉంచాను. అవే ముఖ్యం ఇతరాలు ఏవైనాసరే అంత ముఖ్యం కాదు. ఆ చిత్రాల తర్వాతనే మిగిలినవి అనుకున్నాను. అయితే ప్రదర్శనను ప్రారంభిస్తూ ఆయన అన్నారు. "రామారావు ఎందుకని అతని లితోగ్రాఫులను ప్రదర్శించలేదో నాకు అర్థం కావడం లేదు. అతని లితోగ్రాఫులు ప్రపంచంలోని అతి ముఖ్యమైన న్యూయార్క్ నగరంలోని మ్యూజియమ్ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లో ఉన్నాయి. ఇతర చోట్ల గూడ ఉన్నాయి. వాటిని గూడా అతను ఈ ప్రదర్శనలో ఉంచవలసింది. ఈ ప్రదర్శనకు అది లోటు అన్నారు. నాకూ అలాగనే అనిపించింది. వీర్రాజుగారి ప్రదర్శన చూచిన తర్వాత వీరు, నేను ఇద్దరం తెలుగువారిమే గనుక, ఒకే రకంగా ఆలోచించాం, ఒకే రకంగా తప్పుచేశాం అని భావిస్తున్నాను.

వీర్రాజుగారి స్కెచెస్‌లో ఏ సంవత్సరం వాటిని వేసారో వ్రాయలేదు – ఒక్కదానికి తప్ప. అవి 1965లో వేసిన స్కెచెస్. చాలా చాలా గొప్పగా ఉన్నవి. బోల్డ్‌గా, వేగంగా వేసినవి. చిత్రించడంలో ఎంతో ధైర్యం కనిపిస్తున్నది. డిటెయిల్స్ చాలా అందంగా ఉన్నాయి. కొన్ని అవుట్‌లైన్లలో ఉన్న డ్రాయింగులో ఉంటే, మరికొన్ని అద్భుతమైన రఫ్‌గ, వేగవంతమైన స్కెచెస్ ఉన్నాయి. గుడులు, గోపురాలు – ముఖ్యంగా "శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు ఆలయ ముందరి గోపురం". "బుద్ధుని పాదముద్రలకు అంజలి" రేఖా చిత్ర డ్రాయింగు.

కాలం మారుతూనే ఉంటుంది. దానితో పాటుగ, భాష, తినే ఆహార పదార్థాలు, దుస్తులు, రుచులు, విద్య అన్నిటిలో ఆశ్చర్యపోయేంత మార్పులు వచ్చాయి. మా నాన్న భావాలు, ఆశలు వేరు, విదేశాల్లో నా భావాలు వేరు. అమెరికాలో పుట్టి పెరుగుతున్న నా కూతురు భావాలు వేరు. ఏది స్థిరంగా ఎప్పటిలానే ఇప్పుడు ఉండవు. అలాగే ఎన్నో స్కూల్స్ ఆఫ్ ఆర్ట్స్ చిత్రకళలో వచ్చాయి!

ఇలా ఎన్నో ఎన్నో పద్ధతులు పుట్టాయి. చాల చాలా దశాబ్దాలుగా సోషలిస్టిక్ రియలిజం అన్న పద్ధతి రష్యాలో ఎక్కువగా ఉండేది. చిత్ర శిల్పకళల్లో అది ప్రభుత్వం విధించిన పద్ధతి. అటువంటి దేశంలో కాన్‌డిస్కీ అన్న మహోన్నతమైన అత్యాధునిక చిత్రకారుడు పుట్టి ప్రపంచాన్ని అచ్చెరు వందించాడు. అతన్ని ఫాదర్ ఆఫ్ మోడరన్ ఆర్ట్ అన్నారు. అలానే ఛాగాల్ అన్నతను యూదుల సంబంధిత గ్రామీణ చిత్రకళను, నూతనంగా సృష్టించాడు. అలానే మరొక అల్ట్రా మోడరన్ చిత్రకారుడు మల్ విచ్ అన్నతను తన చిత్రకళతో ప్రపంచాన్ని ఆశ్చర్యచకితునిగా చేశాడు.

శీలా వీర్రాజుగారు వేసిన చిత్రాల్లో ఎన్నో మార్పుల్ని వారి శైలిలో చూడవచ్చు. భావనాపూర్వక ప్రజాచిత్రాలు దైనందిన చర్యలతోనే ఉన్నా, అతి బీద, అతి సామాన్య జీవిత విధానాలను చూపించినా, కష్టజీవుల బొమ్మలు వేసినా, చిత్రకారునిగా ఆయనకు తన శైలిలో మార్పులు కావాలన్న కోరికతో తెచ్చారు. అలానే చిత్ర వివరణలలో గూడ. చిత్రకారుని మనస్తత్వాలను బట్టి, సాంఘిక, ఆర్థిక, విద్యా వ్యవస్థలను బట్టి, పురోగమిస్తున్న దేశాన్ని బట్టి, విభిన్న దేశాల ప్రభావాలు భారతదేశంపై పడుతుంటే ఇటు చిత్రకారులు అటు ప్రజలు మారకుండా ఉండలేరు. మనోభావాల్ని వయసు మారుస్తుంది.

వీర్రాజుగారి చిత్రాల్ని విభజించి ఆయన చిత్రాల్లోని వైవిధ్యాన్ని చూపేందుకు ప్రయత్నం చేస్తాను. అచ్చంగా పాశ్చాత్య శైలిలో 1994లో వేసింది – **"దున్న"**, నీటిరంగుల చిత్రం. అదే పద్ధతిలో 1996లో **"ముదుసలి"** చిత్రించారు. ఇవి ఏ ప్రసిద్ధ పాశ్చాత్య చిత్రకారుడు వేశాడో అన్నట్లుగా ఉన్నాయి. నలుపు తెలుపు రంగుల్లో, బహుకొద్ది పసుపు, ఎరుపు రంగులతో వీటిని చిత్రించారు. వీటిని నిజంగా "స్కెచెస్" అనాలి. బోల్డ్ గీతలతో, ఎంతో వేగంగా చిత్రించినవి. 'తెల్లగ గీసిన గీతలతో, నల్లటి శరీరంపై ముదుసలి, దున్న అమోఘంగా ఉన్నాయి. దేవాలయాల స్కెచెస్ 1994లో వేసినవి బాగా బలంగా ఉన్నాయి. తర్వాత తర్వాత వీరి చిత్రకళ, శైలి వేగంగా మారుతూ వచ్చింది. బహుశా చిత్రకారుడు ఆలోచించి ఉంటారు. ఇటువంటివి ఏ చిత్రకారులకో నచ్చుతాయి కాని ప్రజానీకానికి, ముఖ్యంగా తెలుగువారికి అసలు నచ్చవు అని తలచి వుంటారు. అందుకే ఈ పద్ధతిని ఆపేసి, అందరికి నచ్చే, అర్థం అయ్యే, కంటికి కన్పించే విషయాలతో ఉన్న చిత్రాల్ని వేయనారంభించారు.

**మరొక శైలిలో వేసినవి :** 2015లో వేసిన **"త్రిభుజ కుటుంబం"** అన్న చిత్రంలో తండ్రి, తల్లి, కూతురు తలలను లైను డ్రాయింగులో మాదిరిగా తైల వర్ణంలో, గీతలు అవుట్‌లైనుగా, ఉంచి ఆ గడులలో వివిధ రంగులలో – ఒకే రకం రంగులో ఒక గడిలో ఉంచి, మరొక రంగు మరో గడిలో వుంచిన చిత్రం ఇది. కండ్లు, నోరు, ముక్కు, బొట్టు అన్ని రియలిస్టిక్‌గానే ఉంచి, గడులను రంగులతో నింపారు. "తల్లి బిడ్డ – వెలుగు నీడ" అన్న చిత్రంలో తల్లి ఒడిలో పాప ఉన్నది. ఒకే చిత్రాన్ని, పూర్తిగా, సగం కాన్వాస్‌లో, అదే చిత్రాన్ని మరల అదే కాన్వాస్‌లో మిగిలిన సగంలో చిత్రించారు. ఒక తల్లి పాప ఆకుపచ్చ, తెలుపు, నీలం రంగుల్లో మరొకదాన్ని (అచ్చు అలాంటిదాన్నే) ఎరుపు, పసుపు, వంకాయ రంగులో చిత్రించారు. ఇదిగూడ డ్రాయింగులాంటి గీతలు తైలవర్ణంలో గీసి, రంగులు నింపారు. ఇవి మోడరన్ అనే పద్ధతిలో తన శైలికి భిన్నమైన పద్ధతిలో వేసారు. ఈ విభిన్నమైన చిత్రాలు చాలా బాగున్నాయి. ఎందుకనో ఈ శైలిని ఆపేశారు.

**మరొక శైలిలో వేసినవి :** ఇది 1960లో వేసినవి. క్రొత్త పద్ధతిలో, జానపద చిత్రాన్ని **"సింగారి సోయగం"** అన్న పేరుతో చిత్రించారు. ఇది నలుపు, తెలుపు రంగుల్లో, నీటి రంగుల్లో ఉన్నది. మరొకటి **"గుడికి"** అన్నది. లేపాక్షి మ్యూరల్స్‌లో ఉన్న చీరలతో, చీరలపై ఎన్నో డిజైన్లతో, ఒక చేతిలో పళ్ళెం పట్టుకొని ఆ పళ్ళెంలో అరటికాయలు, కొబ్బరికాయ ఉంచుకున్నది ఒక స్త్రీ. మరొక స్త్రీ అలాగే పళ్ళెం ఒక చేత్తో, చంకన ఒక చిన్న బాలున్ని ఎత్తుకొని ఇద్దరు గుడికి వెళ్తున్నారు. **"సింగారి సోయగం"** అన్న చిత్రం కూడా ఇలాంటిదే. ఇక్కడ ఒక అమ్మాయి నగలు, అందెలు, కడియాలు, చేతికి కంకణాలు, గాజులు, పెద్ద పెద్ద బుట్టలుగ వ్రేలాడే చెవి లోలాకులు, ఎన్నో నగలు జడలో నగలు పెట్టుకొని కూర్చొని ఉన్నది. దీన్ని గూడ 1960లో చిత్రించారు. పాత జీవిత విధానానికి పట్టంగట్టిన శీలా వీర్రాజుగారు గొప్ప చిత్రకారులు.

**మరొక శైలిలో ఉన్న చిత్రాలు : "లాండ్ స్కేప్"** అన్న తైలవర్ణ చిత్రం. హైదరాబాదులో, అక్కడక్కడ విరివిగా కన్పించే బండరాళ్ళు. వాటి వెనుక గుబుర్లు గుబుర్లుగా చెట్లు, ఎన్నో తెల్లని డాబా ఇళ్ళు, ఆకాశంలో తెల్లని మేఘాలు. మరొక చిత్రం **"అటు చూస్తే పేదరికం, ఇటు చూస్తే ఐశ్వర్యం"**, చిత్రం అంతా తైలవర్ణంలో వేసినది. మేడ మీద మేడ అలా అన్నీ మేడలే. ఆ చిత్రంలోనే ఒకేరకం గుడిసెలు. మనుషులు లేరు ఈ రెండు చిత్రాల్లో. ఇవి 2015లో చిత్రించినవి. బీదరిక సంపదనూ మానవ హృదయం లేని ఊరును గొప్పగ చూపించారు.

**అందరికి నచ్చే చిత్రాలు కొన్ని :** ఇవన్నీ మామూలు అంశాలపై చిత్రించినవి. **"జడలోకి మల్లెమాల"** ఒక తైలవర్ణ చిత్రం 2015లో వేసినది. కూర్చున్న ఒక అమ్మాయి. కాళ్ళకు పట్టాలు, మెడలో నగలు, లోలాకులు, జడకుచ్చులు, తలపై ఏదో బంగారు నగ, కిటికీ దగ్గర కూర్చొని దోసిలిలో మల్లెపూలు పట్టుకొని ఉన్నది. జడలో పెట్టుకునేందుకు తయారుగా ఉన్నది. ఇది రంగు లైనుతో చిత్రం అంతా అవుట్ లైనుగవేసి, రంగులు నింపారు. అలంకరణ ఎక్కువగా ఉన్నది. **"ముచ్చట్లు"** అన్న చిత్రంలో ఐదుగురు స్త్రీలు – ముగ్గురు కూర్చుంటే, ఇద్దరు వంగి వున్నారు. డ్రాయింగు లాంటి నల్లని లైనులో మనుషుల్ని, ఇంటి కప్పును, తెల్లగోడకు వేసిన ముగ్గుల్లాంటి డిజైను, ఇంటి గోడకు ఉన్నవి. చీరలకు వేసిన పలు రంగులకు ఏవో పూల డిజైన్లు ఉన్నాయి. కండ్లు, ముఖం ప్రక్క భాగం చూపించినా, మనకు ఎదురుగా చూస్తున్న ముఖాన్ని చూపినా, కండ్లు లైను డ్రాయింగులో పూర్తిగా చూపారు ఇలా. 2014లో వేసిన తైలవర్ణ చిత్రంలో మనుషుల ఆకారాలను నల్లటి లైనులో గీసి బోర్డర్ వలె, అందులో చీరలకు, కనిపించే శరీరాలకు విడివిడి రంగులు వేశారు. చీరలకు మాత్రం చాలా చాలా మడతలు చూపారు. నలుగురు ఆడవాళ్ళు వచ్చి ఒక ఇంటిలోని స్త్రీకి బొట్టు పెడ్తున్నారు. అందరు నిలుచుని ఉన్నారు. ఆడ, మగపిల్లలు ఇద్దరు కూడా నిల్చునే ఉన్నారు. 2015లో వేసిన

**"పల్లెదారి"** తైలవర్ణ చిత్రంలో ఇద్దరు మగవాళ్ళు కూర్చొని ఏదో ఆట నేల మీద ఆడుతుంటే ఒక మీసాల అతను కర్రను పట్టుకొని నిల్చుని చూస్తున్నాడు. తెల్ల పంచెలు, తలపాగలు. భుజం మీద కండువా వేసుకున్న వారందరూ రైతులు. అది ఒక గ్రామం ఎన్నో పూరి పాకలు, పెంకుటిళ్ళు, కొన్ని డాబాలు ఉన్నాయి. ఇద్దరు స్త్రీలు నెత్తిమీద, పొలంలో కోసిన ఆకుపచ్చని గడ్డి కట్టలను మోసుకు వెళ్తున్నారు. కొద్దిగా షేడింగ్ ఇచ్చిన చీరలు ఇద్దరివి.

"కష్టజీవుల్ని చూపే చిత్రాలు – **కుమ్మరి వర్క్‌షాప్"** తైలవర్ణ చిత్రం 2015లో వేసినది. కొడవలినో కత్తినో – కాల్చిన ఇనుముపై మరొక వ్యక్తి సమ్మెట దెబ్బలు వేస్తున్నారు. మరొక అబ్బాయి దేన్నో వెడల్పయిన ఇనుప ముక్కను సుత్తితో కొడుతున్నాడు. ఓ రైతు ఆసామి నిలబడి ఈ పనులన్నీ చూస్తున్నాడు. కట్టెతో చేసిన బండి చక్రం ఒక ప్రక్క ఉన్నది. నాగలి దున్నే భాగం విడిగా నేలపై పెట్టి ఉన్నది. దానికి బారైన కర్రను దోపేందుకు ఓ పెద్ద రంధ్రం చేసి ఉన్నది. బొగ్గులు కుప్ప ఒక ప్రక్క నేలపై ఉన్నది. గ్రామంలో నిత్యం చూసే ఒక అద్భుత దృశ్యం. ఈ కష్టజీవులు నిజాయితీగా, చేతి పనులు చేసుకొని బ్రతికేవారిగా భావనను ఇచ్చిన వీర్రాజుగారు గొప్ప చిత్రకారులు. **"మెరక పొలానికి గూడ కట్టు నీరు"** తైలవర్ణ చిత్రం 2015లో వేసినది. కాలువ నుండి నీరును ఒక స్త్రీ, పురుషుడు, ఓ డొప్పలో నుండి నీటిని తమ పొలంలోకి తోడుతున్నారు. ఒక స్త్రీ పారతో పొలం గట్టును నరికి నీరు పొలం అంతా పారేట్టుగ చేస్తున్నది. కాలువ అవతలి గట్టున ఒక స్త్రీ పురుషుడు గొడ్లను తోలుకు వెళ్తున్నారు. అలాగే ఏవో పనులలో వెళ్తున్నారు మరికొందరు. గొప్ప చిత్రం. భావుకత పల్లె జీవితానికి అద్దం పట్టింది. **"చేపల వలకు చిన్న రిపేరు"** అన్న తైలవర్ణ చిత్రం 2012 వేసారు. తలపాగ, బనీను, గోచిగుడ్డ, తెల్లని గెడ్డంతో ఓ ముసలి అతను నల్లదారాల వలను రిపేరు చేస్తున్నాడు. వెనుక చెక్కలతో చేసిన పడవ. దానికి ఆనుకొని ఓ ముగ్గురు అరటికాయలు తింటున్నారు. ఇద్దరు కుర్రాళ్ళకు లాగులు మాత్రమే ఉన్నాయి. దీనస్థితి కన్పిస్తున్నది ముసలి అతని మొఖంలో. ఇలానే ఎన్నో చిత్రాలు గ్రామ జీవనాన్ని చూపేవి ఎక్కువగా వేసారు.

చిత్రకారులు వైవిధ్యపూరిత భావాలు గలవారు కనుక వారికి నచ్చినవే చిత్రిస్తారు గనుక, మనం చిత్రాల్ని చూచి ఆనందిద్దాం. గడిచిన గ్రామ జీవిత విధానాన్ని పద్ధతుల్ని మాయమవకుండా జాగ్రత్తపరుస్తారు చిత్రకారులు. అటువంటివారు శీలా వీర్రాజుగారు. వారికి ఇష్టమైన స్కెచింగ్ ఎక్కువగా ఆయన చిత్రాల్లో కన్పిస్తాయి. నమ్మిన భావాలకు న్యాయం చేద్దామనుకున్న చిత్రకారుడు, గొప్ప రచయితగా పేరుపొందిన శీలా వీర్రాజుగారి చిత్ర ప్రదర్శన విజయవాడలో చాలామందిని ఆనందపర్చింది. నేను ఈయన చిత్రాలను చూడడం ఒక విశేషంగా భావిస్తున్నాను. ఎందుకంటే వీరి చిత్రాలను గురించి వినడమేకాని, ఇంతవరకు చూచింది లేదు గనుక. ✦

కవిత

# కాకి బతుకు

– శీలా వీర్రాజు

**అవునవును**
కాకిలాటి బతుకే నాక్కావాలి
హంసలాటి ఏకాంత జీవితం నాకొద్దు
ఆ విలాసాలూ వొయ్యారాలూ
ఆ రాజసం, ఆ దర్పం
నాకు అక్కరలేదు
కంటి కొసమెరుపుల ఆకర్షణలు
వొంటి నునుపుల అందాలు
ప్రేయసీ ప్రియుల నిత్యజలకాలు
బాహాటంగా కామకేళీ విలాసాలు
నాకు వొద్దంటే వొద్దు

నీళ్ళనీ పాలనీ
వేరు చేయగలనన్న భ్రమల జీవితం
నేను కోరను
అందరి చూపుల్నీ
వొంటికి పులుముకునే గర్వంలోంచి
నన్ను నేను చూసుకోను
నన్నసహ్యించుకున్నా
నాకేం ఫర్వాలేదు
నన్ను మెచ్చుకున్నా
నాకేం బాధలేదు
కాకిలాగే బతుకుతాను
సమష్టి జీవితాన్నే కోరతాను
నాకోసం విదిల్చిన ఎంగిలి మెతుకుల్నైనా
నేను కోరుకునే చిటికెడు గింజల్నైనా
పదిమందితో కలిసి పంచుకునే
సమష్టి జీవితం నాది

రెక్కలురాని ఏ గూటి పిల్లో
ఎగరలేక కిందపడి కాళ్ళు విరుచుకుంటే
రెక్కలొచ్చిన ఏ గూటి తండ్రో
కరెంటు తీగకి బలై నేల కూలితే
పదిమందినీ పిలిచి కన్నీరు కార్చే
సంఘ జీవితం నాది

స్వార్థం నాకు ఆమడ దూరం
కష్టాల్లోనూ సుఖాల్లోనూ
పదిమందితో జీవితాన్ని పంచుకోవడం
నా బతుక్కి ఆదర్శం. ✦

# ఊరు వీడ్కోలు చెప్పింది

– శీలా వీర్రాజు

**స్కూలు** ముందు మామిడిచెట్టు పక్కనే మట్టి బాటలోంచి బురదలో పూర్తిగా వర్షాన్ని కాయలేని గొడుగుకింద సగం తడిసిపోతూ గబగబా యింటికి వెళ్తోన్న రామచంద్రం మేష్టార్ని చూసి ప్రైమరీ హెల్త్ సెంటర్ అరుగు మీద నుంచున్న పరబ్రహ్మం పలకరించాడు – "వర్షంలో తడిసి ఏం వెళ్తారు మేష్టారూ. కాసేపు యిలా వచ్చి కూచోండి, తగ్గాక వెళ్ళుదురుగాని" అని.

పరబ్రహ్మానికి మేష్టారి ఉబ్బసం జబ్బు గురించి తెలుసు. అందుకే ఆయన మేష్టార్ని పిలిచాడు. కాని రామచంద్రం మేష్టారికి ఆగాలనిపించలేదు. ఇంటికి వెళ్ళి యీ వార్త కాస్తా భార్య చెవిన వెయ్యాలి. తల్లికి కూడా వుత్తరం రాసిపడేయాలి. అందుకే ఆయన "లేదులెండి, కాస్త పనుంది. వర్షం తగ్గాక మళ్ళీ వచ్చి తీరిగ్గా మీతో మాట్లాడుతాను. ఓ విశేషం వుంది" అంటూ ఆగకుండానే కదిలిపోయాడు.

రామచంద్రం మేష్టారు 'ఓ విశేషం వుంది' అని అన్నమాట ఆ పక్కనే అవతలివైపున వున్న పంచాయితీ ఆఫీసులో యీ వర్షాన్ని గురించే ముగ్గురు నలుగురితో మాట్లాడుకుంటున్న సర్పంచ్ చెవిని పడింది. ఆయన కుతూహలంగా చూసి –

"ఏమిటి పంతులుగారూ విశేషాలు. వర్షంలో ఎక్కడికి.... రండి, కాసేపు కూచుని వెళ్ళుదురుగాని" అన్నాడు. తనే లేచి, ఆ కుర్చీలో కూచోమని తను వేరే కుర్చీ తెప్పించుకున్నాడు.

రామచంద్రం మేష్టారికి వెళ్ళక తప్పలేదు. తనంటే సర్పంచ్‌కి చాలా గౌరవమూ, అభిమానమూనూ. ఈ వార్త ఆయన చెవిని కూడా వేయాలి.

రామచంద్రం మేష్టారు కుర్చీలో కూచోలేదు. పంచె బాగా తడిసిపోయింది. అరుగుమీదే నిలబడి, పుస్తకంలోంచి ఓ కాగితం తీసి ఆయనకిచ్చాడు – ఇది ఇప్పుడే వచ్చిందట, హెడ్‌మాష్టరుగారు పిలిచి యిచ్చారు అని.

సర్పంచ్ ఆ కాగితం తీసుకుని చదివాడు. పూర్తిగా చదివి "మేష్టారుని వాళ్ళ వూరికి బదిలీ చేశారయ్యా" అన్నాడు పక్కవాళ్ళను ఉద్దేశిస్తూ.

వాళ్ళు కాసేపటికిగాని ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

"అదేమిటి మేష్టారూ! మా వూరిని విడిచిపెట్టి వెళ్ళిపోతారా" అన్నాడు ఒకతను. ఆ కంఠంలో అభిమానం, ఆత్మీయత, వారి కళ్ళల్లో దిగులూ గుర్తించి రామచంద్రం మేష్టారు పులకరించిపోయారు.

"మీకు తెలియని విషయాలు ఏమున్నాయండి సుబ్బయ్యగారూ. మా




తల్లిగారికి వార్ధక్యం వచ్చేసింది. చాదస్తం మనిషి. వున్నవూరు విడిచిపెట్టడానికి వొప్పుకోరు. దగ్గరుండి చేసుకుంటేనేగాని ఆ పొలం ముప్పయ్ బస్తాలన్నా రాల్చదుకదా. మా అమ్మగారికా – అంత ఓపికలేదు. నేను దగ్గర వుంటే ఆమెకు ఆ తిప్పలన్నీ వుండవు. ఈ వయసులో ఆమెకింత సేవచేసే అదృష్టం కూడా కలుగుతుంది".

సర్పంచ్ ఉత్సాహంగా ఏమీ మాట్లాడ లేకపోయాడు. అతనికి చాలా దిగులుగా వుంది. ఈ వూరికి వచ్చి పిల్లలకి యింత చదువు చెప్పడమే కాకుండా, యిక్కడి విషయాల్లో కల్పించుకుని ఎన్నో సత్కార్యాలు జరిపించి, వూళ్ళో చిన్నా పెద్దా అని లేకుండా అందరికీ తలలో నాలుకలా మెలిగి ఎంతో కొంత ఉపకారం చేసిన రామచంద్రంగారిని వదులుకోవడం చాలా దిగులుగా వుంది. ఆయన పట్టుదలవల్లనే స్కూలుకి పక్కా బిల్డింగ్, వూరుకి ఎలక్ట్రిసిటీ, ప్రైమరీ హెల్త్ సెంటరూ వచ్చాయి. కుర్రాళ్ళు పనీపాటా లేక చెరువుగట్టునా, గుళ్ళోనూ పేకాడుతూ కూచోకుండా ఏడాది పొడుగునా గుళ్ళో ఉత్సవాలనీ, నాటకాలనీ, భజనల్నీ ఏర్పాటు చేశారు. పెద్దాళ్ళకు రాత్రిళ్ళు చదువుచెప్పి, యీనాటికి తమంత తాము ఓ వుత్తరం ముక్క రాసుకోగలిగేటట్టూ, ఓ పేపరుని కూడబలుక్కుని చదివేట్టూ చేశారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా, ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా ఆయన అక్కడ హాజరై తనకు తోచిన సహాయం చేశారు. అలాటి మనిషి యీ వూరు విడిచి వెళ్ళిపోతాడంటే సర్పంచికీ, అక్కడ కూచున్న ముగ్గురు నలుగురికీ దిగులుగా వుంది. ఆ దిగులు వల్లే సర్పంచ్ ఉత్సాహంగా ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఆ మౌనాన్ని రామచంద్రం మేష్టారు అర్థం చేసుకున్నారు. అందుకే ఆయన "నాకు మాత్రం యీ వూరుని విడిచిపెట్టాలని వుందటండీ. తప్పని పరిస్థితి. హెడ్‌మాస్టరుగారు పిలిచి యీ కాగితం యిచ్చాక స్వగ్రామానికి బదిలీ అయి వెళ్తున్నానన్న ఆనందంకన్న యీ వూరుని విడిచి వెళ్ళిపోవలసి వస్తోందే అన్న బాధే ఎక్కువ కలిగింది. వచ్చిన కొత్తలో కనిపించినవాళ్ళనల్లా కాళ్ళు పట్టుకున్నాను బదిలీ చేయించమని. ఇన్నాళ్ళకి అయాచితంగానే యిది జరిగింది. నిజానికి యీ వూరుని విచిచిపెట్టెళ్ళినా మనసంతా యిక్కడే వుంటుంది" అన్నారు.

వర్షం తెరిపియిచ్చాక వాళ్ళ మంచితనాన్నే గుర్తుచేసుకుంటూ యింటిని చేరుకున్నారు.

గుమ్మంలో అడుగుపెడుతూనే భార్యను కేకేశారు ఆయన. ఆవిడ యింట్లోనే వుంటే

"ఇదిగో వచ్చె" అనేది. అలాంటి శబ్దమేదీ రాకపోతే ఆయన ఉత్సాహమంతా ఎగిరిపోయింది. బహుశా ఏ పొరుగింటికో వెళ్ళిందేమో. కబుర్లలో పడితే ఇప్పుడప్పుడే తెములుతుందా!

పెద్దకూతురు మాత్రం కావిడి పెట్టెమీద కూచుని గోళ్ళనీ, గోళ్ళతోపాటు వేళ్ళనీ కొరుక్కుంటోంది. వీధిలో ఆడుకొంటోన్న చిన్నకూతురూ, కొడుకూ ఇంట్లోకి వచ్చారు. "అమ్మ రమణమూర్తిగారింటికి వెళ్ళింది నాన్నా. అత్తయ్యకి నొప్పులొచ్చాయని యిప్పుడే వచ్చి తీసుకెళ్ళారు" అంది చిన్నకూతురు. తల్లిని పిలుచుకురావడానికని తమ్ముణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళింది.

రామచంద్రం మేష్టారు ఎంత ఉత్సాహంతో, ఎంత హడావుడిగా వచ్చారో అంతగానూ నీరుగారిపోయారు. ఇప్పుడప్పుడే భార్య వచ్చే సూచనలేదు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మిడ్‌వైఫ్ వుందికదా తీసుకెళ్ళ కూడదా అనుకున్నారు. తన మనసులోని ఆనందాన్ని రెండుగంటలపాటు అణచిపెట్టు కోవాలంటే చికాగ్గానే వుంది ఆయనకి.

తడి బట్టలు మార్చుకుని కుర్చీలో కూలబడి పుస్తకంలో వుంచిన కాగితం తీసి మళ్ళీ ఓసారి చదువుకున్నారు. ఆ కాగితంలోంచి తల పైకెత్తేసరికి, పెద్దకూతురు కావిడి పెట్టెమీద కూచుని వున్నదల్లా కాళ్ళతో పెట్టెను కొడుతూ శబ్దం చేస్తూ తండ్రి ముఖం వంకే చూసి పళ్ళన్నీ కనిపించేలా నవ్వుతోంది.

"ఇలా రామ్మా" అని పిలిచారు తల వూపి.

కాని ఆ అమ్మాయి రాలేదు. చూసిచూసి పెట్టె దిగి దొడ్లోకి వెళ్ళిపోయింది. చూరునించి ధారగా కారుతోన్న నీళ్ళని దోసిట్లోకి పట్టి దబ్బున పాదాలమీద పడేసుకుంటూ తనలో తనే నవ్వుకుంటోంది. రామచంద్రం మాష్టారు లేచివెళ్ళి ఆ అమ్మాయిని లోపలికి తీసుకొచ్చి కూచోపెట్టి "నానమ్మ దగ్గరికి వెళ్దాం వస్తావే" అన్నారు. తనతల్లి ఫోటో తీసి చూపించి సంజ్ఞలు చేసి, నువ్వూ నేనూ అంతా వెళ్దాం అన్నట్లుగా చేతులు వూపి చూపించారు.

ఆ పిల్ల నవ్వింది. ఆ ఫోటో తీసుకుని చూస్తూ కూర్చుంది.

బైటకు వెళ్ళిన పిల్లలిద్దరూ వచ్చారు – "అమ్మ ఇప్పుడప్పుడే రాదట నాన్నా, ఆలస్యమౌతుందట"అని.

వాళ్ళిద్దరికీ ట్రాన్స్‌ఫర్ విషయం చెప్పారాయన. ఆ పిల్లల ఆనందానికి హద్దేలేదు. ఇద్దరూ వెళ్ళి వాళ్ళక్క దగ్గర కూచుని ఒకటే కబుర్లు. వాళ్ళ ఆర్భాటం చూసి ఆ పిల్ల కూడా ఊరికే చేతులు ఊపేస్తోంది. ఏమిటేమిటో మాట్లాడేస్తోంది.

ఆ పెద్దదానికి వాళ్ళ నాయనమ్మ దగ్గర చేరిక ఎక్కువ. అదంటే ఆమెకు వల్లమాలిన అభిమానం. 'ఆ ఎర్రిపిల్లని పెట్టుకుని పరాయి వూళ్ళో ఏం వేగ్గలడో ఏమో. అంతోటి మేష్టరుగిరీకి వున్నవూరు వొదులుకొని వెళ్ళిపోవాలా. ప్రయివేట్లు చెప్పుకుంటే చాలదా' అనేది.

అప్పటికే పెద్దమ్మాయికి పదేళ్ళు. ఆ పిల్ల వెర్రిది. చిన్నప్పుడు నాలుగోయేట వరకూ మాటలు రాకపోతే చెవుడుందేమో మూగపిల్ల అయిపోతుంది గాబోలనుకున్నారే గాని వెర్రిపిల్ల అవుతుందనుకోలేదు. తర్వాత తర్వాత తెలిసింది. పిచ్చిపిచ్చి చేష్టలు చూసి కుళ్ళికుళ్ళి ఏడ్చారు తల్లిదండ్రులు. ఇంటావంటా యిరువైపులా ఇటువంటిది ఎవరికీ లేదు. కడుపున కన్నందుకు అలాగే పెంచుకొచ్చారు. వాళ్ళ నాయనమ్మే ఆ పిల్లను ఎత్తుకుని తిప్పింది. పక్కపిల్లల్ని కొట్టినా, ఇంట్లో సామాను నేలకేసి కొట్టినా, పిచ్చిపిచ్చి పనులతో వేధించినా విసుక్కోకుండా కడుపులో పెట్టుకొని పెంచుకొచ్చింది.

అలాటి పిచ్చి పిల్లతో పరాయిచోట కొడుకు ఎన్నికష్టాలు పడ్తాడో అని మొదట్లో వెళ్ళొద్దంది. "ఇల్లూ, పొలమూ, ఎలాగూ వున్నాయి. వూళ్ళోనే వుండి ప్రయివేట్లు చెప్పుకోగూడదా" అంది. కొడుకు వొప్పుకోలేదు. "ఏడాది పనిచేసి ట్రాన్ఫర్‌కి పెట్టుకుని మళ్ళీ వచ్చేయనూ" అన్నారు రామచంద్రం మాష్టారు. అయితే వెళ్ళిన ఆరేళ్ళకుగాని ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేకపోయారు. అదీ, ఆయన ప్రయత్నం లేకుండానే జరిగింది. మొదట్లో అన్నివిధాలా ప్రయత్నించి, చివరికి ఆ వూరికి అలవాటుపడిపోయి మూడేళ్ళుగా ఆ విషయం మర్చిపోయారు. ఇటీవల తల్లి ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుండి మాటి మాటికీ ఉత్తరాలు రాస్తోంది. ఆవిడ రాయడమైతే రాస్తోందిగాని ఆయన మాత్రం మొదట్లోలా అంతగా పట్టించుకోలేదు. ఈ ఆరేళ్ళలోనూ యీ వూరితో ఆయనకు విడదీయలేని అనుబంధం ఏర్పడిపోయింది. అందుకే ఆయన అశ్రద్ధ చేస్తూనే వచ్చారు. చివరకు ఆయన ప్రయత్నం లేకుండానే ఈ ట్రాన్స్‌ఫర్ వచ్చింది!

రమణమూర్తి గారింటినించి భార్య వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. ఈ వార్త వినగానే చాలా సంతోషించింది. అత్తగారెప్పుడూ ఆవిడని కోడరికం పెట్టలేదు. కన్నకూతురిలా చూసుకున్నారు. పైగా ఆవిడ పుట్టినిల్లు అక్కడికి బాగా దగ్గర. వీటన్నింటికీతోడు, మరీ యింత పల్లెటూరు కాదది. వూళ్ళో కుళాయిలు వున్నాయి. విశాలమైన యిల్లు, కూరగాయలు కావాలంటే సంత రోజువరకూ ఆగక్కరలేదు. దుకాణాలున్నాయి. రోగాలొస్తే మందూ మాకూ తెచ్చుకోడానికి యిద్దరు ముగ్గురు పెద్ద డాక్టర్లే వున్నారు. చూడ్డానికి చిన్నవిగా కనిపించినా యిలాంటి సౌకర్యాలు చాలా వున్నాయి అక్కడ.

ఈ వూరొచ్చాక మొదట్లో ఆమెకు కాస్త యిబ్బందిగానే అనిపించింది. తర్వాత మెల్లగా అలవాటు పడిపోయింది. మళ్ళీ యిన్నాళ్ళకు అటు వెళ్ళిపోవడం ఆమెకు చాలా సంతోషంగా వుంది. అక్కడికి వెళ్ళిపోతే పెద్దదాని బాధ కూడా కాస్త తప్పుతుంది. అత్తగారు వుంటారు. ఆవిడ చూసుకుంటుంది. సాధారణంగా ఆ పిల్ల బైటికి ఎక్కడికీ వెళ్ళదు. ఎప్పుడైనా వెళ్తే గుళ్ళోకి వెళ్తుంది. అక్కడే ఏ మండపం మీదో, ఏ నూరువరహాల చెట్టుకిందో కాస్సేపు కూచుని వచ్చేస్తుంది. ఎవరైనా ప్రసాదం యిచ్చినా పుచ్చుకోదు. అల్లరి పెట్టకుండా బుద్ధిగా యింట్లోనే ఏమూలో పడివుంటుంది. ఎటొచ్చీ

అప్పుడప్పుడు కాస్త తిక్కరేగి చేతికి అందుబాటులో ఏదుంటే అది పుచ్చుకుని నేలకేసి కొడ్తుంది. లేదా మీదకి విసిరేస్తుంది. అలాంటప్పుడే కాస్త కనిపెట్టుకుని వుండాలి. అత్తగారు దగ్గరుంటే ఆ బాధ వుండదు. ఈయనకి కూడా ఆ వూరెళ్తే మంచి డాక్టరుతో ఉబ్బసానికి మందిప్పించవచ్చు. తనకీ యీ మధ్య వొంట్లో నీరసంగా వుంటోంది. ఒకసారి పరీక్ష చేయించుకోవచ్చు. అందుకే ఆమెకు యీ వూరు విడిచి వెళ్ళిపోతున్నందుకు ఎంతమాత్రం బాధ కలగలేదు.

రామచంద్రం మాష్టారు భోజనం అయ్యాక ఉత్తరంమాట గుర్తుకొచ్చి తల్లికి తన ట్రాన్స్‌ఫర్ గురించి ఉత్తరం రాద్దామని కూచున్నారు. ఇలా కూచున్నారో లేదో అంతలోకి అయిదారుగురు హడావుడిగా వచ్చి "ఏమండి పంతులుగారూ! మీ వూరుకి బదిలీ అయ్యారట, నిజమేనా" అంటూ అడిగారు.

వాళ్ళని కూచోబెట్టి తాపీగా తన విషయం వివరించి చెప్పారు మేష్టారు. అది వాళ్ళకి తెలీని సంగతేమీ కాదు. మేష్టారు, వారి స్వగ్రామంలో వుండడం ఎంత అవసరమో వాళ్ళకి తెలుసు. అయినా ఈ ఊరు విడిచి మేష్టారు వెళ్ళిపోవడానికి వారు వొప్పుకోవడం లేదు.

వాళ్ళతో మాట్లాడుతుండగానే మరో యిద్దరు వచ్చారు. వాళ్ళకీ ఆవార్త తెలిసిందట. నిజమో కాదో తెలుసుకుందామని వచ్చారట.

రాత్రి చాలా సేపటివరకు మాట్లాడుతూ కూచుండిపోయారు. వాళ్ళందరూ వెళ్ళిపోయాక మేష్టారు పడుకున్నారుగాని నిద్రపట్టలేదు. ఆయన కళ్ళముందంతా ఆ ఊరూ, ఆ ఊళ్ళో మనుషులూ, వాళ్ళు చూపించే అభిమానం, ఆ ఊరుకి తను చేసిపెట్టిన పనులూ, ఆ ఊరివాళ్ళ కృతజ్ఞతా, అమాయకమైన చూపుల్తో "మేష్టారండీ... మేష్టారండీ" అంటూ అభిమానాన్ని చూపించే బళ్ళో పిల్లలూ – యీ దృశ్యాలే కనిపించాయి. సరిగా నిద్రపోకుండానే ఆ రాత్రి ఆయనకు తెల్లారిపోయింది.

పొద్దున్న అరుగుమీద కూచుని దంతధావనం చేసుకొంటుంటే అటువైపుగా వెళ్తూ ముగ్గురు నల్గురు పలకరించి ఆ విషయమే అడిగారు. స్కూల్లోకూడా ఆయన వెళ్ళేసరికే అందరికీ ఆ వార్త తెలిసిపోయింది. పెందరాళే కొడుకూ, కూతురూ స్కూలుకి వెళ్ళిపోయి ఈ వార్త కాస్తా చాటేశారు. "మేష్టారూ మీరు వెళ్ళిపోతున్నారాండీ" అనో, "మీరు యిక్కడే వుండిపోండి మేష్టారూ" అనో, పిల్లలు ఒక్కొక్కరూ వచ్చి అడుగుతుంటే రామచంద్రం మాష్టారుకి ఆ ఊరుని నిజంగానే విడిచి పెట్టాలనిపించడం లేదు. ఆ రోజు క్లాసులో పాఠాలుకూడా సరిగా చెప్పలేదు. హెడ్‌మాష్టరు గారితో "ఆవలెల్లుండి లక్ష్మివారం రిలీవు అవుతానండి" అని చెప్తే "మీరు వెళ్ళక తప్పదంటారా మేష్టారూ" అని అడిగారు. ఆయనకి రామచంద్రం మేష్టారు పరిస్థితులన్నీ తెలుసు. వెళ్ళొద్దనీ అనలేదు. వెళ్ళిపోతే ఈ స్కూలు చిన్నబోతుందనీ ఆయనకు తెలీనిది కాదు.

ఆ సాయంకాలం స్కూలు విడిచిపెట్టే వేళకు హెడ్ మాస్టరుగారు రామచంద్రం మేష్టారుని తన రూముకి పిలిపించుకుని "మేష్టారూ! మన స్టాఫ్ వాళ్ళు మీకు పార్టీ యివ్వాలనుకుంటున్నారండి. పిల్లలు మీటింగు పెట్టాం అంటున్నారు. ఎల్లుండి మళ్ళీ మీకు తీరిక వుండదేమో. సర్పంచ్‌గారు ఆ రోజు పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు మధ్యాహ్నమే చెప్పారు. అందుకని మేము రేపు సాయంకాలం పెట్టుకున్నాం" అని చెప్పారు.

ఎందుకండీ ఈ ఆర్భాటమంతా అంటే వొప్పుకోలేదు.

ఇంటికొచ్చి ఆ విషయం భార్యతో చెప్పారు. "నిజమేనండి, ఇంతమంచి వూరుని విడిచిపెట్టాలంటే దిగులుగానే వుంది" అంది ఆమె.

రాత్రి తొందరగానే భోంచేసి ప్రైమరీ హెల్త్ సెంటరు కాంపౌండరు పరబ్రహ్మానికీ, గుళ్ళో పూజారి సుదర్శనాచార్యులవారికీ, అపరాల కొట్టు చంద్రయ్యకూ, యింకా అయిదారుగురు తెలిసినవారికీ తన ట్రాన్స్ఫర్ వార్త చెప్పి వచ్చారు. ఇంటికి వచ్చేసరికి అరుగుమీద సర్పంచ్, పంచాయితీ మెంబర్లూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

తన గురించి అంతమంది తరలివచ్చి ఎదురుచూస్తూ కూచోడం చూసి చాలా తప్పుచేసినట్టు క్షమాపణలు చెప్పుకున్నారు రామచంద్రం మేష్టారు.

"ఫరవాలేదు. దానికేంలెండి. ఏమీలేదు– ఎల్లుండి పంచాయతీ ఆఫీను ఆవరణలో చిన్న మీటింగు ఒకటి ఏర్పాటు చేద్దామనుకుంటున్నాం. మా సభ్యులు పార్టీకూడా ఏర్పాటు చేస్తున్నారు... అబ్బే అదేం కుదరదు, వొప్పుకోవలసిందే. మీకు మా ఊరు చాలా ఋణపడి వుంది పంతులుగారూ. మీరు వెళ్ళిపోవడం చాలా లోటు. ఏదో మా కృతజ్ఞత తెలుపుకుందామని. అంతే, మరేంలేదు"

రామచంద్రం మేష్టారు ఏదో అందా మనుకున్నారుగాని సభ్యులంతా తలా ఒకమాట చెప్పి, ఆయన్ని మరోమాట మాట్లాడనీయలేదు. మర్నాడు మధ్యాహ్నంనించి స్కూల్లో క్లాసులేం జరగలేదు. తోటి టీచర్లంతా చిన్న పార్టీ యిచ్చాక ప్రేయిర్ హాల్లో మీటింగు జరిగింది. హెడ్ మాస్టరుగారు అధ్యక్షత వహించారు. కొందరు ఉపాధ్యాయులూ, పిల్లలూ రామచంద్రం మేష్టార్ని గురించి మాట్లాడారు. పిల్లలు గుర్తుగా మేష్టారుకి ఒక ఖరీదైన పెన్ను బహూకరించారు. మేష్టారు కృతజ్ఞతలు చెప్పుకొనేప్పుడు ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన కంఠం బొంగురుపోయింది. ఎక్కువసేపు మాట్లాడలేకపోయారు.

మర్నాడు పంచాయతీ ఆఫీసు ఆవరణలో జరిగిన సభలో కూడా ఆయన ఎక్కువ సేపు మాట్లాడలేదు.

".....పంతులుగారి లాంటివారిని చాలా అరుదుగా చూస్తాం. ఆయన మన ఊరుకి చేసిన సేవను ఎవరూ మర్చిపోలేరు. ఈ ఊరుని ఎన్నోరకాలుగా బాగుచేసిన మహానుభావుడాయన. అలాటివారికి ఎలా మన కృతజ్ఞత తెలుపుకోవాలోకూడా నాకు తెలీకుండా వుంది" అన్నాడు సర్పంచ్. సర్పంచ్ పెద్ద కొడుకు యిరవైయేళ్ళవాడు ఆ ఊరి యువకమండలి తరఫున గాంధీగారి బొమ్మ ప్లాస్టర్ ఆఫ్ పేరిస్‌ది ప్రజంటు చేశాడు. ఊళ్ళో పెద్దలనుకునేవాళ్ళు పదిమందీ వచ్చి మాట్లాడారు.

రామచంద్రం మేష్టారు కండువాతో కళ్ళు తుడుచుకున్నారు. చాలా విషయాలు మాట్లాడుదామని లేచి నుంచుని మాటిమాటికీ కంఠం బొంగురుపోయి ప్రసంగం విరిగి పోతుండడంవల్ల ముందుకి పోలేక "...ఇంత మంచి ఊరునీ, ఇంత మంచి మనుషుల్నీ విడిచి వెళ్ళిపోవాలంటే నాకు చాలా బాధగా వుంది. ఈ ఊరుని నేనెప్పటికీ మర్చిపోలేను. మీ కందరికి నా నమస్కారం" అంటూ మధ్యలోనే ముగించేసి కూచుండిపోయారు. కండువాతో కళ్ళద్దాల్ని తుడుచుకున్నారు. అలా కళ్ళనుగూడా.

ఆ రాత్రి ఆయనగాని, ఆయన భార్యగాని నిద్రపోనేలేదు. వూరి కబుర్లు చెప్పుకుంటూ మేలుకునే గడిపారు. ఒక సమయంలో "పోనీ, ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ కేన్సిల్ చేయించుకుని యిక్కడే వుండిపోదామంటావా?" అని కూడా భార్యని అడిగారాయన. ఆమె "ఇంకా నయం. రాత్రి మీటింగులో నోరుజారి యీ మాట అన్నారుకారు" అని భర్తని మెల్లగా మందలించింది.

ఉదయం స్కూలు పిల్లలు వచ్చి సామాన్లు మూటలు కట్టేశారు. రామచంద్రం మేష్టారు స్కూలుకు వెళ్ళి ఛార్జీ వప్పజెప్పి ఊళ్ళో తెలిసినవాళ్ళందరికీ చెప్పి వచ్చేసరికి పన్నెం డయ్యింది. హడావుడిగా ఏదో యింతతిని ఒంటి గంటకి బస్టాండుకి చేరుకున్నారు. వారిని సాగనంపడానికి ఊరు ఊరంతా అక్కడే వున్నట్టుగా వుంది. స్కూలు నించి పిల్లలూ, మేష్టార్లూ వచ్చారు. సర్పంచ్‌తోసహా ఊరి పెద్దలంతా అక్కడే వున్నారు.

బస్సు వచ్చాక వాళ్ళే గబగబా సామానంతా పైకి ఎక్కించేశారు. మేష్టారి కుటుంబం లోపల సుఖంగా కూచోడానికి బస్సులో వాళ్ళని ఆర్భాటంచేసి విశాలంగా జాగా చేసి కూచోబెట్టారు. బస్సు కదిలినప్పుడు చేతులు జోడించిన మేష్టారుతో "మర్చిపోకండి మేష్టారుగారూ! ఎప్పుడైనా వస్తూ వుండండి" అంటూ అంతా ప్రతి నమస్కారం చేశారు.

బస్సులో కూచుని ఆలోచిస్తూన్న మేష్టారుకి ఈ అనుభవం తన జీవితంలో మర్చిపోలేనిదనిపించింది. ఇంతమంది యిలా తనమీద అభిమానం చూపించడం తన జీవితంలో యింతకు ముందెప్పుడూ ఎదురుపడలేదు. ఇంత మంచి మనుషుల్నీ, ఇంత మంచి ఊరునీ వదులుకొని వెళ్ళిపోయి తను పొరపాటు పనే చేస్తున్నానేమో అనికూడా అనుకున్నారాయన.

చెట్లమధ్య ఊరు మాయమై మరిక కనిపించడం మానేసేవరకు మాటిమాటికీ వెనక్కు తిరిగి చూస్తూనే వున్నారు.

ఆయన భార్య కూడా యించుమించు అదే స్థితిలో వుంది. పిల్లల మాట మరిక చెప్పనే అక్కరలేదు, దిగులుగా కూచుని కళ్ళల్లో నీళ్ళు నింపుకున్నారు. వెర్రిపిల్ల కూడా బస్సులో ఎక్కాలన్న ఉత్సాహం ఏమాత్రం లేకుండా దగ్గరగా ముడుచుకుపోయి దిగులుగా కూచుంది.

మూడున్నర గంటలు ఎలా ప్రయాణం చేసారో వాళ్ళెవరికీ గుర్తులేదు. మనసంతా అక్కడే ఆ విడిచి వచ్చేసిన వూళ్ళోనే వుంది. స్వగ్రామంలో అడుగుపెట్టాక స్వంత యిల్లు కనిపించాక, యింట్లో తల్లిని చూశాక మనసు కాస్త కుదుటపడింది. స్వంత వూరు చేరుకున్న సంతోషం మెల్లమెల్లగా ఆయన్ని ఆవరించింది.

రామచంద్రం మేష్టారు ఆ వూరును గురించీ, ఆ ఊళ్ళో మనుషుల మంచితనం గురించి చాలామందికి గొప్పగా చెప్పుకున్నారు. స్కూలు పిల్లలతో కూడా "అక్కడి బళ్ళో పిల్లలు చాలా మంచి వాళ్ళర్రా. శ్రద్ధగా చదువుకుంటారు. మేష్టర్లంటే భయభక్తులు చూపుతారు. అల్లరి చేయరు" అంటూ నీతివాక్యాలు బోధించినట్టు మూడు నాలుగుసార్లు చెప్పారు.

రామచంద్రం మేష్టారు వచ్చి పదిహేను రోజులు పైనే అయినా యింకా ఆ వూరు మాటిమాటికీ ఆయనకు గుర్తుకొస్తూనే వుంది. వచ్చిన అయిదు రోజులకు ఆ వూరి సర్పంచ్‌కు ఉత్తరం రాశారు. ఇంకా సమాధానం రాలేదు. మధ్యాహ్నం స్కూలునుంచి భోజనానికని యింటికి వచ్చినప్పుడు "ఉత్తరాలు ఏమన్నా వచ్చాయా?" అని అడిగితే భార్య కాస్త ఎగతాళిగానే మాట్లాడింది.

"పోస్టుమాన్ యింకా రాలేదు. అవునుగానీ, వూరొదిలి వచ్చినా మనసంతా అక్కడే వుంది మీకు. ఉత్తరం రాలేదని బెంగెట్టుకున్నారల్లే వుంది. చూస్తుంటే రేపు కూడా ఉత్తరం రాకపోతే ఎల్లుండి ఆ వూరు వెళ్ళొచ్చేట్టే వున్నారు" అంది.

"అవునుసుమా! ఒకసారి వెళ్ళొస్తే బావుండును" అన్నారాయన తనలో తనే అనుకుంటున్నట్టు. స్కూలుకి వెళ్ళిపోతూ "బహుశా ఉత్తరం వస్తుందేమోలే స్కూల్లో యివ్వమని చెప్పు" అని చెప్పి వెళ్లిపోయారు.

రామచంద్రం మేష్టారు స్కూలు విడిచిపెట్టే వేళవరకూ ఉత్తరం గురించి చూశారు గాని రాలేదు. ఒకవేళ యింట్లో పడేసి వెళ్ళిపోయాడేమో పోస్ట్‌మేన్ అనుకుంటూ హడావుడిగా యింటి కొచ్చిన రామచంద్రం మేష్టారుకి యింట్లో పరిస్థితి చూసేసరికి ఆశ్చర్యం వేసింది. ఇంట్లో ఓ మూల తల్లీ, మరోమూల భార్యా శోకాలు పెడ్తున్నారు. పిల్లలు ముగ్గురూ బిక్కమొఖాలు వేసుక్కూచున్నారు.

కొడుకును చూసి ముసలితల్లి కంఠం మరికాస్తా పెద్దది చేసింది.

"ఏమైంది?" అన్నట్టు చూశారు రామచంద్రం మేష్టారు.

ఆవిడ శోకాలు తీయడమే తప్ప ఏమీ చెప్పలేదు.

"ఏమైందే. చెప్పి, ఆ తర్వాత తీరిగ్గా ఏడవండి" అంటూ విసుక్కున్నారు భార్యను చూసి.

భార్య ముక్కు చీదుకుని ఏడుస్తూనే "ఇంకా ఏం జరగాలి, జరగాల్సినదంతా జరిగింది. మంచి వూరు మంచి వూరని వెళ్ళొచ్చేరు. ఇదేనా మంచి. అభమూ శుభమూ ఎరగని ఆ ఎర్రిదాని బతుకు బుగ్గిపాలు చేశారు కదా. ఒంట్లో నలతగా వుంటే ఏమిటోనని యిందాక డాక్టరు దగ్గరకి తీసుకెళ్తే తెలిసింది. దాన్ని చూస్తేనే కడుపు తరుక్కుపోతుందే. అలాటిదాని బతుకు పాడుచేయడానికి ఏ రాక్షసుడికి చేతులొచ్చాయో. ఎర్రిదన్న జాలైనా లేకుండా దాని జీవితాన్నిలా-" ఆమె ఇక మాట్లాడలేక గొల్లుమంది.

రామచంద్రం మేష్టారు రాయిలా ఆ గదిలో నిలుచుండిపోయారు. ✦

# జర్మనీలో శీలా వీర్రాజు కళాప్రదర్శన

అరుణ

**1970లలో** జర్మనీలోని గోటింజెన్ నగరంలోని విశ్వవిద్యాలయంలో శీలా వీర్రాజుగారి లేపాక్షి చిత్ర ప్రదర్శనను అక్కడి భారతీయ విద్యార్థి సంఘం తరపున, జర్మనీలో పిహెచ్.డి. చేస్తున్న దివి శ్రీధర్‌బాబు అనే మిత్రుడి సహాయంతో ఏర్పాటుచేశారు. 50 చిత్తరువులున్న ఈ ప్రదర్శనను ప్రొఫెసర్ హేమరుడోల్ఫ్ రోస్‌మన్ ఆవిష్కరించారు. అక్కడి పత్రికలు ఈ చిత్రాలపై సమీక్షలలో "స్వర్గంలోనూ, భూమిమీదా దేవతలూ, మానవులూ చేసిన నృత్యాలు యీ చిత్రాలలో కనిపిస్తాయి. వీటి ప్రతి భంగిమలోనూ ఒక అర్థం వుంది. శిల్పాలు ఎక్కువగా ఆభరణాలు ధరించి, నగ్నరూపాలలో వున్నాయి. శీలా వీర్రాజు తన ఫ్రీ హ్యాండ్ చిత్రాల ద్వారా భారతీయ సంస్కృతికీ, చిత్రకళారంగానికీ విశేషమైన సేవ చేశారు" అని రాశారు.

శీలావీ తను పనిచేస్తున్న సమాచారశాఖ ఆదేశాల మేరకు వ్యాసం రాయటానికి మిత్రులతో కలిసి లేపాక్షి వెళ్ళారు. హేతువాది అయిన వీర్రాజుగారు ఆయన మిత్రులు గుడిలో పూజలకి వెళ్తే ఆయన మంటపంలో కూర్చుని లేపాక్షి విగ్రహాల స్కెచ్‌లను గీశారు. లేపాక్షి శిల్పాలు మోల్డెన్‌రాక్ శిల్పాలపై చెక్కినవి కావటంతో సూక్ష్మమైన వివరాలు కనపడవు. కానీ వీర్రాజుగారు అతిసూక్ష్మమైన ఆ వివరాలను పరిశీలిస్తూ అద్భుతమైన స్కెచ్‌లు వేశారు. దీనిని 'శిల్పరేఖ' పేరుతో పుస్తకంగా ముద్రించారు. 1970లలోనే ఆయన హైదరాబాద్, బెంగుళూరులలో లేపాక్షి చిత్రాలతో వ్యక్తిగత ప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఒక్క లేపాక్షే కాదు రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోని (ఎల్లోరా, అజంతా, కోణార్క్ వంటి అనేక) శిల్ప కళాక్షేత్రాలను సందర్శించి రేఖాకృతుల్లో ఆ శిల్పాలను చిత్రించారు.

కళలు, కళారూపాలు ఏవైనా మానసిక ఉద్దీపనలను కలిగించటంతో పాటు సామాజిక ప్రయోజనకారిగా వుండాలని వీర్రాజుగారు నమ్మారు. దానిని ఆయన చిత్రకళారూపంలోనూ, సాహిత్య రూపాల్లోనూ ఆచరించారు. ఆయన కళారూపాలు ఆయన నమ్మిన భావజాల వ్యక్తీకరణగా వున్నాయి. తప్పితే ఆర్థికపరమైన ప్రయోజనాలతో ఆయన కళాకృషిని ముడిపెట్టలేదు.

శీలావి 1939 ఏప్రిల్ 22న రాజమండ్రిలో జన్మించారు. ఆయన స్వయంకృషితోనే చిత్రాలు వేయటం ప్రారంభించినా రాజమండ్రిలోని దామర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ స్కూలులో వరదా వెంకటరత్నం గురువుగారి వద్ద తర్ఫీదు పొందారు. ఆయనకు 14 ఏళ్ళ వయస్సులోనే 1953లో గోదావరిజిల్లా విద్యార్థి సమాఖ్య మహాసభల సందర్భంగా జరిగిన చిత్రకళా పోటీలలో ఆయన వేసిన 'ప్రయాణం' చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. 1956లో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే శ్రీపాద కృష్ణమూర్తి వీరి సన్మానం చేశారు. అదే ఏడాది గోదావరి పుష్కరాలు సందర్భంగా ఏర్పాటుచేసిన ఆయన చిత్రాలను ఎన్.టి. రామారావు ప్రారంభించారు. 1959లో మైసూరులో జరిగిన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలలో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో ఆయన గీసిన 'మధుర స్మృతులు' చిత్రానికి ఉత్తమచిత్రం అవార్డు వచ్చింది.

కళలు సామాన్యుల అవగాహనా పరిధిలో ఉండాలి. వారి సామాజిక సాంస్కృతిక జీవితంతో ముడిపడి వుండాలని గట్టిగా నమ్మిన వీర్రాజుగారు 1968లో 'కొడిగట్టిన సూర్యుడు' అనే తొలి కథాకావ్య రచనను చేశారు. అది తొట్టతొలి కథాకావ్య రచన. ఇందులోనే ఆ ఆ భావసంఘటనల ఆధారంగా 25కు పైగా నీటిరంగు చిత్రాలను చిత్రించారు. దీనికి బాలగంగాధర్ తిలక్ అవార్డు లభించింది.

కలమూ, కుంచె చేతబట్టినవారు బహు కొద్దిమంది మాత్రమే వుంటారు. అడివి బాపిరాజు తర్వాత శీలా వీర్రాజుగారే అంతటి ప్రావీణ్యతను సంతరించుకున్నారు. ఆయన పది కథాసంపుటాలను, నాలుగు నవలలను, తొమ్మిది కవితాసంపుటాలను, ఒక వ్యాస సంపుటిని, వర్ణచిత్రాల సంపుటిని, లేపాక్షి రేఖాచిత్రాల సంపుటలను వెలువరించారు.

ఆరు దశాబ్దాల శీలావీ చిత్రకళా గమనంలో సమాజానికీ, సంస్కృతీ సంప్రదాయాలకు, సామాన్యుడి జీవన విధానానికి అద్దం పట్టే విధంగా చిత్రాలు వేశారు. ఆయన చిత్రాలు చూస్తుంటే మనమూ ఆ భావావేశంలో భాగమవుతాం. ఆయన చిత్రాలు కదిలిస్తూ కథలు చెబుతాయి. ఆయన చిత్రాలు 'తర్వాత'లోకి మనల్ని నడిపిస్తాయి. బహువిధమైన వ్యక్తుల కూర్పుతో, అంశాల కూర్పుతో వుంటాయి. ఆయన మాటల్లోనే "ప్రజా జీవన రీతులకు అద్దం పట్టటానికీ, నేటి ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న సామాజిక కార్యకలాపాలను ప్రజల కళ్ళెదుట నిలపటానికి నేను ప్రయత్నం చేస్తుంటాను. నా చిత్రాలకు ప్రధాన ఇతివృత్తం ఇదే".

1960ల నాటి 'కళ' పత్రికకు, 'ఆంధ్రప్రదేశ్' పత్రికకు ముఖచిత్రాలు గీయటంతోపాటు వెయ్యికి పైగా పుస్తకాలకు ఆయన ముఖచిత్రాలు వేశారు. ఆయన చిత్రాలన్నీ సాంప్రదాయ చిత్రాలుగా, శ్రమైక జీవనాన్ని ప్రతిబింబించేవిగా, మనోదర్పణంగా, పౌరాణిక చిత్రాలుగా, ప్రకృతి చిత్రాలుగా, నిశ్చల చిత్రాలుగా, రేఖాచిత్రాలుగా ఉన్నాయి. నీటిరంగు చిత్రాలైనా, తైలవర్ణ చిత్రాలైనా తెలుగునాట 'దామెర్ల రామారావు స్కూలు' శైలి అయిన నియోరియలిజం శైలే శీలావీ చిత్రాల శైలి. ఆయన నీటిరంగు, తైలవర్ణ చిత్రాలను 'చిత్రకారీయం' పేరుతో పుస్తకంగా ముద్రించారు. 1979లో హైదరాబాద్ కళాభవన్‌లో ఒక ఇతివృత్తం ఆధారంగా 30కు పైగా నీటిరంగు చిత్రాల ప్రదర్శనను ఆయన ఏర్పాటుచేశారు. జనసాహితి ఆధ్వర్యంలో 2013లో హైదరాబాద్‌లోనూ, కావలిలోనూ, 2017లో విజయవాడలోనూ ఆయన చిత్రాల ప్రదర్శన జరిగింది.

'కవీ, ఓ కళాకారుడా,
కవయిత్రీ, ఓ కళాకారిణీ
అటా, ఇటా మీరెటువైపు
ప్రజలవైపా, ప్రభుతవైపా' – అని

రచయితలూ, కళాకారులూ ఎవరిపక్షం వహించాలో గోర్కీ తెలియచేసినట్లుగానే కలాన్నీ, కుంచెనూ సమ ఉజ్జీగా నడిపించిన కవి, రచయిత, చిత్రకారుడు, కథకుడూ శీలా వీర్రాజు ప్రజాపక్షపాతి. ఆయన జీవితమంతా ప్రజాపక్షపాతిగానే కొనసాగారు. ✦

వ్యాసం

# మారుతున్న విలువలు - రచయిత

- శీలా వీర్రాజు

**సమకాలీన** జీవితాన్ని అద్దంపట్టి చూపలేని ఏ సాహిత్యానికైనా ఆధునిక కాలంలో నిలిచే అర్హత లేదు. పాతకాలపు నాణెం ఎలా చెలామణీకి పనికిరాదో యిదీ అంతే. ఒక్క చారిత్రక ప్రాధాన్యత తప్ప మరో ప్రయోజనం లేదు. పాతకాలపు నాణెం ప్రభుత్వ ఖజానాల్లోనే గాని ప్రజల మధ్య చెల్లుబడి కానట్టే సమకాలీన జీవితాన్ని చూపలేని సాహిత్యం కూడా ఏ కొద్దిమందో ఉలిపికట్టెదార్ల మధ్య ప్రజల మధ్య చలామణీకి పనికిరాదు.

ఆధునిక కాలంలో ప్రపంచం అంతటా సామాజిక విలువలు మారిన తర్వాత సమాజానికి, సాహిత్యానికీ సన్నిహిత సంబంధం ఏర్పడింది. వ్యక్తి విలువలకన్నా సామాజిక విలువలు ముఖ్యమైనవన్న కొత్త సిద్ధాంతంతో సరికొత్త శకం ఆవిర్భవించడంతో కళ కళకొరకేనన్న రంగెలిసిపోయిన పాతకాలపు మడిబట్ట వాదనపోయి కళ సమాజం కొరకనే కొత్తవాదం బయలుదేరింది. సాహిత్యం యీ కళల్లో ఒకటి గనుకా, అన్ని కళల్లోకీ సాహిత్యమే ఎక్కువగా సమాజాన్ని ప్రభావితం చేయగల ముఖ్యమైన కళ గనుకా, సాహిత్యం తప్పనిసరిగా సమకాలీన దృక్పథాన్ని కలిగివుండాల్సినదైంది. ఇది ఆధునిక యుగలక్షణం. అందువల్ల సామాజిక జీవితంలో మార్పు వచ్చినప్పుడల్లా ఆ మార్పులు సాహిత్యంలోనూ విధిగా ప్రతిబింబించక తప్పదు.

అయితే యిప్పటికీ యీ మారిన విలువల్ని గుర్తించక రచనల పేరుతో వందలకొద్దీ పేజీలతో అబద్ధపు చరిత్రల్నీ, కుళ్ళి గబ్బుకంపు కొట్టే కులవ్యవస్థనీ, శుద్ధ ఫ్యూడలిజం మనస్తత్వాన్నీ చొప్పించి కాలానికి ఎదురీదాలనుకునేవారు లేకపోలేదు. ఇంకా మనం సంధికాలంలోనే వున్నాం. అందువల్ల యిటువంటి తిరోగమన నినాదాలు అక్కడక్కడా వినిపించక తప్పదు.

నిజానికి మనకు రాజకీయ చైతన్యంగానీ, సాంఘిక చైతన్యంగానీ అంతగా రాలేదు. "గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్" అనే పిచ్చి నమ్మకాన్ని వదులుకోలేని మూఢత్వంలో వున్నాం. అందుకే మనలో నరనరానికీ జీర్ణించుకుపోయిన మూఢాచారాల్ని, మారిన కాలంతోపాటు వదులుకోలేక, అవి మన ఉత్కృష్ట సంప్రదాయాలుగా, మన సాంస్కృతిక విలువలుగా నచ్చచెప్పుకోడానికి ప్రయత్నిస్తున్నాం. రాచరికాలు నశించి ప్రజాస్వామ్యాలు ప్రపంచమంతా తలెత్తినా, జమిందారీ విధానాన్ని రద్దుపరచి సోషలిజంను స్థాపించుకోడానికి ప్రయత్నిస్తున్నా యింకా మనం ఆ పాత వ్యవస్థలంటేనే మోజు చూపిస్తున్నామనడానికి యీనాడు కుప్పతిప్పలుగా వస్తోన్న, మనం గొర్రెల మందల్లా ఎగబడి చూస్తోన్న జానపద సినిమాలే తార్కాణం. సాంఘిక చిత్రాల్లో సైతం గ్రామీణ యితివృత్తంగల చిత్రాల్లో విధిగా జమిందారు వుండి తీరతాడు! జమిందారీ వ్యవస్థని కూలదోసినా యింకా ఆ వ్యవస్థమీద మోజు పోలేదు మనకు.

మనలో కనీసం రాజకీయ చైతన్యం వచ్చినంతగానన్నా సాంఘిక చైతన్యం రాలేదు. ఈనాడు జమిందారీ వ్యవస్థనుగానీ, రాచరిక వ్యవస్థనుగానీ తిరిగి ప్రతిష్ఠించడానికి ఏ రాజకీయవేత్తయినా ప్రయత్నిస్తే ఎంతమాత్రం అతన్ని క్షమించడంలేదు. అలాటివారిని కారాగారానికి పంపించడానికీ, లేదా దేశంనించి బహిష్కరించడానికీ ఏ మాత్రం వెనుకంజ వెయ్యడంలేదు. కాని, సంఘాన్ని మళ్ళీ పాతకాలపు వ్యవస్థలోకి తీసుకుపోవటానికి ఉద్యమంలాగ రచనలు చేసే రచయితల్నీ, కవుల్నీ ఏమీ చేయలేకపోతున్నాం. పైపెచ్చు వారికి భజన కూటాల్ని ఏర్పాటుచేసి బిరుదుల్నీ, బహుమతుల్నీ ప్రసాదిస్తున్నాం.

మన ఆలోచనల్లో మార్పురాక, మన అభిరుచుల్లో మార్పు లేక మేడిపళ్ళలా బ్రతుకుతున్నంతకాలం మన సాహిత్యంలో మాత్రం మార్పెలా వస్తుంది?

అందుకే యీనాటి మన రచనల్లో ఎక్కువవాటిలో మారుతున్న విలువలు ప్రతిబింబించడంలేదు. తెలుగు రచనలు సమకాలీన జీవితాన్ని చూపిస్తున్నాయనుకోవడం పొరపాటు. మనవి కేవలం సాంసారిక రచనలు. వంటింటి పోపు వాసనలతోనూ, పడకటింటి ముక్కు వాసనల తోనూ నిండిన రచనలు. పైగా మన వంటిళ్ళూ, మన పడకటిళ్ళూ ఎలా యిరుగ్గా వున్నాయో మన ఆలోచనలూ, మన సాహిత్యమూ అంతే యిరుగ్గా వున్నాయి. కొత్తగాలులు వీస్తే మైలపడి పోతామనే వారసత్వపు ఛాందస భావాల నుంచి పూర్తిగా మనం విముక్తులం కాలేకపోయాం. సరైన గాలీ వెలుతురూ లేనప్పుడు మొక్కలు పాలిపోక తప్పదు. మన ఆలోచనలూ అంతే. ఈ పాలిపోయిన ఆలోచనల వల్ల ఆరోగ్యవంతమైన సాహితీ కుసుమాలు పుష్పించడానికి ఆస్కారం లేదు.

రచనల్లో సమకాలీన సమాజం ప్రతిబింబించడంతోనే సరిపోదు. అది సమాజాన్ని ముందుకు తీసుకుపోయేదిగా వుండాలి. సామాజికమైన స్పృహ, ప్రగతి దృక్పథం వుండాలి. సమకాలీన సమాజంలో తిరుపతి దేవుడికీ, రకరకాల బాబాలకీ ప్రజల్లో పలుకుబడి వున్నంత మాత్రం చేత వాళ్ళ చరిత్రల్నీ, వాళ్ళ భక్తుల చరిత్రల్నీ అశాస్త్రీయమైన, అసంగతమైన వాళ్ళ మహత్వ గాథల్నీ చొప్పిస్తూ రాసే రచనలు నిజానికి సామాజిక దృక్పథం గల రచనలు కాలేవు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందింది. మానవశక్తి మీద విశ్వాసం పెరిగింది. సమాజం మారి, విలువలు మారాయి. ఈ మారిన విలువలను సాహిత్యంలో చూపక తప్పదు. వాటిని ప్రచారం చేసినా చెయ్యకపోయినా కనీసం యీ విలువల్ని గుర్తిస్తే చాలు. మన రచనలు సమాజాన్ని ముందుకు నడిపించడం అవసరం. నడిపించకపోయినా కనీసం దాన్ని వెనక్కు తిప్పేవిగా మాత్రం వుండకూడదు.

నిజానికి సాహిత్యం ఎప్పుడూ ఏకముఖంగా అభివృద్ధి చెందదు. రెండు శాఖలుగా విస్తరిస్తుంది. ఒకటి - ప్రగతిశీలం. రెండు - ప్రయోగశీలం. ప్రగతిశీలంతోపాటు ప్రయోగశీలం కూడా వున్నప్పుడే సాహిత్యం సుసంపన్నమౌతుంది. ప్రయోగాలు జరక్కుండా ఏ భాషా సాహిత్యమూ అభివృద్ధి చెందలేదు. ఒక్క ప్రగతివాద రచనలే సమాజానికి కావాలనుకుంటే పద్యాల్లో నవలల్ని కావ్యాలుగా రాసుకోవచ్చు. గ్రాంధిక భాషలో అభ్యుదయ సామాజిక విలువల్ని ప్రకటించుకోవచ్చు. గురజాడ వంటివారూ, గిడుగులాటివారూ

వ్యావహారిక భాషకై ఉద్యమాలను నడిపించవలసిన అవసరంలేదు. ప్రజలు మాట్లాడే భాషలో, ప్రజలకు సన్నిహితమైన భాషలో సాహిత్యాన్ని రూపొందించడానికి జీవితాల్ని ధారపోయనవసరంలేదు. భాష కూడా ఎప్పుడూ ఒక్కలాగే వుండిపోదు. కాలంతోపాటు అదీ మారుతూ వుంటుంది. ప్రయోగాలు అందుకు తోడ్పడతాయి.

అందుకే సాహిత్యంలో ప్రగతి దృక్పథంతోపాటు ప్రయోగ దృక్పథమూ వుండాలి. అయితే ప్రయోగాల పేరుతో సమాజానికి దూరంగా ఎగిరిపోవడంగానీ, అభ్యుదయ నిరోధక ధోరణులను ప్రకటించడంగానీ ఎంతమాత్రం కూడదు. ఒక రచన – అది ప్రగతిశీలమైనా, ప్రయోగశీలమైనా అది తప్పనిసరిగా అభ్యుదయ దృక్పథం కలిగివుండాలి.

అయితే అభ్యుదయ దృక్పథం పేరుతో కేవలం కొన్ని సిద్ధాంతాల మేనిఫెస్టోగానో, ప్రచార సాహిత్యంగానో వుండిపోగూడదు. సామాజిక విలువలతోపాటు సాహిత్యపు విలువల్ని కూడా చూపించగలగాలి. ఎంత అభ్యుదయ దృక్పథం కలిగివున్నా సాహిత్యపు విలువలు లేకపోతే అది సాహిత్య ప్రక్రియగా చలామణి కాలేదు. కుటుంబ నియంత్రణమీదా, పొదుపుమీదా రేడియోలో పుంఖానుపుంఖంగా వచ్చే రచనలు ఉత్తమ సాహిత్యంగా మనం ఎలా గుర్తించడంలేదో వీటి విషయంలోనూ అంతే. రచయిత ప్రవక్తా కాదు, రాజకీయవేత్తా కాదు. అతను ప్రధానంగా సాహితీవేత్త. ఆ విషయాన్ని మర్చిపోకుండా అతను ప్రవక్తలాగా, రాజకీయవేత్తలాగా ప్రవర్తించినా ఫరవాలేదు.

ప్రయోగ దృక్పథం, ప్రగతి దృక్పథం గల రచనల్ని సృష్టించే విషయంలో రచయితలకన్న కవులు చాలా ముందుకు పోగలిగారు. కవిత్వంలో వచ్చినంత వికాసం వచనంలో రాలేదు. వస్తువులో, శిల్పంలో కవిత్వం చాలా ముందుకు పోగలిగింది. తన బాధను లోకం మీద రుద్దే భావకవితనాటి స్వంత గోడువల్ల సమాజాన్ని ముందుకు నడిపించలేమని తెలుసుకున్న కవులు అభ్యుదయ కవిత్వాన్ని సృష్టించి లోకం బాధని తమ బాధగా చేసుకున్నారు. ఫ్యూడలిజం మనస్తత్వపు భావకవిత్వంనించి సోషలిజం దృష్టిగల అభ్యుదయ కవిత్వం తెలుగులో ఆవిర్భవించి సమకాలీన సమాజాన్ని చూపించడమేగాక భవిష్యత్ సమాజ స్వరూపాన్ని కవులు నిర్దేశిస్తూవున్న రోజుల్లో, రచయితలు వంటగదుల చుట్టూ, దేవుళ్ళచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భావకవిత్వం నుంచి అభ్యుదయ కవిత్వంలోకి కవిత్వం మారినప్పటి భావవిప్లవంగాని, శిల్ప విప్లవంగాని వచన రచనలో రాలేదు. ప్రయోగవాదంతోనూ, ప్రగతివాదంతోనూ కవిత్వం శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. ప్రయోగపరంగా వచనకవిత ఆవిర్భవించి బహుముఖాలుగా విస్తరించింది. ప్రగతిపరంగా, వర్గరహిత సమసమాజ స్థాపనకు ప్రపంచ మేధావుల ఆలోచనల్లో వచ్చిన అత్యాధునిక ఆలోచనాధోరణులు ఎప్పటికప్పుడు కవిత్వంలో ప్రవేశిస్తున్నాయి. ఇంత విప్లవం కవిత్వంలో వస్తూ వుంటే వచనంలో ప్రగతి దృక్పథంకాదుగదా, ప్రయోగదృక్పథం కూడా అంతగా కనిపించడంలేదు.

తెలుగు వచనంలో యిరవయ్యేళ్ళకిందటే కొద్దోగొప్పో ప్రయోగాలు జరిగాయి. చలం, బుచ్చిబాబు, విశ్వనాథశాస్త్రి, గోపీచంద్‌లు ఒక్కొక్కరూ ఒక్కొక్క ధోరణిలో ప్రయోగాలు చేశారు. వర్ణనలో, మనస్తత్వచిత్రణలో తాత్విక చింతనలో మేలైన రచనలు సృష్టించారు. సామాజిక దృక్పథం గల రచనలు కూడా ఆనాడే ఎక్కువగా వచ్చాయి. చలం, విశ్వనాథశాస్త్రి, కుటుంబరావులు సంఘంలోని అన్యాయాలమీద తిరుగుబాటును ప్రకటించారు. ఆనాడు కనిపించిన ప్రయోగం, సామాజిక దృష్టి యీనాడు మన కథల్లో, నవలల్లో కనిపించడంలేదు. రెండు దశాబ్దాల కాలంలో తెలుగు కవిత ఎంతో అభివృద్ధి చెందగా తెలుగు నవల, తెలుగు కథా ఎందుకు అభివృద్ధి చెందలేకపోయాయి? ఈనాడు తెలుగు నవల, తెలుగు కథ పూర్వంకన్నా ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. చదివేవాళ్లు పెరిగారు. రాసేవాళ్ళు పెరిగారు. కథల సంఖ్య, నవలల సంఖ్య పెరిగాయి. ఈ పెరుగుదలలు కనీవినీ ఎరుగనంత ఎక్కువగా వున్నాయి. కాని మారుతున్న విలువలను ప్రతిబింబించే రచనలు వీటిలో వేళ్ళమీద లెక్కపెట్టే సంఖ్యలో మాత్రమే వున్నాయి. బహుకొద్దిమంది రచయితలే మారుతున్న ఈనాటి విలువల్ని సాహిత్యంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. వీరైనా రాజకీయ విషయాలకు యిస్తున్నంత ప్రాధాన్యతను సాంఘిక విషయాలకు యివ్వడంలేదు. నిజానికి రాజకీయ వ్యవస్థలో మార్పులు తెచ్చి, తద్వారా సమాజంలో మార్పులు తేవడానికి ప్రయత్నించేవాడు – రాజకీయవేత్త. సామాజికమైన మార్పుల్ని తెచ్చి, వాటి ఆధారంతో రాజకీయ వ్యవస్థలో మార్పులు రప్పించేవాడు – రచయిత. ఈ ఇద్దరికీ ఎంతో తేడా వుంది మరి. ఆ విషయాన్ని మర్చిపోతే ఎలా?

సామాజికమైన మార్పుల్ని తీసుకురావడం అనేది చాలా బాధ్యతతో కూడుకున్న పని. ఎంతో శ్రమతో కూడినది కూడా. రచనావ్యాసంగాన్ని సీరియస్‌గా తీసుకుంటేనేగాని యిది సాధ్యంకాదు. దీనికి ఎంతో అనుభవమూ, విజ్ఞానము, అవగాహన, నైపుణ్యం వుండాలి. ఈనాటి చాలామంది రచయితలకు విస్తృతమైన అనుభవాలు లేవు. పుస్తకాల ద్వారానన్నా తెలుసుకొనే ప్రయత్నం లేదు. సమస్యలను గురించిన పరిజ్ఞానం లేదు. నైపుణ్యం అయితే వుంది. అయితే యిదొక్కటి వుంటే చాలదు. అప్పర్ క్లాస్ సొసైటీని చూపించాల్సి వచ్చినప్పుడు ఇంపాలాకార్లూ, పోర్టికోలూ, పచ్చని లాన్‌లూ, ఏరోడ్రోములూ పెట్టేసినంతమాత్రంచేత ఆ వాతావరణం ఏర్పడిపోతుందని భావించే రచయిత ఎంత చక్కగా రచన చేయగలిగినా, సరైన అవగాహనతో చేసిన రచనగా అది పరిగణించబడదు. ఆ వర్గం ప్రజల మనస్తత్వం, అలవాట్లు కనిపించాలి. అలాంటి అవగాహన, పరిశీలన లేకుండా రచనలు చేస్తే అవి అట్టేకాలం నిలవ్వు. కేవలం కాలక్షేపానికి మాత్రమే వుపయోగిస్తాయి.

తెలుగు నవల, కథ చేతులుమారి రచయిత్రుల హస్తగతమయ్యాక కాలక్షేపం ధోరణి మరీ ఎక్కువయిపోయింది. సాధారణంగా స్త్రీలలో సాహసం తక్కువ. సర్దుకుపోయే మనస్తత్వమేగాని ఎదురుతిరిగే తత్వంకాదు. అందువల్ల సంఘంలోని అన్యాయంమీద తిరుగుబాటు చేయడానికి వాళ్ళు అంతగా ముందుకు రాలేరు. దీనికితోడు యీనాటి పరితల్లో అధిక సంఖ్యాకులు స్త్రీలే కావడంవల్ల వారిని ఆకర్షించే రచనలకే రచయితలు సయితం మోజు చూపిస్తున్నారు. అందువల్ల కాలక్షేపం రచనలకు గిరాకీ పెరిగింది. సమకాలీన సమస్యలను చిత్రించే రచనలు కొరవడ్డాయి. సామాజిక దృష్టిగల రచయిత్రులు

ఒకరో, యిద్దరో వున్నా వారి దృష్టి కేవలం స్త్రీ స్వేచ్ఛకు, స్త్రీల సమస్యలకు మాత్రమే పరిమితమై పాక్షిక దృష్టి అయిపోయింది. వందలకొద్దీ సంవత్సరాలుగా స్త్రీని యిప్పుడిప్పుడే బైటపడుతున్నందువల్ల యీ కాలంలో వచ్చే రచయిత్రుల రచనల్లో యీ మాదిరి పాక్షిక దృష్టి వుండడం అసంగతమేమీ కాదు. అయితే యీ దృష్టినుంచి తప్పుకుని ఎంత త్వరగా సమగ్రమైన దృష్టిని ఏర్పరచుకుంటే అంత మంచిది. అప్పుడే వాళ్ళనుంచి సమకాలీన సామాజిక దృక్పథం గల రచనలు వెలువడతాయి.

రచయితలు – వారు మగవారైనా, మహిళలైనా – సమకాలీన సమాజాన్ని గూర్చీ, సమాజంలో మారిన విలువలను గూర్చీ, మారుతున్న విలువలను గూర్చీ తెలుసుకోవడం చాలా అవసరం. చారిత్రిక, భౌతిక సమస్యల అవగాహన కూడా వారి రచనల్ని శక్తివంతం చేయడానికి తోడ్పడుతుంది. ముందుచూపు అనేది రచయితకు వుండవలసిన ప్రాథమిక లక్షణం. ప్రపంచంతోపాటు ముందుకి నడిచే సత్తా రచయితలకు విధిగా వుండాలి.

శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి వార్తాపత్రికలు, రేడియో, టెలివిజను వంటివి రావడంతో; ప్రపంచంలో ఎక్కడ ఏ మార్పు వచ్చినా క్షణాల మీద ప్రపంచమంతా తెలిసిపోతున్న యీ రోజుల్లో, రచయితల అవసరం లేకుండానే ప్రజలు ఆయా మార్పుల్ని తెలుసుకోగలుగుతున్నారు. తదనుగుణంగా తమనితాము సంస్కరించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటప్పుడు ఆ మార్పుల్ని రచయితలు గుర్తించక రచనలు చేస్తుంటే వాళ్ళ అజ్ఞానాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటారు. వాళ్ళ తెలివితక్కువతనానికి జాలిపడతారు.

ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా వుండడానికే రచయిత ప్రయత్నించాలి. మారుతున్న ప్రపంచంతోపాటు తామూ మారాలి. మారిన విలువలకు అనుగుణంగా తమనితాము సంస్కరించుకోవాలి. వాటిని సాహిత్యంలో చూపించాలి. లేకపోతే తెలుగు రచయిత వెనకబడిపోతాడు. ప్రజలు ముందుకి వెళ్ళిపోతారు. అప్పుడు, యీనాడు వున్న గౌరవం కూడా తెలుగు రచయితకు లభించదు.

**(యువభారతి వ్యాససంకలనం 'రచన' నుండి, 1970)** ✦

కవిత

# విలువల వీర్రాజు

– రామ్మోహన్

జనం కళ్లకు కట్టిన గంతలను
కుంచెతో తెంచే ప్రయత్నం
ప్రజాసాహిత్యాన్ని
దేహమంతా నింపుకున్న కాన్వాస్
కలం కుంచె ప్రస్థానంలో
శిలావీది నిరంతర శ్రమత్వం
అయినా...
ఈ నిండుకుండది తొణకని స్వప్నం
నిశ్శబ్దం నిండుకున్న కాలంలో సైతం
కళ కళకోసం కాదన్న నిశ్చయం
ప్రజల కోసమే కళలంటూ
అందుకున్న జీవన నినాదం
పడుగు పేకల మధ్య ఉషస్సునీ...
సంధ్యా కాలాన్నీ...
ఔపోసనం పట్టిన సహనం
చిత్రలేఖనం.. కవిత.. కథ.. వ్యాసం...
ఏదైతేనేమి
వస్తువు ప్రజా సమూహమే
తన నదీపునాది
తీర గోదారి గమనంలా సాగుతూ
కాలాన్ని కావ్యసారంగా నింపుకున్న
కలకుంచెనాణెం
కలనేతనేసిన ఆణెం
పేదరికపు జ్ఞాపకాల ఎర్రదారప్పోగుల్ని
అటూ ఇటూ అలుపెరుగక
మోసుకొచ్చిన
జననాడుల 'నాడె'
దృష్టి కోణంలో నిత్యవిద్యానూతనం
శిల్పానికి మెరుగులు పెట్టిన
కళంకారీ చేతనం
మగ్గం గుంటల మధ్య నెమ్మదిగా
నడక నేర్చిన శ్రమతత్వం
ప్రభావాలు కూర్చిన
పోరాట ప్రాంతపు యవ్వనం
ఊరిబడిలోనేర్చిన జ్ఞానం
వెనకడుగు వేయని జనపక్ష సంకల్పం
చెక్కు చెదరని మనో నిబ్బరం
ప్రగతిశీలశక్తుల సాంస్కృతిక
స్నేహంతో కలిసి నడిచిన ధైర్యం
సంధ్యాకాలానికి... భయం లేని
అనుభవం
ముళ్ళు... రాళ్లు... మండు వేసవి...
ఇవేవీ.. గమనించని నిబ్బరం
నిశ్శబ్ద సమూహ సంచారి
మననంలో భౌతిక తత్వం
ఎలుగెత్తిన పిడికిళ్లతో పరుచుకున్న
కలం స్నేహపు పడుగు
కాలానికి ఇటూ అటూ నడిచి
వెలుగులు నింపిన రాజీలేని గొంతుక
చూడాల్సిన విజయం సుదూరమని
తలపుల్లో నైనా అనుకోని
అరుదైన శిలా శిల్పాల ప్రేమికుడు
సగం పూర్తిచేయకుండానే
నిష్క్రమించి
ఆ పాపికొండల చిత్రపటం ముందే
నిలుచున్న సంపూర్ణ మానవుడు
భౌతిక మనిషిగా మహా ప్రస్థానం
చెందినా....
దేహమంతా......
పాటించిన స్నేహపు విలువలే
వీర్రాజుధనం
సుభద్రాదేవి సహ ఇంధనం
స్వీయ సాహితీద్వయ సమన్వయం. ✦



'ప్రజాసాహితి' భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో

















PRAJA SAAHITI June 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI